# భూ పరాయీకరణ

ప్రొ. తోట. జ్యోతిరాణి



ప్రచురణ

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

AIKMKS అనుబంధం

# భూ పరాయీకరణ

ప్రొ. తోట. జ్యోతీరాణి

ప్రచురణ:

రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

AIKMKS అనుబంధం

**భూ పరాయీకరణ**

**ప్రొ. తోట. జ్యోతీరాణి**

*ప్రచురణ:*

**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**

AIKMKS అనుబంధం

ముద్రణ : **డిసెంబర్ 2025**

ప్రతులు : 500

వెల : **రూ. 60/-**

*ప్రతులకు :*

**మైత్రీబుక్ హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్

విజయవాడ - 2.

**కా॥ ఎస్. ఝాన్సీ**

అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)

తరిమెల నాగిరెడ్డి భవన్,

న్యూ గిరిపురం, విజయవాడ,

సెల్ : 9440319977.

*డిటిపి, లేఅవుట్ & కవర్ డిజైన్ :*

**అక్షర గ్రాఫిక్స్**

నల్లకుంట, హైదరాబాద్ - 44.

# విషయసూచిక


❖ ప్రచురణకర్తల మాట **5**

**1.** కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయటానికే భూసేకరణ - ప్రజల విస్థాపన **9**

**2.** ప్రజల భూములను స్వాధీనం చేసుకొని కార్పొరేట్ శక్తులకు అప్పగించే సాధనమే సెజ్‌ల విధానం **20**

**3.** సమస్త భూములను గుత్త పెట్టుబడులకు అప్పజెప్పటమే భారీ సౌరశక్తి ప్రాజెక్టుల అసలు లక్ష్యం **28**

**4.** వ్యవసాయ మార్కెటింగ్‌ను మొత్తంగా గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేస్తున్న NPFAM ముసాయిదా-2024 **38**

**5.** గుత్త పెట్టుబడులకు బదిలీ అవుతున్న భారతదేశ గనులు, ఖనిజ సంపద **47**

**6.** బడా కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ఉచితాలను రద్దు చేయాలి **56**

**7.** బలంగా అమలవుతున్న పాలకుల సామ్రాజ్యవాద, కార్పొరేట్ అనుకూల విధానాలు - తీవ్రమవుతున్న మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం **64**

# ప్రచురణకర్తల మాట

"భూ పరాయీకరణ" అన్న ఈ చిన్న పుస్తకం కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్. తోట. జ్యోతీరాణి గారు వివిధ సందర్భాల్లో రాసిన వ్యాసాల సంకలనం. అఖిల భారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (AIKMKS) అనుబంధ రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ఈ పుస్తకాలను తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ మీముందుకు తెస్తున్నది.

అభివృద్ధి ముసుగులో పెట్టుబడిదారీ వర్గం విశాల ప్రజానీకానికి చెందాల్సిన భూములు, అడవులు, నదులు, సముద్ర సంపద, గాలి, నీరు, మొత్తంగా ఉత్పాదక వనరులన్నింటినీ కొల్లగొడుతూనే వుంది. దీనివల్ల గ్రామాల్లో గానీ, గ్రామాలను తనలో కలిపేసుకుని విస్తరించిన మహానగరాల్లో గానీ భవిష్యత్తు సామాజిక అవసరాల కోసం కొద్దిపాటి స్థలాలు కూడా మిగిలేలా లేవు. వున్నటువంటి సాముదాయిక భూములను, స్థలాలను, ఉమ్మడి వనరులన్నింటినీ నిర్ధాక్షిణ్యంగా కొల్లగొట్టడం ద్వారానే దోపిడీ వర్గం తన సంపదలను అంతకంతకూ పెంచుకుంటున్నది. పేద, మధ్యతరగతి, ఇతర పీడిత వర్గాలకు చెందిన వ్యక్తిగత ఆస్తిగా వున్న చిన్న కమతాల భూమి వ్యవసాయేతర అనుత్పాదక రంగాలకు ఎటువంటి ప్రణాళికా లేకుండా కారుచౌకగా మళ్లించ బడుతున్నది. క్రమంగా రైతుల చేతి నుంచి పంట భూములతోపాటు అన్నిరకాల భూములు పరాయీకరణ చెందడం పెరిగింది. దీంతో ఈ భూముల ఉత్పాదకతతో పెనవేసుకున్న అన్ని సెక్షన్ల ప్రజల జీవితాలు దుర్భరమవుతున్నాయి.

అనేక రూపాలలో సాగే భూ పరాయీకరణ పర్యవసానాలు, ప్రభావాలు మొత్తంగా వ్యవసాయ రంగం పైన, ఉత్పాదకత పైన, స్థూల జాతీయోత్పత్తి పైనా తీవ్రంగా వున్నాయి. ఆహార పదార్థాల లభ్యత, రూపం మార్చుకుంటున్న పేదరికం, తీవ్రంగా

పెరుగుతున్న అన్నిరకాల అసమానతల రూపంలో ఈ ప్రభావాలను మనం చూడొచ్చు. దశాబ్దాలుగా ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ వారు చేపడుతున్న గనుల విధానం, ఇంధన వనరుల సేకరణ విధానం, భూసేకరణ విధానం, వ్యవసాయ, పారిశ్రామిక విధానాలు, ఎగుమతుల – దిగుమతుల విధానాలు దేశ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా ఏనాడూ లేవు. ఈ విధానాలు కోట్లాదిమంది ప్రజల జీవన సంక్షోభాన్ని పెంచుతూనే వున్నాయి.

నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల ద్వారా, ప్రపంచీకరణ విధానాల ద్వారా పాలకులు దేశ స్వావలంబన అన్న పదాన్ని ప్రశ్నార్థకం చేశారు. ప్రజల జీవన భద్రతను విశ్వ వ్యాపార సంక్షోభాల గొలుసుతో పీటముడి వేసి గాలిలో దీపంలా మార్చేశారు. రైతాంగానికి అనివార్యమైన పరిస్థితులు కల్పించడం వల్ల కూడా ఈ భూ పరాయీకరణ ఇంకా ఇంకా పెరుగుతున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే కోట్లాదిమందికి దీర్ఘకాలిక ఉపాధిని కల్పిస్తూ వస్తున్న వ్యవసాయ రంగాన్ని, దాని అనుబంధ పరిశ్రమలను, మార్కెట్ ను సామ్రాజ్యవాదులకు అప్పగించడంలో భాగంగానే ఈ భూ పరాయీకరణ నిరాటంకంగా సాగుతున్నది. దశాబ్దాలుగా సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ గుత్త పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను చేపడుతున్న భారత పాలకులే ఈ దుస్థితికి కారణం అన్న వాస్తవాన్ని ఈ పుస్తకంలోని వ్యాసాలు తెలియజేస్తాయి.

దేశంలో ఎగుమతి ఆధారిత, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నిర్మించాలని ఒకవైపు చెబుతూనే, సామ్రాజ్యవాద విధానాలకు, ప్రధానంగా అమెరికా వంటి దేశాలకు లొంగి, అత్యంత దారుణంగా దిగుమతి సుంకాలను తగ్గిస్తున్నారు. విదేశాల నుంచి టన్నుల కొద్దీ ఆహార పదార్థాలు, నూనె పదార్థాలు, పత్తి వంటి పారిశ్రామిక ముడిసరుకులు దిగుమతి అవడం వల్ల రైతాంగంపై పడుతున్న ప్రత్యక్ష ప్రభావాన్ని చూస్తూ గాలికి వదిలేస్తున్నారు. వ్యవసాయ రంగం రోజురోజుకీ కునారిల్లుతున్నా కూడా, గుత్తాధిపత్యంలోకి చేరిన కార్పొరేట్ రంగానికి లాభదాయకం కనుక పాలకవర్గాలు ఈ విధానాలను అమలుచేస్తున్నారు.

దేశంలో ప్రజలకు ఉపాధి లేకపోవడం, ఆహార పదార్థాల దిగుమతులపై ఆధారపడాల్సి రావటం – ఇవన్నీ ఒకవైపు సాగుతుండగా, జిడిపి పెరుగుదలను సాంకేతికంగా అంకెలుగా చూపిస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. రోజురోజుకీ

దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనం, విదేశీ అప్పులకు భారత ప్రభుత్వం చెల్లించే వడ్డీలు, రకరకాల రూపాల్లో చెల్లిస్తున్న రాయల్టీలు మన విదేశీ మారక నిల్వలను దారుణంగా ఖర్చు చేస్తున్నాయి. ఈ ప్రభావం అత్యవసర ముడిసరుకులు, ఇంధన వనరుల దిగుమతులపై పడుతున్నది. అంతకంతకూ బహుళజాతి కంపెనీలపై ఆధారపడే దుస్థితి పెరుగుతూ వున్నది.

దేశంలో పెరుగుతున్న ఉత్పాదక సంక్షోభం, దానికి ప్రధాన కారణమైన వ్యవసాయ రంగ సంక్షోభం వల్ల రైతాంగం కోల్పోతున్న సంపద లెక్కించలేనంతగా మారింది. పాలకుల విధానాల ఫలితంగా రైతాంగంలో వ్యవసాయంపై ఏర్పడుతున్న నిరాసక్తత కూడా భూ పరాయీకరణకు పరోక్షంగా సహకరిస్తున్న అంశమే. ఎక్కడ సాగు భూములు, విలువ కలిగిన భూములు వుంటాయో అక్కడే ఈ భూ పరాయీకరణ ఎక్కువగా జరగడం పెట్టుబడిదారీ వర్గం యొక్క అసలు లక్ష్యాన్ని విప్పి చెబుతున్నాయి.

చట్టబద్ధంగానే లక్షల ఎకరాల భూములు ప్రైవేటు యాజమాన్యాల ఎస్టేట్లుగా, వ్యవసాయ క్షేత్రాలుగా మారిపోతున్నాయి. చివరికి ప్రయివేటు ఫారెస్టులు, జంతు ప్రదర్శనశాలలుగా మారిపోతున్నాయి. ప్రైవేటు యాజమాన్యాల పరిశ్రమల అవసరాల పేరుతో, విస్తరణ పేరుతో రోజురోజుకీ లక్షల ఎకరాల భూముల్ని రైతాంగం నుంచి గుంజుకోవడానికి పాలకవర్గమే భూసేకరణ పేరుతో ఒక దళారీగా మారి పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు సేవ చేస్తున్నది. ఈ పరిణామాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతాంగాన్ని అణిచివేస్తున్నది. సంవత్సరాల తరబడి రైతాంగం ఢిల్లీ, పంజాబ్ కేంద్రం గానూ, కర్ణాటక దేవనహల్లి వంటి కొన్నిచోట్ల అనేక పోరాటాలు సాగించి విజయం సాధించడం మనం చూసాం.

రకరకాల పద్ధతుల్లో కంపెనీ వ్యవసాయాన్ని ముందుకు తెచ్చి రైతులకు ప్రత్యామ్నాయంగా చూపిస్తున్నారు. మార్కెట్, నిల్వ వ్యవస్థలను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకొని రైతాంగాన్ని నష్టాల పాల్జేసి, తమంతట తాముగా భూములను కార్పొరేట్ శక్తులకు అమ్ముకోవడం లేదా లీజుకు ఇవ్వక తప్పదని చెబుతున్నారు. ఇది తీవ్రమైన ఆహార సంక్షోభానికి దారితీస్తుందని, అనేక విధాలుగా విదేశాలపై ఆధారపడే క్రమాన్ని పెంచుతుందని తెలిసి కూడా పాలకవర్గాలు ఈ చర్యలను చేపడుతున్నాయి.

పెట్టుబడిదారీ అభివృద్ధికి, దాని సహజ సంక్షోభానికి, పేద దేశాలలో జరిగే భూ పరాయీకరణలకు ప్రత్యక్ష సంబంధం వుంటుంది. మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రమవుతున్న ప్రతి సందర్భంలో భూములను పెట్టుబడిగా మార్చుకునే క్రమం, తద్వారా పెట్టుబడిదారీ సంక్షోభం నుంచి బయటపడే ప్రయత్నాలూ మనకు కనిపిస్తుంటాయి. అడుగడుగునా లక్షల ఎకరాల భూములను అత్యంత క్రూరమైన పద్ధతుల్లో స్వాధీనం చేసుకునే ఈ పెట్టుబడిదారీ వర్గం తన అనుకూల మేధావుల చేత దున్నేవానికే భూమి, వ్యవసాయ విప్లవం అన్న నినాదాలను, భూమిలేని పేద రైతుల కోసం భూమి పంచాలని అడగడాన్ని ఎగతాళి చేయిస్తూ వుంటుంది.

అభివృద్ధి పేరిట పాలకులు పరిశ్రమల కోసం, పెద్దపెద్ద నీటి ప్రాజెక్టుల కోసం, గనుల కోసం అంటూ గ్రామాలకు గ్రామాలను విస్తాపనకు గురిచేసి, ప్రజల జీవితాలను విధ్వంసం చేసిన దుస్థితిని మనం చూశాం. కార్పోరేట్ శక్తుల దోపిడీకి అనుకూలమైన అటవీ చట్టాలను, ఇతర చట్టాలను పార్లమెంటులో చేసుకుని లక్షల ఎకరాల ఫారెస్టు భూములను వారికి కట్టబెడుతున్నారు. ఇటీవలి కాలంలో సోలార్ ప్లాంట్ల కోసం పంట భూములను సైతం వదలకుండా “ఇర్రివోకబుల్ పవర్ అఫ్ అటార్నీ” లీజుల పేరుతో భూములపై అనేక విధాలుగా హక్కును పొందుతున్న పరిస్థితి వుంది. పెట్టుబడిదారీ శక్తులు రైతుల నుంచి భూమిని అతి తక్కువ ధరలకు సేకరించటం ద్వారా లేదా కౌలు పద్ధతిలో తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నాయి. వ్యవసాయ రంగం నుంచి భూమిని ఇతర కార్పొరేట్ అవసరాలకు మళ్ళిస్తున్న క్రమంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాలకులు ఇచ్చిన హామీలకు, కల్పించిన ఉద్యోగాలకు పొంతనే లేదు.

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన సమస్త అంశాలు భూకబ్జాల మీదనే – అంటే సాగు భూములు, బంజరు భూములు, అడవులు, ఖనిజాలు, సమిష్టి ఆస్తి వనరులను ఆక్రమించుకోవడంతోనే ముడిపడి వుంటుంది. ఈ క్రమంలోనే లక్షలాది ఎకరాల భూములను అభివృద్ధి పేరిట, సెజ్‌ల పేరిట స్వాధీనం చేసుకోవడం వలన లక్షలాదిమంది రైతులు, రైతుకూలీలు, ఆదివాసీలు భూముల నుండి, జీవనోపాధుల నుండి పరాయీకరించబడ్డారు. జీవన విధ్వంసానికి బలవుతున్నారు.

ఈ అభివృద్ధి నమూనా వల్ల ఏర్పడిన వాతావరణ సమస్యకు పరిష్కారంగా పాలకులు సోలార్ ఎనర్జీ ఉత్పత్తి పేరుతో లక్షలాది ఎకరాల భూములను కార్పొరేటు దిగ్గజాలకు అప్పజెబుతున్నారు. గనులను ప్రైవేటీకరించి లాభాల కోసమే పనిచేసే గుత్త పెట్టుబడులకు అప్పజెప్పడం వలన మెజారిటీ ప్రజల జీవితాలు సంక్షోభంలోకి నెట్టివేయబడటమే గాక గోతులతో నిండిన డొల్ల భూములే మిగులుతాయి. 86 శాతం చిన్న రైతులే వున్న వ్యవసాయ రంగం నుండి వీళ్ళని వెళ్లగొట్టడానికి స్వేచ్ఛా మార్కెట్ పేరుతో వ్యవసాయ మార్కెట్ మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెబుతున్నారు. వీరికి ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తూ ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్న లక్షల కోట్ల రుణాలను రద్దు చేస్తున్నారు. పాలకుల ఈ దోపిడీ విధానాల వల్ల మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం రోజురోజుకీ తీవ్రమవుతున్నది. ఈ అంశాలన్నింటినీ ఈ పుస్తకంలోని వ్యాసాలు స్పష్టంగా వివరిస్తాయి.

ఉత్పాదక శక్తుల చేతుల నుంచి భూమి కార్పొరేట్ల చేతికి పరాయీకరణ కావడం ఎన్ని రూపాల్లో జరుగుతుందో, దాని పర్యవసానాలేమిటో, లక్షలాది ఎకరాల భూముల నుండి రైతులను విస్తాపనకు గురి చేయడం వల్ల వారి జీవితాలు ఎలా సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయో ఈ వ్యాసాల్లో ఆధారాలతో సహా ప్రొఫెసర్ తోట. జ్యోతీరాణి గారు స్పష్టంగా విశ్లేషించారు. అనేక సందర్భాల్లో రాసిన ఈ వ్యాసాలు జనశక్తి, క్లాస్ స్ట్రగుల్ (ఇంగ్లీషు) పత్రికల్లో అచ్చయ్యాయి. ఈ పుస్తకాన్ని అన్ని వర్గాల ప్రజల మధ్యకు తీసుకెళ్ళడం, ప్రచారం చేయడం ద్వారా రైతాంగ పోరాటాలకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

**విజయవాడ,**
**24-12-2025.**

ఉద్యమాభినందనలతో
**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**
AIKMKS అనుబంధం

1

# కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయటానికే భూసేకరణ - ప్రజల విస్తాపన

దేవనహళ్ళికి చెందిన 13 గ్రామాల నుండి ఏరోస్పేస్ నిర్మాణం కోసం ప్రారంభించిన భూసేకరణను రద్దు చేస్తున్నట్లు జూలై 15, 2025న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. దేశంలో ఇదొక సంచలన వార్త అయింది. రైతుల సంఘటిత పోరాటాల విజయంగా ప్రచారమైంది. అప్పటికే రైతులు మూడుసార్లు తమ భూములను కోల్పోయారు. దాంతో మిగిలిన 1778 ఎకరాల తమ సాగు భూములను రక్షించుకోవాలన్న లక్ష్యం వారిలో బలపడింది. సీరియస్‌గా, నిలకడగా, సంఘటితంగా 1198 రోజులుగా పోరాడుతూనే వున్నారు. ఈ పోరాటానికి గ్రామీణ ప్రజల, రైతు సంఘాల, ప్రజాసంఘాల బలమైన మద్దతు లభించింది. భూ సేకరణ రద్దు ప్రకటన ప్రభుత్వానికి తప్పనిసరయింది. కానీ ఈ ప్రకటన ఎంతకాలం కొనసాగుతుందన్నదే ప్రశ్న.

ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి మరియు ఐటి శాఖామంత్రి నారా లోకేష్ ఏరోస్పేస్ ప్రాజెక్టును తాము ఆహ్వానిస్తున్నామని, తమ వద్ద 8,000 ఎకరాల భూమి సిద్ధంగా వున్నదని, అనంతపూర్ ఈ ప్రాజెక్టుకు అనుకూలంగా వుంటుందని ప్రకటించారు. కాగా, దీనికి ప్రతిస్పందనగా కర్ణాటక పరిశ్రమల శాఖా మంత్రి ఎం.బి. పాటిల్, రద్దు ప్రకటనతో ఏరోస్పేస్ ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోదన్నాడు. దేవనహళ్ళి లోనే కొంతమంది రైతులు 700 ఎకరాలను ఇవ్వటానికి సిద్ధంగా వున్నారన్నాడు. అంటే ఈ ప్రాజెక్టు నిర్మాణం ఆగదు. కర్ణాటకలో దేవనహళ్ళి

లోనే కొనసాగవచ్చు లేదా ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ కావచ్చు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల రైతుల, గ్రామీణ ప్రజల విస్తాపన కొనసాగుతూనే వుంటుంది. కాబట్టి తమ సాగు భూమిని రక్షించుకోవడానికి, బతుకుదెరువు కోసం రైతుల పోరాటాలు బలపడాల్సిందే.

2006 లో టాటా గ్రూపుకు చెందిన టెల్కో నానో ప్రాజెక్టు కోసం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సింగూర్, నందిగ్రాం లలో దాదాపు 1000 ఎకరాల భూమిని సేకరించింది. దీనిని వ్యతిరేకిస్తూ 2007 లో ప్రజలు ప్రాణాలకు తెగించి పోరాడారు. ప్రజల పోరాట ఒత్తిడి వల్ల 2008లో టెల్కో ప్రాజెక్టును టాటా గ్రూపు ఉపసంహరించుకున్నది. కానీ ఈ ప్రాజెక్టు గుజరాత్‌కు బదిలీ అయింది. పశ్చిమ బెంగాల్ నుండి విస్తాపన గుజరాత్‌కు బదిలీ అయింది.

అయితే, పశ్చిమ బెంగాల్‌లో ఆ తరువాత అధికారంలోకి వచ్చిన తృణమూల్ కాంగ్రెస్, సింగూర్, నందిగ్రాం రైతులకు ఇచ్చిన హామీ కోసం టాటా సంస్థకి ఇచ్చిన 1000 ఎకరాల భూమిని వాపసు తీసుకొని, భూమిని కోల్పోయి పోరాటం చేసిన రైతులకు ఇవ్వటానికి “సింగూర్ ల్యాండ్ రిహాబిలిటేషన్ అండ్ డెవలప్మెంట్ యాక్ట్, 2011” ను రూపొందించింది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ టాటా సంస్థ సుప్రీంకోర్టులో కేసు వేసింది. 2016లో ప్రభుత్వ భూసేకరణను సుప్రీంకోర్టు రద్దు చేసింది.

సింగూర్‌లో తమ ప్రాజెక్టును ఆపినందుకు నష్టపరిహారం కావాలంటూ టాటా సంస్థ కేసు పెట్టింది. 30 అక్టోబర్, 2023న ఈ సంస్థకు 700 కోట్ల రూపాయలతో పాటు 11 శాతం వడ్డీని నష్టపరిహారంగా చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. పోరాడిన రైతులకు తమ భూములు తమకు రావటానికి 10 సంవత్సరాలు పట్టింది. ఈ పది సంవత్సరాలలో ఆ రైతుల బతుకు విధ్వంసానికి లెక్కలుండవు, వడ్డీలుండవు. కానీ టాటా సంస్థకు చెందిన టెల్కో, పశ్చిమ బెంగాల్ నుండి గుజరాత్‌కు బదిలీ అయింది. పైగా పశ్చిమ బెంగాల్‌లో ప్రాజెక్టును ఉపసంహరించుకున్నందుకు నష్ట పరిహారం పొందింది. పాలకవ్యవస్థలు ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తాయో స్పష్టం అవుతూనే వున్నది.

## భూసేకరణ వ్యతిరేక పోరాటాలు:

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ ఆవిర్భావం, అభివృద్ధి రెండూ కూడా భూమిని కబ్జా చేసుకోవటంతో బలంగా ముడిపడి వుంటాయి. ప్రజల భూములను, సాగు భూములను, సమస్త సమిష్టి ఆస్తి వనరులను, అడవులను, కొండలను, గుట్టలను, ఖనిజాలను మొత్తంగా స్వాధీనం చేసుకోవడానికి గుత్త పెట్టుబడులు బలంగా ముందుకు వస్తున్న సందర్భం ఇది. ఇందుకు ప్రభుత్వాలు తమ చట్టాలతో, రెవెన్యూ, పోలీసు

వ్యవస్థలతో మద్దతునిస్తున్నది. అందువల్లనే భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ప్రజలందరూ ఎక్కడికక్కడ బలంగా, విస్తృతంగా పోరాటాలు చేస్తూనే వున్నారు.

తూర్పు ఆఫ్రికాకు చెందిన మడగాస్కర్ దేశ ప్రభుత్వం 2009లో దక్షిణ కొరియా కంపెనీ ప్రాజెక్టు కోసం 24 లక్షల 71 వేల ఎకరాల భూమిని లీజుకి ఇవ్వటానికి సిద్ధపడింది. దీనికి వ్యతిరేకంగా ప్రజలు చేసిన బలమైన పోరాటాల వల్ల ప్రాజెక్టు ఆగిపోయింది. దేశాధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేశాడు. ప్రజల పోరాటానికి వున్న శక్తికి ఇదొక సాక్ష్యం.

పశ్చిమ బెంగాల్‌లో 2006లో ప్రభుత్వం చేపట్టిన భారీ భూసేకరణకు వ్యతిరేకంగా పెల్లుబికిన రైతుల, ప్రజల ఉద్యమాల వల్ల సింగూర్‌లో టెల్కో ప్రాజెక్టుతో పాటు చాలా ప్రాజెక్టులు ఆగిపోయాయి.

ఒడిషాలోని జగత్ సింగపూర్‌కి చెందిన 8 గ్రామాల నుండి భూమిని సేకరించి, స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాలని 2005లో పోస్కో ఇండియా మరియు ఒడిషా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. దీనికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు బలంగా కొనసాగడంతో పోస్కో తన ప్రాజెక్టు ప్రతిపాదనను విరమించుకోక తప్పలేదు. ప్రస్తుతం మళ్ళీ ఈ రాష్ట్రానికి రావటానికి పోస్కో ప్రయత్నిస్తున్నది. ప్రజా పోరాటాల వల్ల కార్పొరేట్ శక్తులు తమ ప్రయోజనాలను తాత్కాలికంగా వాయిదా వేసుకుంటాయి.

ఒడిషాలో నియాంగిరి కొండ ప్రాంతంలో, సిజిమలి ప్రాంతంలో వేదాంత రిసోర్సెస్ కంపెనీ, బాక్సైట్ మైనింగ్ ప్రాజెక్టులను ప్రతిపాదించింది. నియాంగిరి కొండ ప్రాంతాల్లో నివసించే డోంగ్రియా కోండ్ గిరిజనులు, సిజిమలి ప్రాంత ప్రజలు ప్రాజెక్టును సీరియస్‌గా వ్యతిరేకించారు, తీవ్రంగా పోరాడారు. ప్రభుత్వాలకు ప్రాజెక్టును నిలిపివేయక తప్పలేదు.

ఉత్తరప్రదేశ్‌లో పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంతో గ్రేటర్ నోయిడా నుండి ఆగ్రా వరకు 165.5 కిలోమీటర్ల పొడవుతో 6 రోడ్ల యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్ వే ప్రతిపాదనను ప్రజలు సీరియస్‌గా వ్యతిరేకించారు. చాలా సంవత్సరాలు ప్రాజెక్టు ఆగిపోయింది. కానీ 2012లో పూర్తి చేశారు.

2007లో చెన్నై విమానాశ్రయ విస్తరణ కోసం 5 గ్రామాల నుండి 1066.99 ఎకరాల భూసేకరణకు వ్యతిరేకంగా భూమి స్వంతదారులు, స్థానికంగా నివసించే ప్రజలు పోరాడారు. ప్రాజెక్టు నిర్మాణం నిలిచిపోయింది.

కర్నాటక రాష్ట్రం, బళ్లారిలో వున్న రెండు ఎయిర్ పోర్టులు చాలవని మూడవ ఎయిర్ పోర్టు కోసం చాగనూరు, సిరివర అనే గ్రామాల లోని 900 ఎకరాల కోసం

ఇచ్చిన భూసేకరణ ప్రకటనను ఆ రెండు గ్రామాల ప్రజలు రైతుసంఘంగా సంఘటితపడి 13 సంవత్సరాలుగా ప్రభుత్వాలను ఎదిరిస్తూ వస్తున్నారు. వందలమంది రైతులు, రైతుకూలీలు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఇప్పటివరకు ఆ భూముల్లోకి ఎవరినీ అడుగు పెట్టనివ్వకుండా కాపాడుకుంటున్నారు. కోర్టులో కేసులు నడుస్తున్నాయి.

గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ప్రవహించే నర్మదా నది మీద రెండున్నర లక్షల మంది ప్రజలను నిర్వాసితులను చేస్తూ, అనేక గ్రామాలను ముంపుకు గురిచేస్తూ నిర్మించాలనుకొన్న అతిపెద్ద ప్రాజెక్టు, సర్దార్ సరోవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఆదివాసీలు, రైతులు, పర్యావరణవేత్తలు, మానవహక్కుల కార్యకర్తలు "నర్మదా బచావో ఆందోళన" గా ఏర్పడి, సంఘటితంగా సుదీర్ఘకాలం పోరాడారు. కోర్టులో కేసులు వేశారు. 1961లో మొదలైన ఈ ప్రాజెక్టు ప్రతిపాదనకు 1979లో ప్రణాళిక రూపొందింది. దీనికి ప్రపంచబ్యాంకు నిధులను ఇస్తానన్నది. 1987లో పనులు మొదలైన నాటి నుండి వ్యతిరేక ఆందోళన ముమ్మరమైంది. 1995లో సుప్రీంకోర్టు, ఈ ప్రాజెక్టును ఆపివేయాలని ఉత్తర్వులనిచ్చింది. ప్రపంచబ్యాంకు నిధులను ఉపసంహరించుకున్నది. కానీ సుప్రీంకోర్టు సూచనలతో ప్రాజెక్టు ఎత్తును తగ్గించి 2000-01 లో ప్రాజెక్టును తిరిగి మొదలుపెట్టారు. 2017 కి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది.

"అభివృద్ధి కోసమే విస్తాపన" అని పాలకవర్గం చెబుతున్నది. కాగా, మెజారిటీ ప్రజల జీవన విధ్వంసంతో జరుగుతున్న అభివృద్ధి ఎవరి కోసం అంటున్న పీడిత వర్గం గుత్త పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ నమూనానే ప్రశ్నిస్తున్నది.

## భూసేకరణ చట్టాలు - చట్టబద్ధంగా భూముల స్వాధీనం:

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ మనుగడకు, అపరిమిత పెట్టుబడుల అభివృద్ధికి భూకబ్జానే పునాది. ప్రజల భూములను, రైతుల సాగు భూములను, పీడితవర్గం బతుకుకు ఆసరాగా వున్న సమిష్టి ఆస్తి వనరులు, అడవులు, కొండలు, గుట్టలు, సమస్త భూ సంపదను ఆధిపత్య వర్గానికి చట్టబద్ధంగా స్వాధీనం చేయడానికే భూసేకరణ చట్టాలు రూపొందాయి. రోజురోజుకీ బలపడుతున్న మార్కెట్ శక్తుల స్వేచ్ఛా సంఘర్షణ, స్వేచ్ఛా మార్కెట్, సరళీకరణ మొదలైనవేవీ ప్రజల భూముల విషయంలో వర్తించవు. అందుకే "Eminant Domain" సూత్రాన్ని పాలకులు బలంగా అమలుపరుస్తున్నారు. దీని ప్రకారం, "ప్రజా ప్రయోజనం కోసం" ప్రభుత్వానికి ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు వుంటుంది. అంటే భూమిని స్వాధీనం చేసుకోవడం సార్వభౌమత్వ ప్రభుత్వాల హక్కు. ఈ చట్రంలోనే రూపొందిన భూసేకరణ చట్టాలు బలంగా అమలవుతున్నాయి.

"స్వాతంత్ర్యానంతర" భారతదేశం సోషలిస్టు తరహా సమాజ స్థాపనను లక్ష్యంగా ప్రకటించింది. అందుకు అనుగుణంగానే పంచవర్ష ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పింది. కానీ ప్రకటించిన లక్ష్యానికి విరుద్ధంగా 1945లో దేశీయ బడా పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం, లాభాల కోసం రూపొందించిన 'బొంబాయి ప్రణాళిక'ను ఆమోదించింది. అందువల్లనే శీఘ్రంగా, అధిక లాభాలనిచ్చే వినియోగ వస్తు రంగాన్ని ప్రైవేటు రంగానికి అప్పజెప్పింది. అందుకనుగుణంగానే పారిశ్రామిక విధాన తీర్మానం, 1956ను రూపొందించింది. అందులో భాగంగా విద్యుత్ ఉత్పత్తి కోసం థర్మల్ ప్లాంట్‌లు, బొగ్గు, చమురు తవ్వకాలు, భారీ నీటి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల రంగానికి సంబంధించిన రోడ్లు, హైవేలు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు మొదలైన వాటి నిర్మాణానికి భారీ స్థాయి పెట్టుబడులను దీర్ఘకాలం పెట్టాలి. ప్రధానంగా అత్యధిక స్థాయిలో భూములను సేకరించాలి. అందువల్లనే భూసేకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగటానికి బ్రిటిష్ వలస పాలన 1894 లో రూపొందించిన భూసేకరణ చట్టాన్ని భారతదేశ ప్రభుత్వం రద్దు చేయకుండా ఆమోదించింది. భారీ స్థాయిలో భూములను సేకరించింది. ప్రభుత్వమే నిర్వచించిన "ప్రజా ప్రయోజనం" భూసేకరణకు ప్రాతిపదికగా వున్నది. తగిన నష్టపరిహారం, తరతరాలుగా ఆ ప్రాంతంలోనే జీవిస్తూ ప్రాజెక్టు వల్ల ఒక్కసారిగా విస్తాపనకు గురైన ప్రజల పునరావాసం, పునర్నిర్మాణాలకు సంబంధించిన నిబంధనలు ఈ చట్టంలో లేవు. ఇవేవీ ప్రజల ప్రయోజనాల కేంద్రంగా రూపొందినవి కావు.

1990లో ప్రపంచీకరణ ప్రవేశించింది. గుత్త పెట్టుబడుల కోసం భారీ స్థాయి భూసేకరణ అవసరమైంది. 2005లో ఆమోదించిన సెజ్‌ల చట్టంతో భూసేకరణ ఉధృతంగా ముమ్మరమైంది. ప్రాజెక్టు నిర్మాణాలకు కావలసిన భూముల కంటే చాలా అధికంగా భూమిని సేకరించారని కాగ్ నివేదికలే చెబుతున్నాయి. దీనివల్ల ప్రజల జీవితాలు ఉక్కిరిబిక్కిరయినాయి. అందువల్లనే భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు తీవ్రమైనాయి. గుత్త పెట్టుబడులు బలపడటానికి కొనసాగుతున్న దోపిడీ ఆర్థిక విధానమే ఇందుకు కారణమన్న వాస్తవాన్ని పాలకవర్గం విస్మరిస్తుంది. ఈ విధానాల వల్ల రైతులు భూములను కోల్పోవాల్సిందే. ప్రజల వ్యతిరేకత లేకుండా భూములు సేకరించడానికి, పునరావాసాన్ని సంబోధిస్తూ 2009లో బిల్లును రూపొందించారు. కానీ లోకసభ రద్దుతో ఈ బిల్లు కూడా రద్దయింది. చివరకు 2013లో రైట్ టు ఫెయిర్ కాంపెన్సేషన్ అండ్ ట్రాన్స్పరెన్సీ ఇన్ ల్యాండ్ అక్విజేషన్, రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్ (RECTLARR, Act) రూపొందింది. న్యాయమైన నష్ట పరిహారాన్ని ఈ చట్టం ప్రతిపాదించింది. ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఇళ్ళను కోల్పోతే

ఇళ్ళను, భూమిని కోల్పోతే భూమిని ఇవ్వాలని, నిర్వాసిత కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఒకేసారి 5 లక్షల రూ.లను లేదా నెలకు 2000 రూ.లను, 20 సంవత్సరాలు ఇవ్వాలంటుంది. రైతుకూలీలకు, వృత్తుల వాళ్లకు నెలకు 3000 రూ.లను ఒక సంవత్సరం ఇవ్వాలంటుంది.

బహుళ పంటల భూములను సేకరించడాన్ని ఈ చట్టం ఆమోదించదు. ఒకవేళ తీసుకున్నా, అంతమేరకు వృధాగా వున్న సాగు భూమిని వ్యవసాయ భూమిగా మార్చాలి. ప్రైవేట్ కంపెనీల కోసం జరిగే భూసేకరణను 80 శాతం ప్రజలు, PPP ప్రాజెక్టుల కోసం భూసేకరణను 70 శాతం ప్రజలు తప్పనిసరిగా ఆమోదించాలి. నిర్వాసితులవు తున్న కుటుంబాలు 200 లకు పైగా వున్నప్పుడు ఆ ప్రాజెక్టు గురించి సామాజిక ప్రభావ అంచనాలు వేయాలి. సేకరించిన భూమిని 5 సంవత్సరాలు ఉపయోగించ నట్లయితే, ఆ భూమిని ఒరిజినల్ యజమానులకు వాపసు ఇవ్వాలి.

మెజారిటీ ప్రజల జీవితాలను విధ్వంసం చేసే దోపిడీ ఆర్థిక నమూనాను ప్రజలు వ్యతిరేకించకూడదు. ఇస్తానంటున్న నష్టపరిహారం, పునరావాసంతో "తట్టా బుట్టా" సర్దుకుని, సాగుభూమినీ, ఉన్న ఊరిని వదిలిపెట్టి మౌనంగా వెళ్లిపోవాలి. ఈ లక్ష్యంతోనే RECT LARR Act, 2013 రూపొందింది. అయితే ఇంతకాలం బలవంతంగా భూములను లాక్కొని, గ్రామాలను త్వరత్వరగా ఖాళీ చేయించగలిగిన కార్పొరేట్ శక్తులకు నష్టపరిహారాన్ని, పునరావాసాన్ని సంభోదించిన RECTLARR Act, 2013 ఆమోదయోగ్యంగా ఉండదు. అందుకే సీరియస్‌గా వ్యతిరేకించారు.

అందువల్లనే 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరిస్తూ RECTLARR (Amendment) ఆర్డినెన్స్, 2014 ను రూపొందించింది. ఆ సవరణల ప్రకారం జాతీయ భద్రత, రక్షణ రంగానికి సంబంధించిన ఉత్పత్తులు, గ్రామీణ మౌలికవసతులు గ్రామీణ విద్యుద్దీకరణ, మౌలిక సదుపాయాలు, సామాజిక మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక కారిడార్లు, పేదలకు ఇళ్ళు, మొదలైన రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులకు ప్రజల అంగీకారం, సామాజిక ప్రభావ అంచనాల నుండి మినహాయింపు వుంటుంది. ప్రైవేటు రంగ పరిశ్రమలను, private entities అంటున్నారు. దీనితో, ఈ సంస్థల భూ సేకరణ ప్రజా ప్రయోజనం కిందకే వస్తుంది. ప్రైవేటు హాస్పిటల్స్, ప్రైవేట్ విద్యాసంస్థలన్నీ "ప్రజా ప్రయోజనం కిందకే". బహుళ పంటల భూములను సేకరించడానికి అనుమతి వుంటుంది. న్యాయమైన నష్టపరిహారం, ఉద్యోగం ఇవ్వటం మొదలైన చర్యలుండవు. ఈ ఆర్డినెన్సును LARR (Amendment) Bill, 2015 గా మార్చడానికి పార్లమెంట్ ఏకాభిప్రాయానికి రాకపోవడం వల్ల 28

ఆగస్టు 2015న ఈ బిల్లు రద్దయింది. గుత్త పెట్టుబడుల ప్రయోజనం కోసం, ఆధిపత్యం కోసం జరుగుతున్న భూసేకరణ ఆగిపోకుండా నీతీ ఆయోగ్ వైస్ ఛైర్మన్ RFCTLARR Act, 2013 ను రాష్ట్ర ప్రభుత్వాలు తమతమ అసెంబ్లీలలో సవరించుకోవడానికి అనుమతినిచ్చాడు. రద్దయిన బిల్లులో వున్న సవరణలతో రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను రూపొందించాయి. దీనితో విస్తాపనకు గురవుతున్న ప్రజలకు హక్కుగా దక్కాల్సిన నష్ట పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలు, భూసేకరణ చట్టాల నుండి నిష్క్రమించాయి. భూసేకరణ క్రమంలో భూములను కోల్పోతున్న రైతుల, ప్రజల అంగీకారం కూడా చట్టానికి అనవసరమైన విషయాలే అయినాయి. ప్రజల భూములను లాక్కోటం సులభమైంది.

## విస్తాపన స్థాయి:

భారతదేశ ప్రభుత్వం అభివృద్ధి కోసం అంటూ భారీ పరిశ్రమల స్థాపన, భారీ నీటి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పన, గనుల తవ్వకం మొదలైన భారీ నిర్మాణాలను చేపట్టింది. ఇందుకోసం పెద్ద స్థాయిలో భూసేకరణ జరగాలి. లక్షల మందిని భూముల నుంచి వెళ్ళగొట్టడంతోనే మన దేశ 'అభివృద్ధి' కార్యక్రమాలు మొదలైనాయి. ఇది డెవలప్మెంట్ ఇండ్యూస్డ్ డిస్‌ప్లేస్మెంట్ అన్నమాట. ఈ అభివృద్ధి కోసం బలమైన ప్రభుత్వరంగం ఏర్పడింది. ఈ అభివృద్ధి నమూనాతో పేదరికం, ఆకలి, పౌష్టికాహార లోపం, నిరుద్యోగిత, అనారోగ్యం, నిరక్షరాస్యత, మెజారిటీ ప్రజలను ఉపాంతీకరించడం, ఆర్థిక అసమానతలతో పాటు సమస్త అసమానతలు పెరగటం తీవ్రమైంది. ప్రపంచీకరణ క్రమాన్ని బలోపేతం చేయడంలో భాగంగా 1999 లోనే పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించిన ఒక మంత్రిత్వశాఖ ఏర్పడింది. త్వరత్వరగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు చేస్తున్నారు. గత పదేళ్ల నుండి ఇది మరింత తీవ్రమైంది. వీటితోపాటు లక్షల కుటుంబాల నుండి ప్రభుత్వం అభివృద్ధి కోసం అంటూ స్వాధీనం చేసుకున్న ప్రజల భూమి ప్రైవేట్ శక్తులకు స్వంతం అవుతున్నది. ఇందుకు ప్రభుత్వ రంగం ఒక సాధనమయింది.

సమాంతరంగా పాలకులు అడవుల సంరక్షణ పేరిట అడవుల ఆధారంగా బతికే ఆదివాసీలు, ఇతర పీడిత వర్గాలు తమ బతుకు పునాదులు కోల్పోయే విధంగా చర్యలు చేపట్టారు. సమస్త పీడిత ప్రజల విస్తాపనతోనే భారతదేశ "అభివృద్ధి క్రమం" మొదలైందన్నమాట. నిజానికి భూసేకరణకు సంబంధించిన అధికారిక అంచనాలు లేనే లేవు. ఉదాహరణకు: కంప్యూటర్లు, సాఫ్ట్వేర్ బలపడిన 2010–11 నుండి

2014 -15 మధ్యకాలంలో కాగ్ నివేదిక ప్రకారం ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ వద్ద ఆ సంస్థ సేకరించిన భూమి, ఖాళీగా మిగిలిన భూమి గురించి సరైన సమాచారం లేదు.

సీరియస్ అధ్యాయనాలు చేసిన అంచనాల ప్రకారం 1951-90 ల మధ్య 21.6 మిలియన్ల మంది విస్తాపనకు గురైనారు. ఇందులో 8.54 మిలియన్ల మంది ఆదివాసీలు. వీళ్లంతా ప్రత్యక్షంగా భూములను కోల్పోయారు. ఆయా గ్రామాల్లో బతికే వృత్తుల వాళ్ళు, రైతు కూలీలు, మొదలైనవాళ్ళు ఎంతమంది తమ జీవనోపాధిని కోల్పోయారో? ప్రభుత్వం యొక్క జాతీయ పునరావాస విధాన ముసాయిదా ప్రకారం, భూములను కోల్పోయిన వాళ్ళలో 75 శాతం మంది ఇంకా పునరావాసం గురించి నిరీక్షిస్తున్నారు.

1950-2005 మధ్యకాలంలో అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల 65 మిలియన్ల మంది విస్తాపనకు గురైనారని మరొక అంచనా. ఇందులో కేవలం 33 శాతం మంది జీవితంలో తిరిగి స్థిరపడ్డారు. అయితే కోల్పోయిన సాగుభూమి 1,72,973 మిలియన్ల ఎకరాలు. ఇందులో కోల్పోయిన అడవుల విస్తీర్ణం 24,710 ఎకరాలు. 1990ల తర్వాత ప్రత్యేకించి 2005లో సెజ్ చట్టం వచ్చిన తర్వాత గుత్త పెట్టుబడుల కోసం భూసేకరణ మరింత తీవ్రమైంది.

ప్రపంచంలో సగటున సంవత్సరానికి 300 డ్యాములను నిర్మిస్తున్నారని, అందువల్ల కనీసం 4 మిలియన్ల మంది విస్తాపన జరుగుతున్నదని, ప్రపంచబ్యాంకు 1994 నివేదిక చెబుతుంది. మనదేశంలో గుజరాత్‌లో 2004 నాటికి 506 డ్యాంలను నిర్మించారు. వందల వేల ఎకరాలు నీట మునిగాయి. మిలియన్ల మంది నిరాశ్రయు లైనారు. గత పది సంవత్సరాలలో పంజాబ్ లో 24,710 ఎకరాల భూమిని వ్యవసాయం నుండి వ్యవసాయేతర ప్రాజెక్టులకు మళ్ళించారు.

**అవిభాజ్య ఆంధ్రప్రదేశ్:**

భూసేకరణలో ఈ రాష్ట్రానిదే దేశంలో మొదటి స్థానం. 12.35 లక్షల ఎకరాల భూమిని వ్యవసాయేతర పనులకు మళ్ళించారు. 1969-2002 మధ్య భూమి లేని పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను, 2005 తర్వాత సెజ్‌ల కోసం లాక్కున్నారు. కోనేరు రంగారావు కమిటీ నివేదిక, 2006 ప్రకారం భూమిలేని రైతు కూలీలకు 14.3 లక్షల ఎకరాలు పంచారు. అందులో 10 లక్షల ఎకరాలను సరైనవిధంగా అప్పజెప్పలేదు.

2004-05లో ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన 276 ఆదివాసీ గ్రామాలను ముంచింది. 2,37,000 మంది నిరాశ్రయులైనారు. ఇందులో 53.17 శాతం ఆదివాసీలే. ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ఈ గ్రామాల ప్రజలు నష్టపరిహారాలు అందక ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారు. 2011లో తలపెట్టిన పెట్రోలియం, కెమికల్స్, పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్మెంట్ రీజియన్ (PCPIR), వాడ్రేవు అండ్ నిజాంపట్నం పోర్ట్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ (VANPIC) ల కోసం 110 గ్రామాల నుండి 15,000 ఎకరాల భూమిని సేకరిస్తామన్నారు. ఇందులో 73 శాతం భూమిని 2011 నాటికే సేకరించారు.

2004 లో ఒఎన్‌జిసి ప్రధాన భాగస్వామిగా ఏర్పాటు చేయాలనుకున్న కాకినాడ సెజ్ కోసం 16 గ్రామాల నుండి 9869 ఎకరాల భూసేకరణ కావాలన్నారు. ప్రజల పోరాటం వల్ల ఒఎన్‌జిసి ఉపసంహరించుకున్నది. కానీ రెవెన్యూ అధికారులు, పోలీసు యంత్రాంగం మద్దతుతో కె.వి. రావు అనే వ్యక్తి బలవంతంగా 7000 ఎకరాలు సేకరించాడు. కోర్టులో కేసులు ఎటూ తేలకుండా నడుస్తున్నాయి. 1974-2004 మధ్య ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, ల్యాండ్ బ్యాంకులో 48,579 ఎకరాలున్నది. 2004-2009 మధ్య ఇది 1,21,655 ఎకరాలకు పెరిగింది.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం:**

2015 నాటికి అమరావతిలో రాజధాని నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 34,000 ఎకరాల సాగు భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా రాజధాని నగరం 22,000 ఎకరాల లోపునే వున్నది. కాగా, మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ఏప్రిల్, 2025లో క్యాపిటల్ రీజనల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (CRDA) ద్వారా మరొక 44,000 ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే తాళ్లూరు, అమరావతి, తాటికొండ, మంగళగిరి మండలాల్లోని 11 గ్రామాల్లో భూసేకరణ ప్రయత్నాలు మొదలయినాయి. రాజధాని అభివృద్ధికి ఇంకా భూములు కావాలని ప్రపంచబ్యాంకు ఒత్తిడి చేస్తున్నది. ఈ భూములను ప్రధానంగా అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైల్వే లైన్, స్పోర్ట్స్ సిటీ, ఇండస్ట్రియల్ సిటీ, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు మొదలైన కీలక సదుపాయాల కోసం కేటాయిస్తారు. అందువల్లనే ప్రైవేటు పెట్టబడులు ఆసక్తిని చూపిస్తున్నాయి. రాజధాని నిర్మాణం పేరిట లక్షల ఎకరాల భూసేకరణ, గుత్త పెట్టుబడులకు అప్పజెప్పడానికే.

పర్యావరణ చట్టాల అభ్యంతరాలు ఉన్న 775 ఎకరాల ఉప్పు భూమిని కృష్ణపట్నం పోర్టు విస్తరణ కోసం ఆదాని గ్రూపు ఎప్పటినుండో అడుగుతున్నది. మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఇందుకనుగుణంగా చట్టాలను సవరించింది. గుట్టుచప్పుడు కాకుండా ఈ భూములను అప్పజెప్పటానికి రంగం సిద్ధమైందంటున్నారు.

తాజాగా సోలార్ ప్రాజెక్టుల పేరుతో భూసేకరణ లో కొత్తపుంతలు తొక్కుతున్నది. కొన్నిచోట్ల 99 సంవత్సరాల లీజుకి, కొన్నిచోట్ల కారుచౌక ధరలకు లక్షల ఎకరాల ప్రభుత్వ, ప్రవేటు భూములు కార్పొరేట్ బినామీ రాజకీయ శక్తుల చేతుల్లోకి మారుతున్నాయి.

**తెలంగాణా:**

తెలంగాణా భూమి 2.76 కోట్ల ఎకరాలు. ఇందులో ప్రభుత్వ భూమి ఎంత వున్నదో ఖచ్చితంగా సమాచారం లేదంటున్నారు. భూకబ్జాలు పెరుగుతున్నాయి. రికార్డులు మాయమవుతున్నాయి. గుట్టలు, నాళాలు, చెరువులు ప్రైవేటు శక్తుల స్వాధీనమవుతున్నాయి. 3.43 లక్షల ఎకరాల అటవీ భూమిని రెవెన్యూ శాఖ చూపించడం లేదు. తెలంగాణ టీజీ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ వద్ద వేల ఎకరాలు, ఎక్కడ ఎంతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికే 2.5 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ వుందంటున్నారు. మళ్ళీ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం జిల్లాల వారీగా బలవంతంగా భూములను సేకరించారు.

హైదరాబాద్ మెగా మాస్టర్ ప్లాన్ 2050 ప్రకారం, 3,000 కోట్ల రూ.లతో సికింద్రాబాద్ నుండి షామీర్ పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలి. హుస్సేన్ సాగర్‌ను సుందరీకరించాలి. అందుకోసం 5000 కోట్ల రూ.ల లక్ష్యంతో కోకాపేట్, ఉప్పల్ భగాయత్ మొదలగు 10 ప్రాంతాల్లో ప్లాట్‌లను 2025లో వేలం వేయాలని ప్రతిపాదన.

ఫ్యూచర్ సిటీని 30,000 ఎకరాలతో నిర్మిస్తాం అంటున్నారు. ఇందుకోసం 13,973 ఎకరాలను సేకరించారు. అదనంగా 15 వేల ఎకరాలను సేకరిస్తారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా ఓఆర్ఆర్ నుండి ఫ్యూచర్ సిటీని కలుపుతూ ఆర్ఆర్ఆర్ వరకు 41.5 కిలోమీటర్ల మేర 300 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు వేగవంతమైనాయి. మలక్‌పేటలో 150 ఎకరాల్లో వున్న హైదరాబాద్ రేస్ క్లబ్ ను ఫ్యూచర్ సిటీకి మారుస్తారు. 250 ఎకరాలలో ప్రపంచస్థాయి గోల్ఫ్ క్లబ్‌ను నిర్మిస్తారు. ప్రపంచస్థాయి సంస్థలలో ఉన్నతశ్రేణి ఉద్యోగుల కోసం బిలియనీర్ల క్లబ్‌కు

70 ఎకరాలు కేటాయిస్తారు. 5000 ఎకరాలను ఫార్మా కంపెనీలకు కేటాయిస్తారు. పక్కనే వున్న అటవీ భూములలో పర్యాటకుల కోసం నైట్ సఫారీ మొదలగు ప్రాజెక్టుల నిర్మాణం చేపడతారు. ఈ విధంగా దోపిడీ ఆర్థిక నమూనాతో బలపడిన సంపన్న వర్గం విలాసాల కోసం భూమిని సేకరిస్తారు, ప్రజలను విస్థాపనకు గురిచేస్తారన్నమాట.

ప్రజల విస్థాపనతో అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణమే, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ మనుగడకు పునాది. విస్థాపన లేని అభివృద్ధి, దోపిడీ రహిత సోషలిస్టు నిర్మాణాల్లోనే సాధ్యమవుతుంది. తమను మౌలిక ఉత్పాదక రంగమైన వ్యవసాయ రంగం నుంచి క్రమంగా గెంటివేస్తున్న ఈ భూసేకరణ విధానాల గురించి ప్రజలు, రైతులు పూర్తిస్థాయి అవగాహన పొందాలి. సోషలిస్ట్ వ్యవస్థ కోసం పీడిత ప్రజలందరూ బలంగా, సంఘటితం కావాలి, పోరాడాలి. ఇందుకు ప్రత్యామ్నాయం లేదు.

⬩◆⬩

# 2

# ప్రజల భూములను స్వాధీనం చేసుకొని కార్పొరేట్ శక్తులకు అప్పగించే సాధనమే సెజ్‌ల విధానం

మనదేశంలో సమస్త గ్రామీణ ప్రజలు, ప్రత్యేకించి రైతులు గత రెండున్నర దశాబ్దాల నుండి ప్రత్యేక ఆర్థిక మండళ్లు/సెజ్‌ల ( Special Economic Zones) ఏర్పాటును ప్రతిఘటిస్తున్నారు, వ్యతిరేకిస్తున్నారు, పోరాడుతున్నారు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ గమనం, "శ్రమదోపిడీ ద్వారా సంచయనం" నుండి విస్తాపనతో సంచయనానికి విస్తరించింది. ఇందుకు అనుగుణంగా అపారమైన విలువగల ప్రజల భూములను, ప్రజలకు దక్కాల్సిన ప్రభుత్వ భూములను గుత్త పెట్టుబడులకు అప్పచెప్పడానికి "సెజ్‌లు" ఏర్పడ్డాయి. పెట్టుబడులను ఆకర్షించడానికి, ప్రత్యేకించి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి, పారిశ్రామిక పునాదిని విస్తృతం చేయడానికి, ఉద్యోగ కల్పనను, ఎగుమతులను పెంచడానికి సెజ్‌ల ఏర్పాటు అనివార్యమన్న వాదన బలపడింది. వర్ధమాన దేశాల వనరులను, ప్రధానంగా అపారమైన విలువ గల భూములను, ఉత్పత్తి రంగాలను గుత్త పెట్టుబడులు స్వాధీనం చేసుకోవడానికి సెజ్‌లు ఒక బలమైన నయా ఉదారవాద విధాన సాధనం. దీనివల్ల వర్ధమాన దేశాల ఆర్థిక పరాధీనత పెరుగుతుంది.

సెజ్‌లను ఒక విభిన్నమైన ప్రాంతాలుగా నిర్మిస్తారు. మిగిలిన దేశంలో పరిశ్రమలకు వర్తించే ఏ నియమ నిబంధనలు సెజ్‌లలో ఏర్పాటైన పరిశ్రమలకు

వర్తించవు. అన్ని చట్టాలను సరళీకరిస్తారు. ప్రధానంగా కార్మికులకు సంబంధించిన చట్టాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన చట్టాలు ఏవీ సెజ్‌లకు వర్తించవు. చౌక శ్రమ, చౌక ధరలకు భూములు సెజ్ యూనిట్లకు లభిస్తాయి ఆదాయ పన్ను నుండి, వస్తు సేవల పన్ను నుండి మినహాయింపు వుంటుంది. ఈ యూనిట్లు చేసుకొనే దిగుమతుల మీద సుంకాలు వుండవు. సెజ్‌లకు నిరంతరాయంగా విద్యుచ్ఛక్తి, నీటి సప్లై వుంటుంది. రవాణా మొదలైన మౌలిక సదుపాయాలు, వ్యర్థాల నిర్వహణకు సదుపాయాలు వుంటాయి. లాభాలకు గ్యారంటీ వుంటుంది.

భూములను, సాగు భూములను ఉమ్మడి ఆస్తి వనరులను స్వాధీనం చేసుకొని సెజ్‌లను ఏర్పాటు చేయాలి. ఈ వనరులే జీవనాధారంగా బతుకుతున్న అశేష ప్రజానీకాన్ని ఈ ఆస్తుల నుండి బలవంతంగా విడదీసి, వెళ్ళగొట్టాలి. ప్రజా ప్రయోజనం క్లాజ్ పేరిట ప్రజల భూములను స్వాధీనం చేసుకోవటంలో ప్రభుత్వమే దళారీ పాత్ర నిర్వహించింది. సెజ్‌ల ఏర్పాటు ప్రక్రియలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. 2000 సంవత్సరంలో ఎగుమతుల–దిగుమతుల విధానం (EXIM) లో భాగంగా సెజ్ లను ప్రతిపాదించారు. 2005లో సెజ్ యాక్ట్ వచ్చింది. దీనితో భూకబ్జాల కోసం ప్రభుత్వం మీద ఆధిపత్య వర్గాల ఒత్తిడి తీవ్రమైంది. రియల్ ఎస్టేట్ సంస్థలు సెజ్‌ల కోసం ఎగబడ్డాయి. అందువల్ల త్వరత్వరగా భూములను బలవంతంగా లాగేసుకొని, గ్రామాలను ఖాళీ చేపించడం ముమ్మరమైంది.

సాగుభూమిని, జీవనోపాధులను కాపాడుకోవడం కోసం రైతులు, స్థానికులు దేశమంతా దాదాపు అన్ని రాష్ట్రాలలో తీవ్రంగా పోరాటాలను చేశారు. సెజ్‌ల కోసం భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రజల వ్యతిరేకత భారీస్థాయిలో వ్యక్తమయింది. సెజ్‌లు ప్రజా వ్యతిరేకమని ఈ పోరాటాలు స్పష్టం చేశాయి. భూమికోసం, భుక్తి కోసం ప్రజలు ప్రాణాలకు తెగించి ప్రభుత్వంతో పోరాడారు. 2007లో పశ్చిమ బెంగాల్ లోని నందిగ్రామ్, సింగూర్‌లో పెల్లుబికిన సెజ్ వ్యతిరేక పోరాటాన్ని అణచడానికి పోలీసు కాల్పులు జరిగాయి. 14 మంది మరణించారు. ఎంతోమంది గాయపడ్డారు. మహిళల మీద అత్యాచారాలు జరిగాయి. ప్రజల భూములను కబ్జా చేసుకుని, గుత్త పెట్టుబడులకు అప్పగించటానికి ప్రజల మీద 'ప్రజాస్వామ్య' ప్రభుత్వం చేసిన దాడి ఇది. దీనిని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సీరియస్ గా ఖండించింది. ఈ పోరాటాల నేపథ్యంలో, ఆనాటి ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్, "విస్తాపన విధానం" మానవీయంగా ఉండాలని ప్రతిపాదించడం హాస్యాస్పదం కాదా! మెజారిటీ ప్రజల జీవన విధ్వంసం ఆగదు, కొనసాగుతుంది, కానీ మానవీయంగా వుండాలనటం

క్రూరమైన వైరుధ్యం కాదా! అయితే, గరిష్ట భూ పరిమితి లేని మల్టీ ప్రోడక్ట్ సెజ్‌లకు కొత్తగా 12,355 ఎకరాల (5 వేల హెక్టార్ల) గరిష్ట పరిమితిని నిర్ణయించారు. కానీ ఎక్కువ ఎకరాల విస్తీర్ణంలో వున్న సెజ్ లను విడగొట్టి, భాగాలుగా చూపించి గరిష్ట పరిమితి నియమాన్ని ఉల్లంఘించారు. ఉదాహరణకు గుజరాత్ లోని ముంద్రాలో వున్న ఆదాని గ్రూపు సెజ్ విస్తీర్ణం 18,406.476 ఎకరాలతో గరిష్ట పరిమితిని మించి వుంటుంది. దీనిని మూడు భాగాలుగా విడగొట్టి చూపిస్తున్నారు. ఇదే వ్యూహాన్ని హర్యానాలోని జజ్జార్‌లో రిలయన్స్ అనుసరించింది.

1952 నుండి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, మైనింగ్, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు మొదలైన అనేక అభివృద్ధి కార్యక్రమాల కోసం వీటికి అదనంగా 2000 సంవత్సరం నుండి సెజ్‌ల కోసం అంటూ 50 మిలియన్ల ఎకరాల వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకున్నారని ఒక అంచనా. దీనితో 60 మిలియన్ల మంది నిర్వాసితులైనారు. దేవేందర్ శర్మ, భాస్కర్ గోస్వామి 2006 లో అంచనాల ప్రకారం సెజ్ ల వల్ల ఐదుగురు సభ్యులతో వున్న 1.14 లక్షల రైతు కుటుంబాలు నిర్వాసితులవుతారు. 82 వేల రైతుకూలీ కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతాయి. అంటే 9.80 లక్షల మంది జీవితాలు సెజ్‌ల వల్ల విధ్వంసం అవుతాయి. సంవత్సరానికి వీళ్ళు కోల్పోయే ఆదాయం 212 కోట్ల రూ.లు. వీళ్ళకు సెజ్‌లలో ఉద్యోగాలు దొరకవు.

The Committee for State Agrarian Relations and Unfinished task in Land Reforms, 2009 ప్రకారం సెజ్‌ల కోసం దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవలసి వుంటుంది. ఫలితంగా ఒక మిలియన్ టన్నుల ఆహార పంటల ఉత్పత్తిని కోల్పోతాము. ఈ సాగుభూమి జీవనాధారంగా బతికే రైతు కుటుంబాలు, రైతుకూలీల కుటుంబాల బతుకులు ఏమవుతాయి? ఆహార భద్రత సమస్య, ఆకలి సమస్య తీవ్రమవుతాయి. సెజ్‌ల స్థాపన దానంతట అదే జీవించే హక్కును, జీవనోపాధుల హక్కును ఉల్లంఘిస్తుంది. భూ పంపిణీలో అసమానతల తీవ్రత కొనసాగుతూనే వున్నది. 2015-16 లో 86.1 శాతం మంది చిన్న, ఉపాంత రైతులే. సెజ్‌ల కోసం వాళ్ళ భూములను బలవంతంగా లాక్కొని, వెళ్లగొడితే వాళ్లకు ఆ సంక్షుభిత జీవితాలు కూడా మిగలవు.

సెజ్‌ల ప్రతిపాదన సడన్‌గా రాలేదు. 1980ల వరకు తృతీయ ప్రపంచ దేశాలన్నీ స్వావలంబనతో కూడిన అభివృద్ధి కోసం దిగుమతి -ప్రత్యామ్నాయ పరిశ్రమల స్థాపన వ్యూహాన్ని అనుసరించేవి. ఈ దేశాలన్నీ దిగుమతులను తగ్గించుకొని స్వావలంబనను సాధించినట్లయితే వాణిజ్యం పేరిట ఈ దేశాల్లోకి చొచ్చుకొని పోయి సమస్త వనరులను,

ప్రత్యేకించి భూములను స్వాధీనం చేసుకోవడం ఈ ఆర్థిక వ్యవస్థల ఉత్పత్తి రంగాల మీద ఆధిపత్యాన్ని పొందటం గుత్త పెట్టుబడులకు సాధ్యం కాదు. ఇది ప్రపంచీకరణ క్రమానికి వ్యతిరేకం. అందువల్లనే తృతీయ ప్రపంచ దేశాల అభివృద్ధికి ఎగుమతులే మార్గం అన్నవాదన ప్రచారమైంది. అంతర్జాతీయ సంస్థల బలమైన ఒత్తిడితో వర్ధమాన దేశాల్లో ఎగుమతి ప్రాసెసింగ్ జోన్ల స్థాపన మొదలైంది. 1984 నాటికే 35 దేశాల్లో 79 ఎగుమతి ప్రాసెసింగ్ జోన్లు ఏర్పడ్డాయి. వర్ధమాన దేశాల భూములతో పాటు సమస్త వనరులను స్వాధీనం చేసుకునే ప్రపంచీకరణ వేగానికి EPZ ల నిర్మాణం అనుకూలంగా వుండదు. విస్తాపనతో సంచయనానికి పూర్తిగా అనుకూలమైన నిర్మాణాలతో సెజ్ రూపొందింది.

## సెజ్‌ల కోసం స్వాధీనం చేసుకున్న భూములలో సెజ్ లను ఏర్పాటు చేశారా?

సెజ్‌లు అంటేనే చట్టబద్ధంగా జరిగే ప్రభుత్వ భూకబ్జాలని, మెజారిటీ ప్రజల జీవనాధార వ్యవస్థల విధ్వంసంతో ముడిపడి ఉంటుందని చాలా సీరియస్ అధ్యయనాలు అభిప్రాయపడ్డాయి. 2014 లో విడుదలైన కాగ్ నివేదిక ప్రకారం సెజ్ పథకంలో ప్రధానమైనదీ, ఆకర్షణీయమైనదీ ఈ భాగమే అంటారు. చట్టబద్ధంగా ప్రభుత్వమే తన అధికార బలంతో బలవంతంగా ప్రజల భూములను లాక్కోవటానికి వీలున్న పథకం సెజ్. కాబట్టి వేగవంతమైన ఆచరణతో చౌకగా భూములను ఇవ్వాలన్న ఒత్తిడి ప్రభుత్వం మీద తీవ్రంగానే వున్నది.

సెజ్‌లకు అనుమతులనివ్వటం అధికమైంది. అంటే సెజ్‌ల పేరిట భూములను స్వాధీనం చేసుకోవడం తీవ్రమైంది. కాగ్ నివేదిక ప్రకారమే మార్చి 2014 నాటికి అనుమతించిన 576 సెజ్‌ల కోసం 1,49,190.97 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. కానీ సెజ్‌ల కోసం అంటూ నోటిఫై చేసిన భూములు 1,09,525.51 ఎకరాలు. అంటే సెజ్‌ల పేరిట స్వాధీనం చేసుకున్న భూమిలో కొంత భాగాన్ని మాత్రమే సెజ్‌ల కోసం నోటిఫై చేస్తున్నారు. ఇందులో పనిచేస్తున్న 152 సెజ్‌ల భూమి కేవలం 70,395.06 ఎకరాలు. పనిచేయని సెజ్‌లలో నిరుపయోగంగా వున్న భూమి 78,795.91 ఎకరాలు. అంటే సెజ్‌ల పేరిట స్వాధీనం చేసుకున్న భూమిలో 52.8 శాతం నిరుపయోగంగా వున్నది. ఈ భూములను తమకు తిరిగి ఇవ్వాలని భూములను కోల్పోయిన రైతులు పోరాటాలు చేస్తున్నారు.

కానీ, నిరుపయోగంగా వున్న భూమిని ఆ తర్వాత డీ నోటిఫై చేసి, వాణిజ్యం కోసం, రియల్ ఎస్టేట్ లాభాల కోసం వాడుకుంటున్నారని కాగ్ నివేదిక స్పష్టంగా

బయటపెట్టింది. ప్రజా ప్రయోజనం కోసం అంటూ స్వాధీనం చేసుకున్న భూమిని వాణిజ్య ప్రయోజనాలకు మళ్లించడం దుర్మార్గమే. ఈ విధంగా సెజ్‌లలో నిరుపయోగంగా పడి వున్న భూమి వివిధ రాష్ట్రాలలో 47.45 శాతం నుండి 96.58 శాతం వరకు వున్నది.

సుప్రీంకోర్టు ఆర్డర్‌ను ఉల్లంఘించి డిఫెన్స్, అడవులు, నీటిపారుదల వసతులున్న భూములను కూడా సెజ్‌ల కోసం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉల్లంఘనలు అవిభాజ్య ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అధికంగా వున్నాయి.

## పనిచేస్తున్న సెజ్ లలో కేటాయించిన భూమినంతా ఉపయోగిస్తున్నారా?

సెజ్‌లకు కేటాయించిన భూమిని ప్రాసెసింగ్, ప్రాసెసింగేతర ప్రాంతాలుగా విభజిస్తారు. ప్రాసెసింగ్ ప్రాంతంలో కనీసం 50 శాతాన్ని తప్పనిసరిగా వినియోగించాలి. కానీ చాలా సెజ్‌లలో 16.29 శాతంగా వున్నది. 2006-2008 లో నోటిఫై అయిన 17 సెజ్ లలో, ప్రాసెసింగ్ ప్రాంతంలో 83.7 శాతం అంటే 8,657.62 ఎకరాల భూమి నిరుపయోగంగా వున్నది.

మే, 2009 లో నోటిఫై అయిన ఆదాని పోర్ట్స్‌కు కేటాయించిన 15,994.44 ఎకరాలలో నిరుపయోగంగా వున్న భూమి 13,934.19 ఎకరాలు. అంటే 87.11 శాతం. భూకబ్జాల కోసమే సెజ్‌లు అన్నది రుజువయింది. ఫిబ్రవరి 11, 2019 లో పార్లమెంటు టేబుల్ మీదికి వచ్చిన గుజరాత్‌లోని కచ్‌లో ఆదానీ ముంద్రా పవర్ ప్రాజెక్టు సెజ్‌కు కేటాయించిన 20,756 ఎకరాలలో 56 శాతాన్ని ఉపయోగించడం లేదు.

అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు సెజ్‌ల కోసం 27,991.78 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. కానీ, ఇందులో 15,421.59 ఎకరాలను మాత్రమే నోటిఫై చేశారు. నోటిఫై చేసిన భూమి కేవలం 55 శాతం మాత్రమే. ఇది కూడా పూర్తిగా ఉపయోగించలేదు. ఆ తర్వాత 4,120.79 ఎకరాల భూమిని డీ నోటిఫై చేశారు.

వీటికి అదనంగా భూ ఆక్రమణలు మరెన్నో రూపాల్లో కొనసాగుతున్నాయి. సెజ్ భూములను చట్టవిరుద్ధంగా ఆక్రమించుకొని ఖాళీ చేయని కేసులున్నాయి. భూమి కేటాయింపు క్యాన్సిల్ అయినా, ఖాళీ చేయని పరిశ్రమలు ఉండటం కాగ్ ఆడిట్‌లో బయటపడ్డాయి. తప్పుడు పత్రాలతో ప్రభుత్వాన్ని మోసం చేసి గోవా సెజ్‌లో 7 సంస్థలు భూమి కేటాయింపులను 2006-07 లో దక్కించుకున్నాయి. ఏప్రిల్ 2024 వరకు కూడా ACB విచారణ పూర్తికాలేదు. గుత్త పెట్టుబడుల భూకబ్జాలు ఎన్ని రూపాల్లో ఉంటాయో వీటితో స్పష్టమవుతుంది. సెజ్ భూములను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు తీసుకోవటం, ఇతర అవసరాలకు వాడుకోవడం కూడా గమనించవచ్చు.

## సెజ్ భూములను డీ నోటిఫై చేయటం:

2014-17 మధ్య జరిగిన సీరియస్ అధ్యయనాలు కూడా భారతదేశంలో జాతీయస్థాయిలో సెజ్‌ల కోసం స్వాధీనం చేసుకున్న భూములలో ఉపయోగించని భూములు 37 శాతం వున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే జూన్ 2017 నాటికి 81 సెజ్ లను డీ నోటిఫై చేశారు. దీంతో రైతుల భూములను ఎడాపెడా స్వాధీనం చేసుకున్నారన్న వాస్తవం స్పష్టమవుతుంది. మల్టీ ప్రోడక్ట్ సెజ్‌లకు భూ పరిమితి నియమం ప్రారంభంలో లేదు. వీటి కోసం భారీఎత్తున భూములను స్వాధీనం చేసుకున్నారు. అందువల్లనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించిన 806 అతి చిన్న సెజ్‌లు మొత్తం సెజ్ భూమిలో కేవలం 10.4 శాతం ఆక్రమించుకున్నాయి. కాగా మల్టీ ప్రోడక్ట్ 14 అతి పెద్ద సెజ్‌లు సెజ్ భూమిలో 53 శాతాన్ని ఆక్రమించుకున్నాయి. నోటిఫై చేసిన సెజ్ లలో ప్రాసెసింగ్ కోసం కేటాయించిన భూమిలో 45 శాతం ఖాళీగా వుంటున్నది. దాద్రా, నాగర్ హవేలీ, గోవా, జార్ఖండ్, నాగాలాండ్ సెజ్‌లలో ఖాళీగా వున్న ప్రాసెసింగ్ భూములు 100 శాతం. తెలంగాణా లోని ప్రైవేట్ సెజ్ లలో 75.25 శాతం ప్రాసెసింగ్ కోసం కేటాయించిన భూమి ఖాళీగా వున్నది. 2014-17 మధ్య కొత్తగా అనుమతులిచ్చిన సెజ్‌లు 49 కాగా, ఇదే కాలంలో 78 సెజ్ లను డీ నోటిఫై చేశారు.

ప్రజా ప్రయోజనం క్లాజ్ కింద సెజ్‌ల కోసం స్వాధీనం చేసుకున్న భూమిని ఢీ నోటిఫై చేసినప్పుడు ఆ భూమి కోసం పోరాడుతున్న భూములను కోల్పోయిన రైతులకు ఇవ్వరు. పెద్దపెద్ద విలాసవంతమైన రెసిడెన్షియల్ భవనాలు, కార్పొరేట్ విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రుల నిర్మాణాలు అందులో కనిపిస్తాయి. అయితే జూన్ 4, 2018లో భారతదేశ ప్రభుత్వం శ్రీ బాబా కళ్యాణి అధ్యక్షతన సెజ్ విధానాన్ని అధ్యయనం చేయటానికి గ్రూప్ ఆఫ్ ఎమినెంట్ పర్సన్స్ తో వేసిన కమిటీ సెజ్‌ల కోసం స్వాధీనం చేసుకున్న భూమిని డీ నోటిఫై చేసినప్పుడు, సెజ్‌ల కోసమే తప్పనిసరిగా వాడాలన్న నిబంధనను తొలగించాలన్నది. చట్ట ఉల్లంఘనలు చట్టబద్ధమవుతున్న క్రమం ఇది. 2007లో ఎంపవర్డ్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సూచనల ప్రకారం రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం సెజ్ భూములను వాడకూడదు. ఈ నియమం అభావం అయింది.

## సెజ్‌లు - లక్ష్యసాధన:

సెజ్‌ల వల్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా పరిశ్రమల ప్రాతిపదిక విస్తృతి చెందుతుందన్నారు. కానీ మన దేశంలో ఇతర ప్రాంతాల్లో వున్న పరిశ్రమలు, పన్ను పన్నేతర రాయితీలు, మినహాయింపులు, పూర్తిస్థాయి మౌలిక వసతులు, కార్మిక చట్టాలు, పర్యావరణ చట్టాల సరళీకరణ మొదలైన ప్రయోజనాల కోసం సెజ్‌లకు

తరలి వెళ్లాయి. సెజ్‌ల కోసం ప్రకటించిన రాయితీలు, మినహాయింపులు, వర్ధమాన దేశాలన్నీ పోటీపడి ఇస్తున్నాయి. అందువల్ల విదేశీ పెట్టుబడులకు ఇవేవీ ప్రత్యేక ఆకర్షణ కాదు. చౌక శ్రమ, చౌక భూమితో పాటు స్వదేశీ, విదేశీ మార్కెట్ల అందుబాటు, వాణిజ్య వాతావరణం, రాజకీయ స్థిరత్వం మొదలైన అంచనాలతో విదేశీ పెట్టుబడులు వస్తాయి. అవి ముందు దేశాన్ని ఎంపిక చేసుకొని, ఆ తర్వాత ప్రాంతాన్ని నిర్ణయించుకుంటాయి. సెజ్ లోకి వచ్చిన విదేశీ పెట్టుబడులన్నీ సెజ్‌ల వల్లనే రాలేదన్నది స్పష్టం.

మెజారిటీ సెజ్‌లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి సంబంధించినవే. తయారీ రంగం ప్రాధాన్యత లేదని కాగ్ నివేదిక కూడా చెప్పింది.

అందువల్లనే 56.64 శాతం సెజ్‌లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి చెందినవి. కానీ కేవలం 9.6 శాతం మాత్రమే తయారీ రంగానికి చెందినవి. సెజ్‌ల వల్ల పెట్టుబడులు పెరగలేదు, తయారీ రంగం పెరగలేదు, పారిశ్రామిక ప్రాతిపదిక విస్తరించలేదు, సంతులిత ప్రాంతీయ వృద్ధి ప్రస్తావన లేదు. పెట్టుబడులలో సెజ్‌ల వైఫల్యం 23.98 శాతం నుండి 74.92 శాతం వుంటుందని, ఎగుమతులలో వైఫల్యం 46.16 శాతం నుండి 93.81 శాతం వుంటుందని కాగ్ నివేదిక తేల్చింది.

లక్షల మంది రైతులను నిర్వాసితులను చేశారు. సెజ్‌ల వల్ల ఉద్యోగాలు వస్తాయన్నారు కానీ ఉద్యోగ కల్పనలో వైఫల్యం 65.95 శాతం నుండి అత్యధికంగా 96.58 శాతం ఉంటుందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది.

సెజ్‌ల భూమిని పరిశ్రమలకు కేటాయించినప్పుడు ఉద్యోగ కల్పన నిబంధన వుంటుంది. కానీ ఏ సంస్థ కూడా హామీ ఇచ్చిన ఉద్యోగాలను కల్పించలేదు. అయినా వాటి మీద ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. ఉదాహరణకు, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో, హైదరాబాద్ జెమ్స్ కంపెనీకి 5 సంవత్సరాలలో 15,000 ఉద్యోగాలను కల్పించాలన్న నిబంధనతో 199.98 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ సంస్థ కేవలం 3,835 ఉద్యోగాలను కల్పించింది. అదేవిధంగా విప్రో గోపనపల్లి సంస్థకు అక్టోబర్ 2005లో 10,000 ఉద్యోగాలను కల్పించాలన్న నిబంధనతో 99.97 ఎకరాల భూమిని కేటాయించారు. 2013 నాటికి ఆ సంస్థ కేవలం 356 మందికి ఉద్యోగాలనిచ్చింది.

2022లో అధ్యయనం, సెజ్‌లు సాధించాలన్న లక్ష్యాలకు, వాస్తవాలకు మధ్య వ్యత్యాసాన్ని అంచనా వేసింది. ఉద్యోగితలో వైఫల్యం అత్యధికంగా 92.73 శాతం వున్నది. పెట్టుబడులలో వైఫల్యం 59 శాతం వుండగా, ఎగుమతులలో 75శాతం వున్నది.

సెజ్‌ల వల్ల భూకబ్జాలు, రైతులను నిర్వాసితులను చేయటం వాస్తవమైంది. లక్ష్యసాధనలో మాత్రం భారీ వైఫల్యం. ఈ సెజ్‌లకు 2006 నుండి 2012–13

వరకు ఇచ్చిన పన్ను రాయితీలు 83,104.76 కోట్ల రూపాయలు. ఇందులో ఆదాయం పన్ను మినహాయింపులు 55,158 కోట్ల రూ.లు ఉండగా, పరోక్ష పన్ను రాయితీలు 27,946.76 కోట్ల రూ.లు. ఇందులో అర్హత లేని మినహాయింపులు 1150.06 కోట్ల రూ.లు, పన్ను పరిపాలన బలహీనతల వల్ల కోల్పోయిన రాబడి 27,130.98 కోట్లు వుంటుందని కాగ్ ఆడిట్ గమనించింది.

పూర్తిగా ప్రజా వ్యతిరేకమైన సెజ్‌లను ప్రపంచ బ్యాంకు బలోపేతం చేయాలంటుంది. UNCTAD రూపొందించిన World Investment Report, 2019 ప్రకారం విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు తగ్గిపోతున్నాయని, సెజ్‌ల ద్వారా ఆ ప్రవాహాలను పెంచాలని చెబుతుంది. ఇందుకు భిన్నంగా ఇటీవలి ట్రంప్ టారిఫ్ హెచ్చరికల నేపథ్యంలో ఎగుమతులను తిప్పి పంపడం చూసాం. సామ్రాజ్యవాద ఆధిపత్య దేశాల ప్రయోజనాలతో ముడిపడిన విధానాలలో భాగమే సెజ్‌లు. ఇండియా వంటి దేశాలలో ఉత్పత్తులు సాగిస్తామని వేల ఎకరాలు పొందిన శాంసంగ్ వంటి కొరియన్ కంపెనీలకు తాజాగా ట్రంప్ బెదిరింపులు మొదలయ్యాయి. మీ ఉత్పత్తులు అమ్ముకోవాలంటే అమెరికాలోనే 25 శాతం ఉత్పత్తి సాగించాలి. లేకుంటే విధించే పెనాల్టీ టారిఫ్‌లను చెల్లించాల్సి వుంటుందన్నారు. అంటే వర్ధమాన దేశాల అభివృద్ధికి ఎగుమతులే ముఖ్యమని, అందుకు సెజ్‌లను స్థాపించాలని ఒత్తిడి చేయడం అయినా, ఇందుకు విభిన్నంగా ప్రతీకార సుంకాలతో ఈ దేశాల ఎగుమతులను నిలిపి వేయటం అయినా, సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థ ప్రయోజనాల కోసమే. రెండు దశాబ్దలపాటు ప్రపంచ దేశాల సెజ్‌లలో పొందిన భూములు,తద్వారా పెరిగిన కంపెనీల ఆస్తుల విలువలను పరిశీలిస్తే సెజ్ ల విధానప అసలు లక్ష్యం తెలుస్తుంది.

"విస్తాపనలో సంచయనం" చట్రంలో పకడ్బందీగా సెజ్ వ్యూహం రూపొందింది. లక్షల ఎకరాల భూమిని, లక్షల మంది రైతులు నుండి కబ్జా చేసుకోవడానికి సెజ్ చట్టం బాగా ఉపయోగపడింది. గుత్త పెట్టుబడుల సంపద, ఆధిపత్యం, అధికారం బలోపేతం కావటానికి మెజారిటీ ప్రజలు తమ భూములను, ఉమ్మడి ఆస్తి వనరులను ఇప్పటి వరకు కోల్పోవాల్సి వచ్చింది. ఇకపై కూడా అదే కొనసాగుతుంది. దోపిడీ రహిత సోషలిస్టు నిర్మాణాలే ఈ సమస్యకు పరిష్కారం. చైతన్యవంతమైన, సంఘటిత ప్రజా పోరాటాలే ఇందుకు ఏకైక మార్గం.

♦◆♦

# 3

# సమస్త భూములను గుత్త పెట్టుబడులకు అప్పజెప్పటమే భారీ సౌరశక్తి ప్రాజెక్టుల అసలు లక్ష్యం

వాతావరణ మార్పును నియంత్రించడానికి వచ్చిన అనేక పరిష్కారాలలో సంప్రదాయ ఇంధన ఉత్పత్తిని, వాడకాన్ని తగ్గించటం, సంప్రదాయేతర ఇంధనం, ప్రత్యేకించి సౌరశక్తి ఉత్పత్తిని పెంచాలన్న ప్రతిపాదన మన దేశ నయా ఉదారవాద ప్రభుత్వాలకు ఆమోదయోగ్యమైంది. ఏ కొత్త ప్రతిపాదన వచ్చినా తమ ప్రయోజనాల పరిధిలోకి తెచ్చుకోవడానికి పెట్టుబడిదారీ వర్గం ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఈ ప్రతిపాదన కూడా గుత్త పెట్టుబడుల ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. భూసాంద్రత అధికంగా వుండే సౌర శక్తి ఉత్పత్తికి భారీ పరిమాణంలో భూములు కావాలి. అందువల్ల సౌరశక్తి ఉత్పత్తి పేరిట దేశంలో వున్న సమస్త భూములను గుత్త పెట్టుబడులకు అప్పచెప్పటానికి వీలుంటుంది. ప్రజలను భూములనుండి పరాయీకరిస్తున్న అభివృద్ధి ప్రాజెక్టులు, సెజ్‌లకు అదనంగా సౌర శక్తి ఉత్పత్తి ప్రాజెక్టులు బలంగా అమలవుతున్నాయి. సౌరశక్తి కోసం భూకబ్జాలు శిఖరస్థాయికి చేరుకుంటున్నాయి. చిన్నాచితక రైతుల సాగుభూములను బలవంతంగా లాక్కుంటున్నారు. పచ్చిక బయళ్ళుగా, వంటచెరుకు ఆధారంగా రకరకాలుగా పీడిత ప్రజల బతుకుకు ఉపయోగపడే సమిష్టి ఆస్తి వనరులను హడావుడిగా ప్రభుత్వ బంజరు భూములని ప్రకటించి గుత్త పెట్టుబడులకు అప్పచెప్పుతున్నారు. ప్రపంచబ్యాంకు నిధులతో దేశంలో జరిపిన మొత్తం

భూముల రీ సర్వే, భూ బ్యాంకుల ఏర్పాటు అసలు వుద్దేశ్యం ఇప్పటికైనా అందరికీ అర్థమై వుంటుంది. మొత్తం పీడితవర్గాన్ని పూర్తిగా భూముల నుండి పరాయీకరిస్తున్నారు. వారికి భవిష్యత్తులో సొంత భూమి, ఇంటి కోసం స్థలాల గురించి ఆలోచన కూడా రాకుండా ప్రభుత్వ భూములన్నీ మింగేస్తున్నారు. మెజారిటీ ప్రజల జీవన విధ్వంసంతో ముడిపడి వున్న సౌర శక్తి ఉత్పత్తి వల్ల వాతావరణ మార్పును తగ్గించి, భూగోళాన్ని రక్షించవచ్చని సమర్థించుకుంటున్నారు. అందువల్ల భూములను, బతుకులను కోల్పోయిన ప్రజలు సౌరశక్తి ప్రాజెక్టులను వ్యతిరేకించడం నేరంగా ప్రచారమవుతున్నది. భూములను, బతుకుతెరువులను కోల్పోతున్న పీడిత ప్రజలను స్వార్థపరులుగాను, లాభాల కోసం, ఆధిపత్యం కోసం భూములను ఆక్రమించుకునే సౌరశక్తి ఉత్పత్తిదారులను భూగోళాన్ని రక్షిస్తున్న గొప్ప 'రక్షకులుగా' చిత్రీకరించే తలకిందుల వాదనలు బలపడ్డాయి. ఈ విధంగా గుత్త పెట్టుబడుల హరిత భూకబ్జాలను (Green grabbing) సమర్ధించుకుంటున్నారు.

భూమి నుండి పరాయీకరించబడి, బతుకుదెరువులను కోల్పోయిన సమస్త పీడిత వర్గ ప్రజలు "పోరాడితే పోయేదేమీ లేదు" అన్నస్థితికి నెట్టబడ్డారు. భూమికోసం, భుక్తి కోసం దేశమంతటా నిరంతరం ఘర్షణ పడుతున్నారు. పోరాటాలు చేస్తున్నారు. దేశంలో అంతర్గతంగా తీవ్రమైన అసంతృప్తి వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వం తన బలంతో, పోలీసు బలగాలతో ప్రజల పోరాటాలను హింసతో క్రూరంగా అణచివేస్తూనే వున్నది. రోజురోజుకీ సంక్లిష్టమవుతున్న మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం నయా ఉదారవాద ప్రభుత్వాలకి పట్టనే పట్టదు. సౌర శక్తి రంగంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా ప్రవహిస్తున్నాయని, గ్లోబల్ స్థాయి ప్రాజెక్టు నిర్మాణాలు జరుగుతున్నాయని స్వచ్ఛమైన శక్తి దిశగా దేశం పరుగులు పెడుతున్నదని పాలకులు ఆర్భాటపు ప్రకటనలు చేయడం సీరియస్ వైరుధ్యమే.

## సౌరశక్తి కోసం భూ ఆక్రమణలు - ప్రజల వ్యతిరేకత - అధ్యయనాలు:

భూ ఆక్రమణలకు వ్యతిరేకంగా, స్థానికంగా, ఎక్కడికక్కడ సీరియస్‌గా ప్రజలు పోరాడుతూనే వున్నారు. సౌరశక్తి భూ ఆక్రమణలు ఇందుకు మినహాయింపు కాదు. ఈ పోరాటాలను ప్రభుత్వాలు గుర్తించటానికి నిరాకరిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకుతో పాటు గుత్త పెట్టుబడుల ప్రయోజనాలే లక్ష్యంగా జరుగుతున్న అధ్యయనాలు భారతదేశంలో భూమికి సంబంధించిన చట్టాలు బలంగా ఉన్నాయని, కార్పొరేట్ శక్తులకు భారీ సౌరశక్తి ప్రాజెక్టుల నిర్మాణానికి కావలసిన భూమి దొరకడం

కష్టమవుతున్నదని వితండవాదం చేస్తున్నాయి. భూకబ్జాలకు అనుకూలంగా వున్న చట్టాలను ఇంకా సరళీకరించాలని సూచించడం విడ్డూరమే. 2018 నాటికే 1300 చ. కి.మీ అంటే 3,21,236.996 ఎకరాల వ్యవసాయ భూమిని సోలార్ ప్రాజెక్టులకు మళ్ళించారన్నది వాస్తవం.

చిన్న స్థాయి సౌరశక్తి ప్రాజెక్టుల వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని, ట్రాన్స్మిషన్ వ్యయాలు కూడా అధికమవుతాయనేది వారి వాదన.అందుకే గుత్త పెట్టుబడుల లాభాలకు అనుకూలంగా భారీస్థాయి సోలార్ పార్కుల నిర్మాణం వేగవంతమైంది. 500 MW కు తక్కువ కాకుండా సోలార్ పార్కుల పరిమాణం ఉండాలన్నారు. ఒక MW సౌరశక్తి ఉత్పత్తికి, ట్రాన్స్ మిషన్‌కు కలిపి 5 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా. అంటే 2500 ఎకరాలకు తక్కువ కాకుండా సోలార్ పార్కులు ఉంటాయి. అంతేకాకుండా సాగు భూములలో సౌరశక్తి ఉత్పాదకత అధికంగా ఉంటుందని చెపుతున్నారు. పైగా ఈ ప్రాజెక్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పట్టణ ప్రాంతాల్లోనే లభిస్తాయి. అందువల్ల పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న వ్యవసాయ భూములను సౌరశక్తి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆక్రమించుకోవడం తీవ్రమైందని అనేక సీరియస్ అధ్యయనాలు వ్యక్తం చేశాయి. భారీస్థాయి సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి భారీ స్థాయిలో భూములు కావాలి. అంటే విస్తాపన భారీగా ఉంటుంది. భూమిని, ఉపాధులను కోల్పోయిన పీడిత ప్రజలు సోలార్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తారు. కోర్టులలో కేసులు వేస్తారు. అతిపెద్ద సోలార్ ప్రాజెక్టుల నిర్మాణాలే భూమికి సంబంధించిన ఘర్షణలకు, పోరాటాలకు ప్రధాన కారణం. సోలార్ ప్రాజెక్టుల భూముల ఆక్రమణ వల్ల వ్యవసాయక ఉత్పత్తి సంబంధాలు చిన్న రైతులకు, రైతుకూలీలకు ప్రతికూలంగా మారాయి. సామాజిక అధికార సంబంధాలలో (Social power) అసమానతలు పెరిగాయని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్లనే సోలార్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పీడిత వర్గం చేస్తున్న పోరాటాలు బలంగా విస్తరిస్తున్నాయి.

ప్రభుత్వ భూఆక్రమణలు బలంగా కొనసాగుతూనే ఉన్నాయి. 2023 జూలైలో న్యూ అండ్ రెనువబుల్ ఎనర్జీ కేంద్ర మంత్రి ఆర్‌కె సింగ్ పార్లమెంట్‌కు ఇచ్చిన సమాచారం ప్రకారం సోలార్ పార్కుల నిర్మాణం కోసం 1,70,000 ఎకరాల భూమి సిద్ధంగా ఉందన్నాడు.

టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (TISS), రైట్స్ మరియు రిసోర్సెస్ ఇనిషియేటివ్ (RRI) సంయుక్తంగా 2016లో 289 భూమికి సంబంధించిన

ఘర్షణలను, పోరాటాలను పరిశీలించి రూపొందించిన నివేదిక, పోరాటాల ఒత్తిడి తీవ్రతను తెలియజేసింది. సాగుభూమి ఆక్రమణలతోపాటు సమిష్టి ఆస్తివనరులను, అడవులను కూడా ఆక్రమించుకోవడం వల్ల ప్రజల జీవన సంక్షోభం తీవ్రం అవుతున్నది. పోరాటాలు ఉధృతం అవుతున్నాయి. 2016 నాటికి భూ ఆక్రమణల వల్ల 32 లక్షల మంది జీవితాలు సంక్షోభంలో పడ్డాయి. అంతేకాకుండా 12 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ప్రమాదంలో పడ్డాయి. పెట్టుబడులను నిలువరించే శక్తి ప్రజల పోరాటాలకు వున్నదన్న వాస్తవాన్నిది స్పష్టం చేస్తుంది.

భూమికి సంబంధించిన ఘర్షణలలో 60 శాతం పైగా ప్రభుత్వ భూసేకరణకు సంబంధించినవే. భూమిని స్వాధీనం చేసుకోవటంలో ప్రభుత్వ దళారీ పాత్రను ఇది వ్యక్తం చేస్తుంది.

గుత్త పెట్టుబడులు, భారీస్థాయి సౌరశక్తి నిర్మాణాలను స్థాపిస్తాయి. భారీ పరిమాణంలో భూములను ఆక్రమించుకుంటాయి. అమెరికాకు చెందిన మర్కం క్యాపిటల్ అధ్యయనం ప్రకారం, 2023 నాటికి స్థాపించిన 72 GW స్థాపితశక్తిలో భారీస్థాయి సౌరశక్తి ప్రాజెక్టుల వాటా 77.25 శాతం. భారీస్థాయి స్థాపనలు, భారీ భూఆక్రమణలతో ముడిపడి ఉంటాయి. భారీతరహా సౌరశక్తి స్థాపనలో 54 శాతం వాటాతో రాజస్థాన్ మొదటి స్థానంలో వున్నది. రాజస్థాన్ అసెంబ్లీ, రాజస్థాన్ ల్యాండ్స్ ల్యాండ్ (కన్వర్షన్ ఆఫ్ అగ్రికల్చరల్ ల్యాండ్ ఫర్ నాన్ – అగ్రికల్చర్ పర్పస్ ఇన్ రూరల్ ఏరియాస్) రూల్స్, 2007ను సవరించింది. ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను లాక్కోవటానికి రాజస్థాన్‌లో చట్టపరమైన అభ్యంతరాలు ఉండవిక. ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను సౌరశక్తి కంపెనీలు ఆక్రమించుకోవడానికి చట్టపరమైన అన్ని అడ్డంకులను తొలగిస్తూ రాజస్థాన్ క్యాబినెట్, నవంబర్ 2024లో ఒక ప్రకటన చేసింది. సౌరశక్తి కోసం భూఆక్రమణలు నిరాటంకంగా కొనసాగటానికి దేశమంతటా ఎక్కడా చట్టాలు అడ్డుపడలేదు.

అందువల్లనే, సూర్యరశ్మి సాంద్రత అధికంగా వున్న రాష్ట్రాలలో ప్రధానంగా, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో భారీ స్థాయి సౌరశక్తి ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతూనే వున్నది. ప్రభుత్వమే దళారీగా మారటం విషాదమే. సోలార్ ప్రాజెక్టుల కోసం వేలకొద్దీ ఎకరాల భూ ఆక్రమణలు, ప్రజల వ్యతిరేక పోరాటాలు, ప్రభుత్వ అణచివేత దేశమంతటా కొనసాగుతున్నదని అమెరికా

పరిశోధకుడు రయాన్ స్టాక్, 2022లో భారతదేశంలో చేసిన అధ్యయనం ఈ అంశాన్ని మరింత స్పష్టం చేసింది.

## భారీస్థాయి సోలార్ ప్రాజెక్టుల నిర్మాణాలు – భారతదేశ ప్రభుత్వం:

సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిలో, అందులో భాగంగా సౌరశక్తి ఉత్పత్తిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడానికి 2003లో విద్యుచ్ఛక్తి చట్టం, 2005 లో జాతీయ విద్యుచ్ఛక్తి విధానం రూపొందాయి. 2006లో Ministry of New and Renewable Energy ఏర్పడింది. డిసెంబర్ 2014లో "సోలార్ పార్క్స్ అండ్ అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్ట్స్" పథకాన్ని ప్రారంభించారు. 2022 నాటికి 40,000 MW స్థాపిత శక్తి కోసం కావలసిన సోలార్ పార్కులను ప్రభుత్వమే నిర్మిస్తుంది లేదా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. ఒక్కొక్క సోలార్ పార్కు సామర్థ్యం 500 MW మించి వుండే స్థాయిలో సోలార్ పార్కులను నిర్మిస్తారు. ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు ఆటోమేటిక్ రూట్ ద్వారా 100 శాతం ఉండటానికి అనుమతినిచ్చారు. 2014–21 మధ్యకాలంలో సౌరశక్తి రంగానికి ప్రవహించిన విదేశీ పెట్టుబడులు 800 కోట్ల డాలర్లు. 2025 నాటికి 20,700 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలన్నది లక్ష్యం.

సౌరశక్తి ఉత్పత్తి మీద గ్లోబల్ స్థాయి ఆధిపత్యం కోసం భారతదేశ ప్రభుత్వం ప్రయత్నిస్తూనే వున్నది. 2015లో ప్యారిస్ అగ్రిమెంటును ఆమోదించింది. 2021లో ఐక్యరాజ్యసమితి 26 వ అంతర్జాతీయ వాతావరణ మార్పు సదస్సు (COP 26) ప్రకారం కార్బన్ వ్యర్థాలను తగ్గించడానికి ఒప్పుకున్నది. 2018లో ఏర్పడిన సౌర కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్) లో వ్యవస్థాపక సభ్యత్వం మనది. "వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్" (OSOWOG) అను వరల్డ్ సోలార్ బ్యాంకును భారతదేశం ప్రతిపాదించింది. 2030 నాటికి లక్ష్యాన్ని సాధించాలి. వీటివల్ల గ్లోబల్ సోలార్ అభివృద్ధి మీద అపూర్వమైన ప్రభావాన్ని భారతదేశం పొందుతుందని చెపుతున్నారు. 2030 నాటికి సౌరశక్తి ఆధిపత్యంతో సంప్రదాయేతర ఇంధన స్థాపిత శక్తి 500 GW వుండాలి. ఇందులో 81శాతం సౌర సామర్థ్యం, అత్యధిక భూసాంద్రతతో కూడిన గ్రౌండ్ మౌంటెడ్ ఇన్స్టాలేషన్స్ ద్వారా జరుగుతుందని అంచనా. ఈ స్థాయిలో స్థాపిత శక్తి నిర్మాణాలకు కనీసం 75,000 చదరపు కిలోమీటర్లు భూమి అంటే ఒక కోటి 85 లక్షల 33 వేల ఎకరాల భూమి కావాలి. ఈ లక్ష్యసాధన కోసమే భారీస్థాయి భూ ఆక్రమణలు, భారీస్థాయి సౌరశక్తి ప్రాజెక్టుల నిర్మాణాల పేరిట సమస్త భూములను గుత్త పెట్టుబడులకు అప్పగించటం శీఘ్రంగా, వేగంగా కొనసాగుతున్నది.

## భారీ భూ కేటాయింపులు - సౌర శక్తి ప్రాజెక్టులు:

### రాజస్థాన్:

మనదేశంలో భూములకు సంబంధించిన రికార్డులు సరిగ్గా వుండవన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రభుత్వ లెక్కల్లో రికార్డు కాని భూమి పెద్ద పరిమాణం లోనే వుంటుంది. ఇది సమిష్టి ఆస్తి వనరుగా పీడిత జనం బతకటానికి ఉపయోగపడుతుంది. ఇట్లా లెక్కల్లోకి రాని భూమి రాజస్థాన్ లో 97,526.5 ఎకరాలను వేర్వేరు కంపెనీలకు ఇచ్చారని చెబుతున్నారు. అందులో రాజస్థాన్ లోని జై సల్మార్ జిల్లాలో ఆదానీ రెనివబుల్ పార్క్ లిమిటెడ్ కు 26,307.5 ఎకరాలను ఇచ్చారు.

రాజస్థాన్ లో జై సల్మార్ జిల్లాలోని నేదాన్ గ్రామంలో 2443.87 ఎకరాలలో సజ్జలను, సోర్గం ను పండించుకుంటారు. పచ్చిక బయళ్ళుగా వాడుకొని పశువులను పోషించుకుంటారు. 2006లో భూమిలేని రైతులకు ఈ భూములను ఇస్తానని ప్రకటించింది. ఆ తర్వాత ప్రకటనను రద్దు చేసుకున్నది. ఆదానీకి చెందిన సోలార్ ప్లాంట్‌కి ఆ భూమిని ఇవ్వటానికి ఒక సంవత్సరం ముందే ఆ భూమిని ప్రభుత్వ బంజరు భూమిగా ప్రకటించారు. ఆదానీకి అప్పజెప్పారు. జనం కోర్టులో కేసులు వేశారు. యథాతథ స్థితి కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

రాజస్థాన్ లోని ఫతే ఘర్ లో 1500 MW సౌరశక్తి ఉత్పత్తి కోసం 10 వేల ఎకరాల భూమిని ఆదానీ రెనివబుల్ ఎనర్జీ పార్క్ రాజస్థాన్ లిమిటెడ్‌కి కేటాయించారు. డిసెంబర్ 2022 లో ప్రాజెక్టు సిద్ధమైంది. కానీ ఈ భూమిపై ఆధారపడి బతుకుతున్న ప్రజలు సీరియస్‌గా తమ భూముల కోసం పోరాడుతున్నారు. సౌరశక్తి ఉత్పత్తి ఆగిపోయింది.

రాజస్థాన్‌లోని ఫాలోడి తహసిల్‌కి చెందిన చాలా గ్రామాలలో 14 వేల ఎకరాలను ప్రభుత్వం సోలార్ ప్లాంట్‌కు కేటాయించింది. నిర్మాణ పనుల కోసం వచ్చిన జెసిబికి ఆగస్టు 2021లో ప్రజలు అడ్డుపడ్డారు. కంపెనీ పనివాళ్ళు, మహిళల మీద దాడులు చేశారు. 2023 నాటికి భారతదేశంలోని అతి పెద్ద సోలార్ పార్కుగా ఈ భాడ్లా సోలార్ పార్కు అని చెబుతారు.

సౌర స్థాపిత శక్తి కోసం ప్రభుత్వ భూ కేటాయింపులను 2012లో సర్వే చేసిన నేషనల్ రిసోర్సెస్ డెవలప్మెంట్ సెంటర్ అండ్ ది కౌన్సిల్ ఆన్ ఎన్విరాన్మెంట్ ఎనర్జీ అండ్ వాటర్ ప్రకారం మారుమూల ప్రాంతాలలో పచ్చికబైళ్లను సోలార్ ప్లాంట్ల కోసం భారీస్థాయిలో కేటాయించడం వ్యతిరేకతలకు, పోరాటాలకు దారితీస్తున్నది.

**గుజరాత్:**

50 శాతం గ్రామీణ కుటుంబాలు ప్రభుత్వ భూముల మీదనే ఆధారపడి జీవిస్తారు. గుజరాత్‌లో 2080 MW సౌరశక్తి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములనే కేటాయించారు.

గుజరాత్ లోని కచ్ ఎడారి ప్రాంతంలోని చరాంకాలో 730 MW సౌర శక్తి ఉత్పత్తి కోసం 36 మంది డెవలపర్లతో జనవరి 2012 లోనే సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు ఆనాటికి ఆసియా ఖండంలోని అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటి. ప్రభుత్వ వ్యర్థ భూముల పేరిట 5384 ఎకరాల భూమిని దీనికి కేటాయించారు.

గుజరాత్‌లోని కచ్ జిల్లాలో విఘాకోట్ గ్రామంలో 1,79,000 ఎకరాల "వ్యర్థ" భూములతో గుజరాత్ హైబ్రిడ్ రెనివబుల్ ఎనర్జీ పార్క్ లేదా ఖావ్డా సోలార్ పార్క్ నిర్మాణం డిసెంబర్ 2020 లోనే మొదలైంది. ఈ ప్రాజెక్టు ఆక్రమించిన భూపరిమాణం ఫ్రాన్స్ రాజధాని పారిస్ కంటే ఐదు రెట్లు అధికం. ఈ ప్రాజెక్టు సోలార్ స్థాపిత శక్తి 30 GW. ఆదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రధాన భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రెనివబుల్ ఎనర్జీ పార్కు.

గుజరాత్ లోనే ధీరూభాయ్ అంబానీ గ్రీన్ ఎనర్జీ, గుజరాత్‌లోని కచ్‌లో 5,50,000 ఎకరాల భూమిలో అతిపెద్ద సింగిల్ సైజ్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టుకు కేటాయించిన భూమి సింగపూర్ పరిమాణం కంటే మూడురెట్లు అధికం. 2026 నాటికి 20 GW సోలార్ మోడ్యులింగ్ స్థాపిత శక్తిని నిర్మిస్తుంది.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మొదలైన రాష్ట్రాల్లో సోలార్ ప్రాజెక్టుల కోసం భారీస్థాయిలో భూ కేటాయింపులు, ప్రజల ప్రతిఘటనలు కొనసాగుతూనే వున్నాయి.

ఆంధ్రప్రదేశ్ కర్నూలులో 2019 లోనే 1000 MW సౌరశక్తి ప్రాజెక్టు కోసం 5932.32 ఎకరాల భూమిని కేటాయించారు. ప్రజల తీవ్ర నిరసనల మధ్య ఆంధ్ర ప్రదేశ్ లో సోలార్ ప్లాంట్ ప్రమోటర్లకు భూములను అందుబాటులో ఉంచడానికి 2024 నాటికి 70 సోలార్ పార్కులను నిర్మించింది. సోలార్ ప్రాజెక్టుల కోసం ఇంకా 5,842 ఎకరాల భూమిని గుర్తించారు.

2016లో ఆదానీ సంస్థకు 250 MW సోలార్ ప్రాజెక్టుల కోసం ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లా మైలవరం మండలానికి చెందిన ధోడియం వడ్డిరాలలో 2400 ఎకరాల

భూమిని అడ్వాన్స్‌గా అప్పగించారు. 2019 లో ప్రాజెక్టు పూర్తయింది. 10 సంవత్సరాల తర్వాత 2025లో ఇప్పుడు 2019 మార్కెట్ ధర ఆధారంగా 33 సంవత్సరాల లీజుకిచ్చారు.

## 2025 లో ప్రకటించిన అతి భారీస్థాయి సోలార్ ప్రాజెక్టులు:

గుజరాత్‌లో 1,79,000 ఎకరాలలో ఆదానీ ప్రాజెక్టు, గుజరాత్‌లోనే 5,50,000 ఎకరాల భూమిలో అంబానీ సంస్థ సౌరశక్తి ప్రాజెక్టులతో పాటు అనేక అగ్ర కార్పొరేట్ శక్తులు తమ అతి భారీస్థాయి సౌర ప్రాజెక్టులను ప్రకటించాయి. దీనితో సౌరశక్తి ఉత్పత్తి పేరిట లక్షల ఎకరాల భూమి కార్పొరేట్ శక్తులకు బదిలీ అవుతుందన్నమాట.

1. గుజరాత్‌లో విరాజ్ కోట ప్రధాన కార్యాలయంగా, ఓనిక్స్ రెనివబుల్స్ లిమిటెడ్ 7 GW స్థాపిత శక్తి గల సోలార్ పార్కులను గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటకలో స్థాపిస్తుంది. 2030 నాటికి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తవుతుంది.
2. తమిళనాడులో, ప్రపంచంలో అతి పెద్దదిగా చెబుతున్న కాముటి సోలార్ పవర్ ప్రాజెక్టును ఆదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ స్థాపిస్తున్నది. దీని స్థాపిత శక్తి 2.3 GW.
3. భారత ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న ఎన్టిపిసి రెనివబుల్ ఎనర్జీ లిమిటెడ్ 2032 నాటికి 60 GW సంప్రదాయేతర ఇంధనాన్ని ఉత్పత్తి చేసే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌లో సోలార్ ప్రాజెక్టులను నిర్మిస్తుంది.
4. 13 GW స్థాపిత శక్తితో రి న్యూ పవర్ సంస్థ రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో సోలార్ పార్కులను నిర్మిస్తుంది.
5. 2 GW స్థాపిత శక్తితో అజురే పవర్ రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, అస్సాంలలో అతి భారీస్థాయి సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తుంది.

ఇంకా మరెన్నో సంస్థలు తమ సోలార్ ప్రాజెక్టు నిర్మాణాలను ప్రకటించాయి.

మిలియన్ల కొద్దీ ప్రజల జీవన విధ్వంసంతో అతి భారీ స్థాయిలో లక్షల ఎకరాల భూమి సోలార్ ప్రాజెక్టుల పేరిట గుత్త పెట్టుబడులకు బదిలీ అవుతుంది.

## భారీ సౌరశక్తి ప్రాజెక్టులు – పర్యావరణం మీద దుష్ప్రభావాలు:

వాతావరణ మార్పును తగ్గించి, భూగోళాన్ని రక్షించడానికి సౌర శక్తి ప్రాజెక్టులు అంటున్నారు. కానీ ఫోటో వాల్ టైప్‌తో నిర్మిస్తున్న భారీ సోలార్ ప్రాజెక్టుల వల్ల భూమి సహజ స్వభావమే మారిపోతుంది. ఒక మెగా వాట్ ఉత్పత్తి చేసే సౌరశక్తి యంత్రాలను వాష్ చేయడానికి ప్రతి వాష్‌కు 7000 నుండి 20,000 లీటర్ల నీళ్లు

కావాలి. దీనివల్ల మనదేశంలో నీటి సమస్య ఇంకా తీవ్రమౌతుంది. భూసారం నశించడం, నీటి కొరత, కెనోపి కవర్‌ను నష్టపోవటం, భూమికి తేమను నిలుపుకునే శక్తి క్షీణించడం మొదలైన సమస్యల వల్ల వాతావరణ మార్పు సమస్య తగ్గదు సరికదా తీవ్రం అవుతుందంటున్నారు పర్యావరణవేత్తలు.

ఫోటో వాల్ టైక్ ప్యానల్స్‌లో ప్రమాదకరమైన పదార్థం వుంటుంది. దీనిని శుద్ధి చేయకుండా వదిలి వేయటం వలన పర్యావరణం మీద దుష్ప్రభావం సీరియస్‌గా వుంటుంది. సోలార్ సివి ప్యానెల్స్ వ్యర్థాలు 2030 నాటికి 2 లక్షల టన్నులు అవుతుందని అంచనా. ప్రతీ 247 ఎకరాల భూమిలో నిర్మించే సోలార్ ప్లాంట్ల వల్ల దాదాపు 60 ఎకరాల అడవులు నశిస్తాయి.

## సోలార్ శక్తి ఉత్పత్తి - ప్రత్యామ్నాయ పద్ధతులు:

విస్తాపన లేకుండా భారీ స్థాయిలో భూములను ఆక్రమించకుండా సౌరశక్తిని తయారు చేయగల పద్ధతులున్నాయి. భూమికి 2–3 మీటర్ల ఎత్తున సోలార్ ప్యానల్సును ఏర్పాటు చేసినప్పుడు కింద వ్యవసాయం చేసుకోవచ్చు. నవంబర్, 2021లో తెలంగాణలోని రామగుండంలో ఎన్టిపిసి 10 MW సౌరశక్తిని ఉత్పత్తి చేయగల నీటిలో తేలియాడుతున్న సోలార్ పార్కును ఏర్పాటు చేసింది. న్యూ అండ్ ఇన్నోవేటివ్ సోలార్ అప్లికేషన్స్ ద్వారా సోలార్ ఫోటో వాల్ టైల్స్‌ను సాగుభూమితో, భవనాలతో, నీటి కాలువలతో, రైలు, రోడ్డు నెట్వర్క్ లతో అనుసంధానం చేయడం ద్వారా భారతదేశం 4,740 GE సౌరశక్తిని ఉత్పత్తి చేయగలదని అంటున్నారు.

## ముగింపు:

ప్రత్యామ్నాయ పద్ధతులతో సౌర శక్తిని ఉత్పత్తి చేసినట్లయితే మెజారిటీ ప్రజల జీవన విధ్వంసంతో ముడిపడి వున్న భారీ స్థాయి భూ ఆక్రమణల అవసరం వుండదు. కానీ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధి క్రమం భూమి కేంద్రంగా, భూమిని ఆక్రమించుకోవడంతో బలంగా ముడిపడి వుంటుంది. అందుకే పరిశోధనల్లో భాగంగా ముందుకొచ్చిన ప్రతి ఆధునిక టెక్నాలజీకి, ఆధునిక యంత్ర పరికరాలకు మార్కెట్‌ను అన్వేషిస్తుంది. తద్వారా పెట్టుబడులకు, లాభాలకు గ్యారంటీ చూసుకుంటుంది. గుత్త పెట్టుబడుల వ్యాపార ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలను రూపొందించి ఆమోదించడానికి పీడిత దేశాల నయా ఉదారవాద ప్రభుత్వాలు సిద్ధంగానే వుంటాయి. వాతావరణ మార్పును తగ్గించడానికని చెబుతూ భారీస్థాయి సోలార్ ప్రాజెక్టుల నిర్మాణం,

అందుకోసం మరింత భారీస్థాయిలో భూములను స్వాధీనం చేసుకోవడం, అపారమైన భూములను గుత్త పెట్టుబడులకు, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పటమే భారీస్థాయి సోలార్ ప్రాజెక్టుల అసలు లక్ష్యం.

భూమి పరాయీకరణ చెందకుండా, ఉపాధులను కోల్పోకుండా, గౌరవంగా, హుందాగా బతకటానికి దోపిడీ లేని సోషలిస్టు వ్యవస్థలనే నిర్మించుకోవాలి. అందుకోసం సమస్త పీడిత వర్గం, రెక్కలు తప్ప ఆస్తులు లేని శ్రామిక వర్గం తమ సహజమైన మార్పు కోరుకునే చైతన్యంతో సంఘటితంగా, బలంగా విప్లవ శక్తుల నాయకత్వంలో పోరాడాలి. ఇందుకు వేరే ప్రత్యామ్నాయమే లేదు.

♦◆♦

# 4

# వ్యవసాయ మార్కెటింగ్‌ను మొత్తంగా గుత్త పెట్టుబడులకు స్వాధీనం చేస్తున్న NPFAM ముసాయిదా-2024

వ్యవసాయ మార్కెటింగ్ మీద జాతీయ విధాన ముసాయిదాను (National Policy Framework on Agricultural Marketing) 15 రోజులలో రైతులు, ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పాలని కోరుతూ నవంబర్ 25, 2024 న కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ విడుదల చేసింది. రైతు, రైతుకూలీల బతుకుతో ముడిపడి వున్న ఈ పరిపాలనా అంశం రాష్ట్ర జాబితాలో వున్నది. రైతు సంఘాలతో, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా, ఎటువంటి సంప్రదింపులు లేకుండానే ముసాయిదా విడుదలైంది. కనీస మద్దతు ధర కావాలన్న ఒకే ఒక్క డిమాండుతో ఫిబ్రవరి 13, 2024 నుండి రైతు సంఘాలు సంఘటితంగా, సీరియస్‌గా చేస్తున్న పోరాటంలో భాగంగా 70 సం. ల రైతు సంఘ నాయకుడు జగజత్ సింగ్ ధల్లేవాలా తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్ష మొదలుకావడానికి కేవలం ఒకే ఒక్కరోజు ముందు ముసాయిదాను విడుదల చేయటంలో ప్రభుత్వం హడావుడి కనిపిస్తుంది.

2020 లో రూపొందించిన మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రైతు సంఘాలు నిలకడగా, బలంగా వ్యతిరేకించడం వల్ల నవంబర్ 2021 లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు. ఆ సమయంలో చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను అమలు చేస్తామని ప్రధానమంత్రి స్వయంగా

హామీ ఇవ్వడం జరిగింది. కానీ, అమలు చేయటాన్ని ప్రభుత్వం విస్మరించింది. అందువల్ల పంజాబ్, హర్యానా సరిహద్దులో కనౌరి శంబు ప్రాంతాలలో చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కోసం రైతు సంఘాలు నిరవధికంగా పోరాటం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అందరి ప్రయోజనం కోసం నిపుణుల కమిటీని నియమించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫలితంగా సెప్టెంబర్, 2024లో కమిటీని వేశారు. జనవరి 2025లో ఫైనల్ నివేదికను ఇవ్వవలసి వున్నది. కానీ, కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికలో చట్టం గ్యారెంటీతో కనీస మద్దతు ధరను అమలుపరచటం అవసరమని స్పష్టంగా చెప్పింది. గిట్టుబాటు ధర రాకపోవడమే రైతు అప్పుల ఊబిలో పడటానికి కారణమని ఖచ్చితంగా చెప్పింది.

కనీస మద్దతు ధర కోసం రైతు సంఘాల పోరాటం సీరియస్‌గా కొనసాగుతున్న సందర్భంలోనే వ్యవసాయం, పశుపోషణ, ఆహార తయారీకి సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ డిసెంబర్ 17, 2024 న పార్లమెంటుకు ఒక సమగ్రమైన నివేదికను ఇచ్చింది. అందులో చట్టం గ్యారంటీతో కనీస మద్దతు ధర ఎంతో అవసరమని, వీలైనంత త్వరగా అమలు చేయాలని చెప్పటం ప్రధానంగా గుర్తించవలసిన అంశం. అంతేకాకుండా కౌలుదార్లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, రైతుకూలీల కనీస వేతనం కోసం జాతీయ కమిటీని వేయాలని సూచించింది. రైతు సంక్షేమం, వ్యవసాయ సుస్థిరత, ఆహార భద్రత – ఇవి మూడూ కనీస మద్దతు ధర అమలుతో ముడిపడి వున్నాయన్నది. రైతులకు, రైతు కూలీలకు రుణమాఫీ విధానాన్ని అమలు చేయాలన్నది.

మనదేశ వ్యవసాయ రంగాన్ని సమీక్షించి, సుస్థిరాభివృద్ధి కోసం రైతు జీవనోపాధులలో గుణాత్మకమైన పెరుగుదల కోసం సూచనలను ఇవ్వాలన్న లక్ష్యంతో 2024 లో ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్ అధ్యక్షతన "నేషనల్ కమీషన్ ఆన్ ఫార్మర్స్" నియమించారు. 2004–2006 మధ్యకాలంలో ఐదు కీలకమైన సూచనలతో ఐదు నివేదికలను సమర్పించింది. ఇందులో మొట్టమొదట కీలకమైన సూచన–"కనీస మద్దతు ధర". ఇందుకోసం పంట పండించడానికి అయిన మొత్తం ఉత్పత్తి వ్యయానికి 50 శాతం లాభం మార్జిన్‌ను కలపాలంటుంది. దీనిని "స్వామినాథన్ ఫార్ములా" అంటారు.

సాగు భూమి పంపిణీలో తీవ్రమవుతున్న అసమానతలను తగ్గించడానికి ఈ కమీషన్ సూచనలిచ్చింది. భూ గరిష్ట పరిమితి అమలు వల్ల లభించే మిగులు భూములను, వ్యర్థంగా వున్న భూములను పంపిణీ చేయాలని చెబుతుంది. ప్రధానమైన సాగు భూమిని ఇతర ఉపయోగాలకు మళ్ళించకుండా ఆపాలంటుంది. అంతేకాకుండా ఆదివాసీలకు, అడవులపై ఆధారపడి జీవించే వాళ్లకు సమిష్టి ఆస్తి వనరులను అందుబాటులోకి తేవటం అవసరం. వీటితో పాటు నీటిపారుదల వసతులను ప్రభుత్వమే

అభివృద్ధి చేయాలని, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధులు, ఆదాయాలు పెరగటానికి టెక్నాలజీతో ప్రభుత్వ విధానాలు సమన్వయం కావాలని సూచించింది. రైతు సంక్షేమానికి, వ్యవసాయ సుస్థిరతకు ఈ సూచనలు నిలకడగా, నిజంగా కీలకమైనవి. అందువల్లనే ఈ సిఫారసులను మొత్తంగా అమలుపరచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కనీస మద్దతు ధర కోసం ఒకవైపు రైతు సంఘాలు చేస్తున్న సీరియస్ పోరాటాలు, మరొకవైపు ప్రభుత్వం నియమించిన కమిటీలు ఇచ్చిన బలమైన సిఫారసుల నేపథ్యంలో, అసలు కనీస మద్దతు ధర గురించి ప్రస్తావన కూడా లేని ముసాయిదాను రైతు సంక్షేమం కోసం అంటూ ప్రభుత్వం విడుదల చేయటం అంటే రైతు జీవన సంక్షోభాన్ని అవమానించటమే.

2024 గణాంకాల ప్రకారం 4.9 ఎకరాల కన్నా తక్కువ సాగుభూమిలో 86 శాతం మంది చిన్న, ఉపాంత రైతాంగమే వున్నారు. ఉత్పత్తి వ్యయాలు పెరుగుతూనే వున్నాయి. ఉచిత కరెంటు కోసం రైతులు పోరాడుతున్నారు. కానీ, ఇందుకు వ్యతిరేకంగా కొత్త విద్యుచ్ఛక్తి పంపిణీ చట్టంతో కార్పొరేట్ శక్తుల ప్రయోజనం కోసం టారిఫ్ రేట్లను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. బడా కార్పొరేట్ దిగ్గజాల లక్షల కోట్ల రూపాయల మొండి బాకీలను రద్దు చేస్తున్న ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయదు. తక్కువ వడ్డీకి రుణాలు కూడా రైతుకు అందుబాటులో వుండవు. వినియోగదారు చెల్లించే ధరలో కేవలం 10-23 శాతమే రైతుకు లభిస్తుంది. గిట్టుబాటు ధర లభించడానికి అవకాశమున్న రిజిస్టర్డ్ మార్కెట్లు దేశం మొత్తం మీద 7,057 వున్నాయి. గ్రామీణ సంతలు 22,931 వున్నాయి. కనీస మద్దతు ధరకు కేవలం 6 శాతం రైతులు మాత్రమే అమ్ముకోగలుగుతున్నారు. 94 శాతం మంది వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీల బయటనే అమ్ముకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం నిర్వహించే రవాణా లేదు, కోల్డ్ స్టోరేజ్ లు లేవు. నిలువ చేసే అవకాశం లేకపోవడంతో 30 శాతం పంట వృథా అవుతున్నదని అంచనా.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల మీద కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అమలుపరిచే నిబంధనల వల్ల గ్లోబల్ ధరలు పెరిగిన సమయంలో రైతులు పంట అమ్ముకోలేక నష్టపోతున్నారు. కాబట్టి ఎగుమతుల విధానాన్ని రైతుకు అనుకూలంగా మార్చటానికి చర్యలు తీసుకోవాలి.

కనీస మద్దతు ధర ద్వారా ప్రభుత్వ ధాన్య సేకరణ పెరిగినప్పుడే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ కూడా బలపడుతుంది. ఆహార

భద్రత సాధ్యమవుతుంది. కార్పొరేట్ శక్తులకు వారి లాభాల గ్యారంటీ కోసం ఇస్తున్న ప్రోత్సాహకాలలో కేవలం 20 శాతంతో ఈ చర్యలను తీసుకోవచ్చని 2020–21 గణాంకాలు ఆధారంగా చెబుతున్నారు. రైతు ఆదాయాన్ని పెంచడానికి వున్న సమస్త మూలాలను ప్రభుత్వం మూసివేసే చర్యలు తీసుకుంటున్నది. భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా సేకరణను తగ్గిస్తున్నారు. 2021లో ఈ సంస్థ చేసిన సేకరణ 43.3 మిలియన్ మెట్రిక్ టన్నులు వుండగా, అది 2023లో 25.2 మిలియన్ మెట్రిక్ టన్నులకు తగ్గిపోయింది. ఈ సంస్థ నిల్వ చేసే శక్తి 36 మిలియన్ మెట్రిక్ టన్నులకు పడిపోయింది. పెరుగుతున్న రైతు డిమాండుకు ఇది ఏ మాత్రం చాలదు. 46 శాతం మందికి జీవనోపాధిని కల్పిస్తున్న వ్యవసాయ రంగం వాటా స్థూల దేశీయోత్పత్తిలో కేవలం 16 శాతం. ఇది ఈ రంగం దుర్భర స్థితిని స్పష్టం చేస్తుంది. డిసెంబర్ 2023 లో విడుదలైన జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం, గత సంవత్సరంలో జరిగిన రైతుల ఆత్మహత్యలు 11,290. ఇందులో 6,083 మంది రైతుకూలీలు. కేసులుగా మారని వాస్తవ అంకెలు ఇంకా ఎక్కువే వుంటాయి. 2019 నుండి రైతు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. గంటకు ఒక రైతు గానీ, కూలీ గానీ ఆత్మహత్య చేసుకోవడం వ్యవసాయ సంక్షోభం తీవ్రతను తెలియజేస్తున్నది.

ఈ సంక్షోభం నుండి రైతును బయటకు తీసుకురావాలంటే ప్రభుత్వం తప్పనిసరిగా రైతాంగానికి అనుకూల చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ ఉత్పత్తులన్నింటికీ లీగల్ గ్యారంటీతో కనీస మద్దతు ధరను ప్రకటించాలి. అంతేకాకుండా ధరల దోపిడీ నుండి రైతులను రక్షించడానికి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీలు ఏర్పడ్డాయి. కానీ, అవి ప్రైవేట్ వ్యాపారుల లాభం కోసమే పని చేస్తున్నాయని ప్రభుత్వమే స్వతహాగా చెబుతున్నది. కాబట్టి ఆ లోపాలను సరిదిద్దే చర్యలు తీసుకొని, ఆ మార్కెట్లను బలోపేతం చేయాలి. అధిక సంఖ్యలో స్థాపించాలి. అంతేకాని, కొండ నాలుకకు మందు వేస్తే వున్న నాలుక వూడి పోకూడదు.

వ్యవసాయ రంగం మీద ప్రభుత్వ కేటాయింపులు పెరగాలి. మౌలిక సదుపాయాలను రైతుకు అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి. తక్కువ వడ్డీకి రైతుకు రుణాలు అందుబాటులోకి రావాలి. వాణిజ్య సౌలభ్యం కోసం లక్షల కోట్ల పన్ను రాబడిని కోల్పోతూ, ప్రోత్సాహకాల పేరుతో ఎంతో విలువ గల ఆస్తులను, భూములను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పుతున్న ప్రభుత్వం, రైతు బతుకు కోసం, వ్యవసాయ రంగం సుస్థిరత కోసం ఈ చర్యలు తీసుకోవడం తప్పనిసరి. కానీ, ఈ అంశాలు ఏవీ ప్రభుత్వ ఎజెండాలో లేవు. కాబట్టి ముసాయిదా ఈ అంశాలను ప్రస్తావించలేదు.

## ముసాయిదా ప్రతిపాదనలు - ఎవరి ప్రయోజనం కోసం?

2020 లో రూపొందించిన వివాదాస్పదమైన రైతు చట్టాలను రైతు సంఘాల బలమైన పోరాటం వల్ల 2021లో రద్దు చేయడం తప్పనిసరైంది. సాగుభూమి నుండి రైతులను పరాయీకరించి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.

ఆ లక్ష్యాల సాధన కోసం ఫైజ్ అహ్మద్ కిద్వాయ్ అధ్యక్షతన కమిటీ ఏర్పడింది. మరింత పకడ్బందీ వ్యూహాలతో ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశారు. వ్యవసాయ మార్కెట్‌ను డిజిటలైజ్ చేయడం, బ్లాక్ చైన్ టెక్నాలజీతో బలంగా రూపొందించడం, ఫ్యూచర్స్ తో అనుసంధానం చేయడం ద్వారా స్పెక్యులేషన్ మార్కెట్లో భాగం చేయడం మొదలైన ప్రతిపాదనలతో మన దేశీయ ఆహార సప్లై కి సంబంధించిన సమస్త అంశాలు అంతర్జాతీయ ఫైనాన్స్ కాపిటల్ ఆధిపత్యంలోకి వస్తాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా రూపొందిన ఈ ముసాయిదా మరింత ప్రమాదకరమని రైతు సంఘాలు సీరియస్‌గా ప్రతిఘటిస్తున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార తయారీ, మార్కెటింగ్ లను బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం లోకి తేవడానికి, అతి చౌకగా కార్పొరేట్ శక్తులకు సరాసరి అందటానికి అవసరమైన సరళీకరణ ప్రక్రియను ముసాయిదా రూపొందించింది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీల ప్రమేయం లేకుండా బడా కార్పొరేట్ శక్తులు డైరెక్టుగా రైతు నుండి పంటను కొనుగోలు చేయవచ్చు. కాంట్రాక్టు వ్యవసాయాన్ని ముమ్మరం చేయడంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలదే కీలకపాత్ర. గుత్త పెట్టుబడుల ఆధిపత్యంలో వున్న నిల్వ, శీతలీకరణ (కోల్డ్ స్టోరేజ్) కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను ముసాయిదా మరింత బలోపేతం చేస్తుంది. ప్రభుత్వ గోడౌన్‌లు, భారత ఆహార సంస్థ క్రమంగా అంతరిస్తాయి. పంటల మీద అంబానీ, ఆదానీ, టాటా, కార్గిల్, పెప్సీ, వాల్ మార్ట్, బేయర్, అమెజాన్ మొదలైన కార్పొరేట్ దిగ్గజాల ఆధిపత్యం స్థిరపడుతుంది. ఆహార భద్రతకు అవసరమైన ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం, బఫర్ నిల్వల కోసం అధిక ధరలు చెల్లించి ఆహార ధాన్యాలను ప్రభుత్వం కొనుగోలు చేయవలసిన పరిస్థితులు ఏర్పడతాయి.

ఇప్పటికే వ్యవసాయ ఉత్పాదకాల ఉత్పత్తి, పంపిణీ మొత్తంగా గుత్త పెట్టుబడుల ఆధీనంలో వున్నాయి. వ్యవసాయ మార్కెట్‌ను కార్పొరేటీకరించడం, కాంట్రాక్ట్ వ్యవసాయంతో సాగుభూమి మీద గుత్త పెట్టుబడుల ఆధిపత్యాన్ని స్థిరపరచడంతో మొత్తం వ్యవసాయ రంగం కార్పొరేట్ శక్తుల హస్తగతం అవుతుంది. ఈ శక్తుల

ప్రయోజనం కోసమే రూపొందించిన ఈ ముసాయిదా రైతుకు ఉరిగా మారిన కాంట్రాక్టు వ్యవసాయ ఒప్పందాల వల్ల ఏర్పడుతున్న సమస్యలను ప్రస్తావించదు.

వ్యవసాయ మార్కెట్లలో ప్రైవేటు మార్కెట్లను బలోపేతం చేయడానికి సరళీకరణ తరహా ప్రతిపాదనలు ఇందులో ముమ్మరంగా వుండాల్సిందే. సమాంతరంగా ప్రభుత్వ నిర్వహణలో నడిచే మార్కెట్లను పతనం చేయాల్సిందే. ఈ క్రమాన్ని వేగవంతం చేయటమే "చైతన్యవంతమైన మార్కెటింగ్ పర్యావరణ వ్యవస్థ నిర్మాణం" అని ప్రభుత్వం చెబుతున్నది. బలోపేతమైన ప్రైవేటు మార్కెట్లు, రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో వున్న వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీలతో పోటీ పడతాయని, అందువల్ల ఆరోగ్యకరమైన వ్యవసాయ మార్కెట్ మన దేశంలో ఏర్పడుతుందని, వివిధ మార్కెట్లు రైతుకు అందుబాటులో వుండడం వల్ల అధిక ధరకు అమ్ముకోవడం సాధ్యపడుతుందని, ఈ ముసాయిదా వల్ల రైతు సంక్షేమంలో ఎంతో ప్రగతి ఉంటుందన్న భ్రమలను కల్పించడానికి ప్రభుత్వం సీరియస్ గానే ప్రయత్నిస్తున్నది. నిజానికి, ఇప్పుడు ప్రభుత్వ మార్కెట్లలోనే అమ్ముకోవాల్సిన అవసరం లేదు. గుత్త పెట్టుబడుల గుప్పిట్లో వున్న ఏ ప్రైవేటు మార్కెట్లలోనైనా అమ్ముకోవచ్చు. ఎక్కడా కనీస మద్దతు ధర లభించే ప్రశ్నే లేదు. కాబట్టి ఏ ప్రైవేట్ మార్కెట్లో దోపిడీకి గురికావాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ రైతుకు అపారంగా లభిస్తుంది. నిరాటంకంగా రైతు దోపిడీకి గురికావచ్చు. ప్రభుత్వ మార్కెట్ యార్డుల లోనే రైతులు తమ పంటను విక్రయించాలన్న నిబంధనను ముసాయిదాలో తొలగించారు. ఇదే రైతు సమస్యకు పరిష్కారం అంటున్నారు.

ప్రైవేట్ వ్యవసాయ మార్కెట్లను దేశమంతటా వ్యాప్తిచెయ్యడం కోసం ముసాయిదాలో సంస్కరణలను ప్రవేశపెట్టారు. i). ప్రైవేటు హోల్ సేల్ మార్కెట్ల స్థాపనకు అనుమతులు ii). ఆహార తయారీ సంస్థలు, ఎగుమతి దారులు, వ్యవస్థీకృత డీలర్లు, భారీ స్థాయిలో కొనుగోలు చేసేవాళ్లు, మొత్తం మీద బడా కార్పొరేట్ శక్తులు రైతుల వద్ద నుండి పంటను డైరెక్టుగా కొనుక్కోవచ్చు. iii). గుత్త పెట్టుబడుల ఆధిపత్యంలో వున్న గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్ లు, ఆహార పంటలను నిల్వ చేసే భారీ స్థాయి గోదాంలు, మొదలైనవన్నీ ఇక డీమ్డ్ మార్కెట్లే. iv). ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ (e-trading) ప్లాట్ ఫాంల స్థాపన కూడా ముసాయిదా ప్రతిపాదనే. అంటే ఆన్లైన్ లో షేర్లు, బాండ్ల ద్వారా కూడా వ్యవసాయ పంటను కొనుక్కోవచ్చు, అమ్ముకోవచ్చు. v). దేశమంతటికీ వర్తించే ఒకే లైసెన్సు.

80 చదరపు కిలోమీటర్లకు ఒక ప్రైవేటు మార్కెట్ ను స్థాపిస్తారు. సెబీ (SEBI)తో కలిసి, వీలైనంత ఎక్కువ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను, ఫ్యూచర్స్ ప్లాట్ ఫాంలతో సమన్వయం చేయటం, ఇంకా e - NAM పేరిట ఒక ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ పోర్టల్‌ను

రూపొందిస్తారు. ఇది APMC మండీలతో కనెక్ట్ అవుతుంది. ఆ విధంగా ఆన్లైన్ ట్రేడింగ్ లో యూనిఫైడ్ నేషనల్ మార్కెటింగ్ ను సృష్టిస్తారు. ఇందుకు దేశమంతటికీ వర్తించే లైసెన్స్ అవసరం. అందువల్లనే ముసాయిదా కమిటీ ప్రకారం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రులతో “Empowered Agriculture Marketing Reform Commitee”ని ఏర్పాటు చేయాలి. ఒకే లైసెన్స్/ రిజిస్ట్రేషన్ సాధారణమైన ఫీజు కోసం రాష్ట్రాల ఆమోదాన్ని పొందాలి. రాష్ట్రాల సహకారంతో ప్రైవేటు హోల్ సేల్ మార్కెట్లను గుర్తించి బలోపేతం చేయాలి. గ్రామీణ సంతలను, e- NAM తో సమన్వయ పరచాలి. “వన్ నేషన్ – వన్ మార్కెట్” లక్ష్యానికి అనుగుణంగా దేశమంతటా ఒకే “యూనిఫైడ్ నేషనల్ మార్కెట్” ఏర్పాటు చేయాలంటే వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్రాల జాబితాలో వున్నది. కాబట్టి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రులతో కమిటీ వేయాలి. రాష్ట్రాల ఆమోదం తీసుకునే చర్య.

రాష్ట్ర ప్రభుత్వంలో వున్న APMC మార్కెట్ యార్డులు రైతు సంక్షేమం గురించి కాకుండా ప్రైవేటు వ్యాపారుల కోసం పనిచేస్తున్నాయని విమర్శించిన ప్రభుత్వం, రెగ్యులేటెడ్ మార్కెట్లను నిర్మూలించి, ప్రైవేటు మార్కెట్ల స్థాపనకు చర్యలు తీసుకోవడం దారుణమైన చర్య.

APMC లు ఫీజులు వసూలు చేయటానికి పరిమితం కాకూడదంటుంది ముసాయిదా. ప్రైవేట్ భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పన, ఎగుమతులను ప్రోత్సహించడం మొదలైన చర్యలను తీసుకోవాలంటుంది. క్రమంగా ఇవన్నీ ప్రైవేట్ మార్కెట్లవుతాయి.

2019లో జరిగిన నీతీ ఆయోగ్ అధ్యయనం ప్రకారం, బీహార్ లో APMC మార్కెట్లను రద్దు చేయటం వల్ల APMC లు వున్న రాష్ట్రాలతో పోల్చినప్పుడు బీహార్ రైతులు 20–30 శాతం తక్కువ ధరకు పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ అధ్యయనం రెగ్యులేటెడ్ మార్కెట్ల అవసరాన్ని, ప్రైవేటు మార్కెట్ల దోపిడీని స్పష్టంగా స్పష్టం చేసింది. అయినప్పటికీ, ముసాయిదా ప్రకారం రెగ్యులేటెడ్ మార్కెట్లను పనిచేయకుండా చేయాలి. భారీస్థాయి ప్రైవేట్ మార్కెట్లను ఏర్పాటు చేయాలి.

కాంట్రాక్టు వ్యవసాయ ఒప్పందాలతో సాగుభూమి నుండి రైతు పరాయీకరించబడతాడు. కాంట్రాక్ట్ ఒప్పందం చేసుకున్న గుత్త సంస్థలతో భారీ స్థాయిలో దోపిడీకి గురికావటం ఆధారాలతో వున్న వాస్తవం. అయినప్పటికీ ఈ ప్రతిపాదనవల్ల, ధర రిస్క్ నుండి రైతులను రక్షించడానికి ఇదే మార్గం అని ముసాయిదా అంటుంది. ధర బీమా పథకాన్ని పరిష్కారంగా చెబుతుంది. ఏ రంగంలోనైనా కార్పొరేటీకరణ తప్పనిసరిగా బీమా రంగంతోనే ముడిపడి వుంటుంది. కానీ, లీగల్ గ్యారంటీతో

కనీస మద్దతు ధరను మాత్రం వద్దంటుంది. రైతులు దివాళా నుండి తప్పించుకోవడానికి రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా కాంట్రాక్టు వ్యవసాయ ఒప్పందాలనే ముసాయిదా పరిష్కారంగా చూపిస్తుంది. దేశవ్యాప్తంగా బిజెపి గ్రామాలలో తమ క్యాడర్లను సృష్టించుకోడానికి ఇప్పటికే ఈ ఉత్పత్తిదారుల సంఘాలకు ఆశలు చూపిస్తూ వస్తున్నది. ధనిక రైతాంగాన్ని మభ్యపెట్ట జూస్తున్నది.

వ్యవసాయ మార్కెటింగ్ లో ముసాయిదా ప్రతిపాదనలన్నీ వ్యవసాయ రంగాన్ని మొత్తంగా గుత్త పెట్టుబడులకు అప్పగిస్తాయి. అందుకే రైతుల సంఖ్య, పంట విస్తీర్ణం, మార్కెట్ కు వస్తున్న మిగులు, రవాణా, ఇతర వస్తువులను మ్యాపింగ్ చేసి, ఆ సమాచారం అందుబాటులోకి రావాలని ముసాయిదా చెబుతుంది. వ్యవసాయ మార్కెట్లను తమ ప్రయోజనాలకు అనుగుణంగా నియంత్రించడానికి ఈ సమాచారం గుత్త సంస్థలకు అవసరమే మరి. ఈ సంస్థల వాణిజ్య సౌలభ్యం కోసం మార్కెట్ ప్రక్రియలను డిజిటల్ ఆటోమేషన్ చేయాలని, లైసెన్స్ లను డిజిటల్ ద్వారా ఇష్యూ చేయాలని ముసాయిదా చెబుతుంది. అంటే ఇది కేవలం మార్కెటింగ్‌కి మాత్రమే పరిమితమైన చట్టం చేయడానికి రూపొందించిన ముసాయిదా కాదు. ఏ పంటలు ఎంతెంత విస్తీర్ణంలో వేయాలో, ఏ ఏ ప్రాంతాల్లో ఏ ఏ పంటలు పండించకూడదో నిర్ధిష్టంగా చెప్పడానికి కావాల్సిన అన్ని వివరాలు వారికి అందుబాటులోకి తెచ్చుకోగలుగుతారు.

గ్లోబల్ విలువ గొలుసుతో అనుసంధానం కోసం బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యత పరీక్ష, సర్టిఫికెట్ చేయడం, ఆర్గానిక్ ఉత్పత్తుల మార్కెటింగ్ మీద, పళ్ళు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, మెడికల్ మొక్కలు మొదలగు వాటి మీద ఫోకస్ అవసరమని ముసాయిదా అంటుంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల కోసం బ్రాండింగ్ ఉండాలంటుంది. ఈ ప్రతిపాదనలన్నీ వ్యవసాయ మార్కెటింగ్‌ను స్వాధీనం చేసుకుంటున్న గుత్త పెట్టుబడుల కోసమే.

ఆకలిమీద పోరాటం అంటూ ఆహార పదార్థాల అపరిమిత ఉత్పత్తి గురించి పరిశోధించి ప్రపంచమంతా విస్తరించిన సస్యవిప్లవం గురించి ఇప్పుడు చర్చించాలి కదా! వాస్తవ వ్యవసాయ సమస్యను, పెరిగిన అసమానతలను, వ్యవసాయం పట్ల పెరిగిన అనాసక్తతను, పెరిగిన భూ పరాయీకరణను, పెరిగిన కౌలుదార్లను గుర్తించాల్సిన సమయంలో రైతాంగం దృష్టిని ఉత్పత్తి నుంచి మార్కెట్ల పైకి మారుస్తున్నారు. ఏరకం పంటను సాగుచేసినా, ఎన్ని టన్నులు పండించినా ఉత్పత్తులను సరైన విధంగా నిలువ చేయడం, మార్కెట్ దోపిడీ అన్నవి కీలకమైన అంశంగా రైతాంగం గ్రహించారని పాలకవర్గాలు పసిగట్టాయి. ప్రపంచీకరణ తర్వాత మార్కెటింగ్, ట్రేడింగ్

అన్నవే కీలకంగా మారాయని కూడా అందరికీ తెలుసు. ఉత్పత్తిలో లాభాల కోసం నెలలతరబడి వేచి వుండాల్సిన అవసరం పెట్టుబడిదారులకు లేకుండా ప్రతిరోజూ అపరిమిత లాభాలను కళ్ళతో చూసే గుత్త పెట్టుబడులకు ఈ మార్కెటింగ్ రంగంపై కన్నుపడింది. అప్పటినుంచే ప్రపంచంలోనూ, దేశంలోనూ రైతాంగంపై తీవ్రమైన దాడి పెరిగింది. ఆహార భద్రత పేరుతో బడ్జెట్లను కొల్లగొట్టడానికి కొత్త దారులు వెతుకుతున్నారు. రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రీకృత గుత్త పెట్టుబడులకు అవకాశాలిచ్చే విధానాల్లో భాగమే ఇవన్నీ. అంటే ధనిక రైతాంగాన్ని, దళారీ పెత్తందారీ వర్గాలను కొంత సంతృప్తిపరచి నేరుగా తమ అవసరాల్లోకి ఇముడ్చుకోవడం ద్వారా ఇప్పుడున్న వ్యవసాయ సంక్షోభాన్ని, వైరుధ్యాలను సుదీర్ఘ కాలంపాటు కొనసాగించడం ఇందులోని అంతర్గత లక్ష్యం.

**ముగింపు:**

రైతులకు జీవితాలను, దేశ ప్రజలందరికీ ఆహారాన్ని, ఆత్మగౌరవాన్ని అందించే వ్యవసాయ రంగాన్ని కేవలం లాభం కోసమే పనిచేసే ప్రైవేటు పెట్టుబడులకు అప్పగించటాన్ని ఆపాలి. మనందరి బతుకులతో ముడిపడి వున్న వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడం కోసం రైతాంగంతో కలిసి అందరూ సంఘటితమై, బలమైన పోరాటాలు నిర్మించాలి.

♦◆♦

5

# గుత్త పెట్టుబడులకు బదిలీ అవుతున్న భారతదేశ గనులు, ఖనిజ సంపద

పారిశ్రామికీకరణను బలోపేతం చేయటానికి గనులు, ఖనిజాలు తప్పనిసరిగా అవసరమవుతాయి. దేశ మనుగడ, అభివృద్ధి వీటి లభ్యతతోనే ముడిపడి వుంటుంది. ఇంధనం, పరమాణు, లోహ, లోహేతర సంబంధిత 95 రకాల ఖనిజాలను మన దేశం ఉత్పత్తి చేస్తున్నది. ఇందులో బొగ్గు గనుల ప్రాధాన్యత మరింత కీలకమైంది. థర్మల్ విద్యుత్తుతో పాటు ఉక్కు, సిమెంట్ ఉత్పత్తులకు, కెమికల్, ఫార్మాసుటికల్ మొదలైన పరిశ్రమలకు బొగ్గు అవసరమవుతుంది. రవాణా ఇంధనంగా, సింథటిక్ ఇంధనంగా కూడా బొగ్గును ఉపయోగిస్తారు. విస్తారమైన ఈ ప్రయోజనాల వల్లనే 1973 లోనే బొగ్గు గనుల ఉత్పత్తిని జాతీయీకరించారు. కోల్ ఇండియా లిమిటెడ్ (CIL) ప్రభుత్వ గుత్త సంస్థ ఏర్పాటైంది.

గనులను, ఖనిజాలను తవ్వటం వల్ల అక్కడి ప్రజలు, ప్రధానంగా ఆదివాసులు విస్తాపనకు గురవుతారు. జీవనోపాధులను కోల్పోతారు. కాబట్టి వీరికి పునరావాసం కల్పించవలసి వుంటుంది. ఈ క్రమంలో అడవులకు, పర్యావరణానికి కలిగే నష్టాన్ని కనిష్టం చేసుకోవాలి. లాభాపేక్ష లేకుండా దేశ ప్రయోజనాలు, ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేసే ప్రభుత్వ రంగ సంస్థలే గనులను, ఖనిజాలను నిర్వహించాలి. లాభం కోసం మాత్రమే పనిచేసే ప్రైవేటు సంస్థలకు ఈ రంగంలో స్థానం వుండకూడదు.

అయితే, 1990 లలో ప్రపంచీకరణ ప్రవేశంతో దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం కాలం చెల్లినవైనాయి. ప్రజల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యంగా ఉండటమే,

ఆర్థిక సంక్షోభాలకు కారణంగా ప్రచారమైంది. ప్రజల శ్రేయస్సును విస్మరించటమే నయా ఉదారవాద విధానాల ప్రధాన లక్షణమైంది. 2014 నుండి బొగ్గు గనులతో పాటు సమస్త గనులను, ఖనిజాలను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు అప్పగించటం వేగవంతమైంది. జాతీయీకరణ నుండి, అందుకు పూర్తిగా వ్యతిరేకమైన ప్రైవేటీకరణకు శీఘ్రంగా మారింది. 'అసమర్థత' ప్రభుత్వ రంగ సహజ లక్షణమని, "సామర్థ్యానికి ప్రైవేటు రంగం సంకేతం" అన్న వాదన ఈ పరిణామానికి మద్దతునిచ్చింది. నిజానికి ప్రైవేటు రంగ సామర్థ్యాన్ని వ్యక్తం చేసే ఏ ఆధారమూ లేదు. కానీ, ప్రస్తుతం ప్రైవేటీకరించిన అన్ని రంగాలలో ప్రైవేట్ రంగం యొక్క డొల్లతనం స్పష్టంగా బయటపడుతూనే వున్నది. ఈ వాస్తవాన్ని అభావం చేస్తూ, ప్రైవేటు రంగమే గొప్పదని చెప్పటం వైరుధ్యమే.

## భారతదేశంలో గనులు, ఖనిజాలు - కార్పొరేట్ శక్తులు:

2010 నాటికే 2,999 గనులలో 2,229 గనులను ప్రైవేటీకరించారు. బడా కార్పొరేట్ సంస్థలు, అధిక మూలధన సాంద్రత కలిగిన టెక్నాలజీనే ఉపయోగిస్తారు. భారీ ఎత్తున గనులను తవ్వుతారు. స్థానిక వనరులను, నీళ్లను, ఉనికిలో వున్న మౌలిక సదుపాయాలను విస్తారంగా వినియోగిస్తారు. అడవులను, భూమిని, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తారు. గనుల తవ్వకంలో స్థానికులకు ఏ ఉపాధి అవకాశమూ వుండదు. జీవనోపాధులను కోల్పోయి, విస్తాపనకు గురైన స్థానికులకు ప్రైవేటు రంగం పునరావాసాన్ని కల్పించదు. అందువల్లనే భారీ స్థాయిలో గనుల తవ్వకం, భారీ స్థాయి ప్రజల ప్రతిఘటనకు కారణం అవుతుంది. మనదేశంలో బాగా వెనుకబడి వున్న 150 జిల్లాలలో, శిఖర స్థాయిలో ఖనిజ ఉత్పత్తి వున్న జిల్లాలలో 70 శాతం వుండటం గమనించవచ్చు. గుత్త పెట్టుబడుల స్వాధీనంలో ఖనిజ సంపద వుండటం వల్ల మెజారిటీ స్థానిక ప్రజలు దుర్భర దారిద్ర్యంలో బ్రతకాల్సి వస్తున్నది.

అందువల్లనే, జార?ండ్ ముఖ్యమంత్రి, గనుల ప్రైవేటీకరణను సీరియస్‌గా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ పెద్దఎత్తున ఖనిజాలు, గనులు గుత్త పెట్టుబడులకు స్వాధీనం అవుతూనే వున్నాయి. కోవిడ్ విపత్తు వల్ల ఏర్పడిన సంక్షోభం నుండి బయటకు రావటానికి 2020 లో "ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్" ను ప్రకటించారు. ఇందులోని నాలుగవ విడతలో, మనదేశ గనులు, ఖనిజ సంపదను వాణిజ్యీకరించటం, కార్పొరేటీకరించటం, విదేశీకరించటం ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టంగా చెప్పారు.

వేదాంత గ్రూపు, గనులకు సంబంధించిన మన దేశ అతిపెద్ద బహుళ జాతి సంస్థ. ఇది ముంబై కేంద్రంగా పనిచేస్తుంది. గోవా, కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్, చత్తీస్ ఘడ్, ఒడిషా మొదలైన రాష్ట్రాలలో ముడి ఇనుము, బంగారం, అల్యూమినియం గనులను స్వాధీనం చేసుకున్నది. అంతేకాకుండా BALCO, అల్యూమినియంకు సంబంధించిన ప్రభుత్వరంగ సంస్థను, హిందుస్థాన్ జింక్ అనే మరొక ప్రభుత్వ రంగ సంస్థను స్వాధీనం చేసుకున్నది. ఈ సంస్థకు చెందిన కాపర్ స్మెల్టర్ ప్లాంట్ స్టెరిలైట్ తమిళనాడులోని తూత్తుకుడిలో వున్నది. ఈ ప్లాంట్ వల్ల అక్కడి నీరు, గాలి కలుషితమైనాయి. ప్రజలు అనారోగ్యాల పాలైనారు. ఈ సంస్థను మూసివేయాలని వేలమంది ప్రజలు భారీ స్థాయిలో ప్రతిఘటించారు. పోలీసులు నిరసనకారుల మీద జరిపిన కాల్పులలో 2018 లో 13 మంది మరణించారు. 100 మంది గాయపడ్డారు. తీవ్రమైన పర్యావరణ విధ్వంసానికి కారణమైన ఈ సంస్థను శాశ్వతంగా మూసివేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. లాభాల వెంపర్లాటలో గుత్త పెట్టుబడుల పనితీరును ఈ సంఘటన స్పష్టం చేస్తుంది.

2001లో హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ స్కాంతో ఈ సంస్థ కుమ్మక్కు అయిందని రుజువు కావటం వల్ల సెబి, ఈ సంస్థ మీద రెండు సంవత్సరాలు నిషేధాన్ని విధించింది.

ఈ సీరియస్ నేరాలు ఏవీ ఈ సంస్థ బలమైన విస్తరణకు ఆటంకం కాలేదు. రాజస్థాన్ లో ఖనిజాల మీద, ప్రధానంగా జింక్, వెండి మీద లక్ష కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టింది. స్వాధీనం చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థ, హిందుస్థాన్ జింక్ సంస్థ ద్వారా 35,000 కోట్ల రూ.ల పెట్టుబడులతో జింక్ వార్షిక ఉత్పత్తిని 1.2 మిలియన్ టన్నుల నుండి 2 మిలియన్ టన్నులకు, వెండి ఉత్పత్తిని 800 టన్నుల నుండి 2000 టన్నులకు, కెయిర్న్ ఆయిల్ మరియు గ్యాస్ సంస్థ ద్వారా 35,000 కోట్ల రూ.ల పెట్టుబడులతో ఈ సంస్థ ఉత్పాదక శక్తిని 3 లక్షల బ్యారెల్స్‌కి పెంచుతామని చెబుతున్నారు.

ఒడిషాలో గనుల మీద ఇంతకుముందే, ఈ కార్పొరేట్ సంస్థ లక్షకోట్ల రూపాయల పెట్టుబడులను పెట్టింది. అల్యూమినియం రిఫైనరీ కోసం, అల్యూమినియం సంస్థను స్థాపించడం కోసం మరొక లక్ష కోట్ల రూపాయల పెట్టుబడికి సిద్ధంగా వున్నది. 2030 నాటికి అల్యూమినియంకు డిమాండ్ రెండు రెట్లు పెరుగుతుందని అంచనా వేస్తున్నది. ఈ సంస్థ వల్ల దిగువ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయంటున్నది.

గనులు, ఖనిజాలకు సంబంధించిన ఈ గుత్త సంస్థ వల్ల ప్రజల జీవన సంక్షోభం, పర్యావరణ విధ్వంసం ఏ స్థాయిలో వుంటుందో వేదాంత గ్రూప్‌కి స్పష్టంగా తెలుసు.

అందువల్లనే ప్రభుత్వంతో కలిసి, ఒడిషాలో విద్య, ఆసుపత్రులు, నైపుణ్య శిక్షణలో పాలుపంచుకుంటానని చెబుతున్నది.

గనులు, ఖనిజాలలో ప్రభుత్వరంగం అవశేషాలు ఏమాత్రం వుండొద్దని కార్పొరేట్ శక్తుల ఆకాంక్ష.ఎంతో విలువైన రాగి, బంగారు గనులను మొత్తంగా ప్రైవేటీకరించాలని వేదాంత గ్రూపు అధినేత అనిల్ అగర్వాల్ బలమైన డిమాండ్. రాగి గనుల తవ్వకం మొత్తం ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ ఆధీనంలోనే వున్నది. కాబట్టి రాగి ఉత్పత్తిని పెంచి, దిగుమతులను తగ్గించుకోవడానికి ఈ సంస్థను ప్రైవేటీకరించాలని, అదేవిధంగా బంగారు గనుల్లో వున్న రెండు ప్రభుత్వ రంగ సంస్థలు – భారత్ గోల్డ్ మైన్, హుట్టి గోల్డ్ మైన్‌లను కూడా ప్రైవేటీకరించాలని వేదాంత గ్రూప్ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నది. ప్రపంచ స్థాయి బంగారం ధర, రికార్డు స్థాయి అధికంగా ప్రస్తుతం ఉన్నదని, 99.9 శాతం బంగారాన్ని మనం దిగుమతి చేసుకోవడం వల్ల విదేశీ మారక చెల్లింపుల శేషం లోని కరెంటు అకౌంట్ లోటు పెరుగుతున్నదని, బంగారం గనుల ప్రైవేటీకరణతో ఈ సమస్య పరిష్కరించబడుతుందని వేదాంత గ్రూపు వాదిస్తున్నది. ఎంతో విలువైన, కీలకమైన గనులు, ఖనిజ సంపద గుత్త పెట్టుబడులకు స్వంతం కావాలన్నమాట. భారీ స్థాయి తవ్వకాలతో అపారమైన సంపద గుత్త పెట్టుబడుల సొత్తు అవుతుంది. ఆదివాసీలు, స్థానికుల జీవితాలు, జీవనోపాధులతో పాటు అడవులను, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తారు. భూమిని డొల్లచేస్తారు. భారీస్థాయిలో గోతులు ఏర్పడతాయి. గుత్త పెట్టుబడులు మాత్రం లక్షల కోట్ల పెట్టుబడులతో మరిన్ని గనులను స్వాధీనం చేసుకొని ప్రజల పర్యావరణ విధ్వంసానికి సిద్ధమవుతాయి.

## బొగ్గు గనులు – ఆదానీ గ్రూపు:

దేశానికి కీలకమైన అనేక రంగాలలో ఆదానీ గ్రూపు ఆధిపత్యం బలపడింది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ శక్తి ఉత్పత్తి, గిడ్డంగులు, వీటితోపాటు బొగ్గు గనులు కూడా ఆదానీ గ్రూపు స్వంతం అయినాయి. ఆదానీ గ్రూపు, టాటా గ్రూపు చాలా కాలం నుండి బొగ్గు గనుల ప్రైవేటీకరణ కోసం ఒత్తిడి తెస్తున్నారు. అయితే, బొగ్గు గనుల ప్రైవేటీకరణ వల్ల అటవీ సంరక్షణ చట్టాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన చట్టాల ఉల్లంఘన తీవ్రమైంది. అందువల్లనే 2009లో పర్యావరణ మంత్రిత్వ శాఖ, 602 బొగ్గు బ్లాకులలో 392 మాత్రమే “గో జోన్లు”, మిగిలిన 206 బొగ్గు బ్లాకులను “నో గో జోన్లు” గా ప్రకటించింది. కార్పొరేట్ శక్తుల ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వం బి.కె. చతుర్వేది అధ్యక్షతన కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచనలతో

నో గో జోన్లలోని 57 బ్లాకులను గో జోన్లుగా మార్చారు. అంటే చట్టాల ఉల్లంఘనతోనే గనుల ప్రైవేటీకరణ ముడిపడి వుంటుందన్నమాట. ఈవిధంగా 2011 లోనే ఆదానీ గ్రూపుకు చెందిన చత్తీస్ ఘడ్ లోని హస్ జియో ఆరండ్ బొగ్గు గని, నో గో జోన్ నుండి గో జోన్ జాబితాలోకి వచ్చింది. ప్రజల నిరసనలు, పోరాటాల మధ్య ఆదానీ గ్రూపు బొగ్గు తవ్వకం నిరాటంకంగా కొనసాగుతున్నది. దట్టమైన అడవులు, ఆదివాసీల జీవితాలు, జీవనోపాధులు విధ్వంసం అవుతూనే వున్నాయి. ఛత్తీస్‌ఘడ్ లోని ఈ బొగ్గు బ్లాకు చాలా పెద్దది. దీని విస్తీర్ణం 1878 చదరపు కిలోమీటర్లు. ఇందులో దట్టమైన అడవుల విస్తీర్ణం 1,502 చదరపు కిలోమీటర్లు, ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు వుంటాయని అంచనా. దీనిని 18 బ్లాకులుగా విభజించారు. ఇందులో ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన 4 బ్లాకులను ఆదానీ గ్రూపుకి కాంట్రాక్టుకు ఇచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను నామరూపాలు లేకుండా చేయటానికే ప్రభుత్వం సీరియస్‌గా ప్రయత్నించటం వైరుధ్యమే.

జార్ఖండ్‌లో మూడు ఆపరేటింగ్ బొగ్గు గనులు, అభివృద్ధి దశలో వున్న మరెన్నో బొగ్గు గనులు, 2020 బొగ్గు గనుల వేలంలో 5 బొగ్గు గనులు ఆదానీ గ్రూపు స్వాధీనంలో వున్నాయి. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన, మధ్యప్రదేశ్‌లోని సులియారీ బొగ్గు బ్లాకు నిర్వహణను ఆదానీకే ఇచ్చారు. మధ్యప్రదేశ్ లోనే, ఆదానీ అనుబంధ సంస్థలైన స్ట్రాటాటెక్ మినరల్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ నియంత్రణలోకి ధిరాంటి బొగ్గు బ్లాకు, మహాన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ నియంత్రణలో మారా II మహాన్, మధ్య ప్రదేశ్ నేచురల్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్వాధీనంలో గాంధహెరా ఉజ్ హెని ఈస్ట్ బొగ్గు బ్లాకులున్నాయి.

ఆదానీ గ్రూపుకు, టాటా గ్రూపుకు ఇండోనేషియాలో కూడా బొగ్గు గనులున్నాయి. అయినప్పటికీ, 2021లో కృత్రిమ బొగ్గు కొరతను సృష్టించారు. ఆదానీ, టాటా పవర్ ప్లాంటులు థర్మల్ విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశాయి. ప్రజలను, పరిశ్రమలను ఇబ్బందులకు గురిచేసాయి. ఇదంతా విద్యుత్తు ధరను పెంచడానికి, అధిక లాభాలను ఆర్జించటానికే. లాభాల కోసం చేసే ఈ కుట్రలన్నీ సమర్ధతకు చిహ్నాలే. ప్రైవేటు సంస్థలు బొగ్గు కొరతను తమ లాభం కోసం సృష్టిస్తాయి. కానీ బొగ్గు కొరత సమస్యను పరిష్కరించవు.

మధ్యప్రదేశ్‌లోని గాంధహెరా ఉజ్ హెని ఈస్ట్ (GUE) బొగ్గు బ్లాకును 2022లో వేలం వేశారు. 2040 హెక్టార్ల విస్తీర్ణంలో వున్న ఈ బ్లాకులో బొగ్గు నిల్వలు 250

మిలియన్ టన్నులుంటుందని అంచనా. 1095 హెక్టారుల అటవీ ప్రాంతం వుంది. ఈ వేలంలో కేవలం ఆదానీ గ్రూపు మాత్రమే పాల్గొన్నది. అయినప్పటికీ ఎంపవర్ కమిటీ ఆఫ్ సెక్రటరీస్ సూచనతో అక్టోబర్, 2023 లో ఈ బొగ్గు బ్లాకును ఆదానీకి కేటాయించారు. బొగ్గును వెలికి తీసి మార్కెట్లో అమ్ముకోవటానికే హక్కు ఉంటుంది. కానీ, 2023–24 చివరలో ఆదానీ గ్రూపుకు చెందిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఈ బొగ్గు బ్లాకు హక్కులను విక్రయించాలని నిర్ణయించారు. ప్రభుత్వం నుండి స్వాధీనం చేసుకున్న గనులను, ఖనిజాలను కార్పొరేట్ సంస్థలు తమ లాభాలకు అమ్ముకుంటాయి, కొనుక్కుంటాయి. ఇది రియల్ ఎస్టేట్ మార్కెట్ రూపం తీసుకుంటుంది. ప్రభుత్వం నిస్తబ్దంగా చూస్తుంది.

గనులు, ఖనిజాలు గుత్త పెట్టుబడుల స్వాధీనంలోకి పోయినప్పుడు దేశం, దేశ ప్రజల సంక్షోభం ఎంత తీవ్ర స్థాయిలో వుంటుందో ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి.

## ప్రైవేటీకరణ – చట్టాలు – చట్ట సవరణలు:

స్వాతంత్ర్యానంతర భారత దేశంలో, అతి కీలకమైన, విలువైన గనులు, ఖనిజ సంపదను ప్రభుత్వ రంగానికి పాలకులు రిజర్వు చేశారు. అందుకనుగుణంగా ద మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 1957 రూపొందింది. 1973 లో బొగ్గు క్షేత్రాలను జాతీయాకరించారు. 1990 లలో ప్రపంచీకరణ ప్రవేశంతో పరిస్థితి మొత్తంగా తలక్రిందులైంది. MMDR చట్టం, 1957ను విస్తృతంగా సవరించారు. 1993 లోనే రూపొందిన నేషనల్ మినరల్ పాలసీలో గనుల తవ్వకం, అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని అనుమతించారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో దేశీయ పెట్టుబడులు, విదేశీ పెట్టుబడులు రాలేదు. సరియైన సంస్కరణలను సూచించటానికి హుడా కమిటీని నియమించారు. ఈ కమిటీ సూచనల ఆధారంగా నేషనల్ మినరల్ పాలసీ, 2008 రూపొందింది. దీని ప్రకారం గనుల తవ్వకం, అన్వేషణలను వేర్వేరు స్వతంత్ర కార్యక్రమాలుగా విభజించారు. లీజు కాలానికి భద్రతను కల్పించారు. ఆధునిక టెక్నాలజీకి ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించారు.

2014 వరకు ప్రైవేటు పారిశ్రామిక సంస్థలకు తమ స్వంత వినియోగం కోసమే బొగ్గు గనులు వుండేవి. ఉత్పత్తి చేసిన బొగ్గును మార్కెట్లో అమ్మటానికి వీలులేదు. 214 బొగ్గు గనుల కేటాయింపులు చెల్లవని, సెప్టెంబర్ 2014లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అప్పుడే అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం, వెంటనే కోల్ మైన్స్ (స్పెషల్ ప్రొవిజన్స్) యాక్ట్, 2015 ను రూపొందించింది. ఈ చట్టం ప్రకారం వేలం

వేయటం ద్వారా బొగ్గు గనులను ప్రైవేటు రంగానికి కేటాయించవచ్చు. విదేశీ పెట్టుబడులు కూడా వేలంలో పాల్గొనవచ్చు. 2015 లో ప్రారంభమైన జాతీయాకరణను ఉపసంహరించుకోవడం 2018 నాటికి బలపడింది.

2016లో నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ పాలసీ రూపొందింది. గుర్తించిన క్షేత్రాలలో ప్రైవేట్ సంస్థలు ఖనిజాలను అన్వేషించటానికి అనుమతులుంటాయి. ఒకవేళ అన్వేషణ విఫలమైతే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. అన్వేషణలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించటానికి పర్యావరణ, అటవీ చట్టాల అనుమతులతోనే వేలం నిర్వహించాలని, అందుకోసం నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ పాలసీ, 2019 రూపొందింది.

2020లో ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ ప్రకటనతో, కోల్ ఇండియా లిమిటెడ్ ప్రభుత్వ గుత్తాధిపత్యం అంతమైంది. ది మినరల్ లాస్ (అమెండ్ మెంట్) యాక్ట్, 2020 తో ప్రైవేట్ సంస్థలు, మార్కెట్లో బొగ్గులు విక్రయించుకోవచ్చు. బొగ్గు అంతిమ వినియోగం మీద వున్న నిబంధనలను తొలగించారు. విదేశీ పెట్టుబడులు ఏ నిబంధనలు లేకుండా సులభంగా మన గనుల రంగంలోకి ప్రవేశించడానికి వీలును కల్పించారు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించటానికి, గనుల రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు కల్పించటానికి ప్రభుత్వమే 50,000 కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంది. బొగ్గు, లిగ్నైట్, ఇనుము, ఉక్కు, సిమెంట్ మొదలైన ఖనిజాలలో ఆటోమేటిక్ రూట్ ద్వారా 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతులనిచ్చారు.

ది మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్ మెంట్ అండ్ రెగ్యులేషన్) అమెండ్‌మెంట్, యాక్ట్ 2023, ఆగస్టు 2023 నుండి అమలైంది. ప్రభుత్వానికే పూర్తిగా రిజర్వు చేయబడిన ఆటోమిక్ (Atomic) ఖనిజాలలో ఈ చట్టం వల్ల ప్రైవేటు రంగం ప్రవేశిస్తుంది. బంగారం, వెండి, రాగి, జింక్, లెడ్, నిఖిల్, కోబాల్ట్, ప్లాటినం గ్రూపుకి చెందిన ఖనిజాలను, వజ్రాలను గుత్త పెట్టుబడులు తవ్వుకోవటానికి అనేక భాగాలతో సమ్మిళితమైన లైసెన్సులనిస్తారు. దీనితో గనుల, ఖనిజాల జాతీయాకరణ అంతమైంది. ప్రైవేటీకరణ ప్రక్రియ పూర్తయింది.

సమాంతరంగా ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్‌ను బలహీనం చేయటానికి, వాజ్‌పాయ్ నేతృత్వంలో వున్న ప్రభుత్వ కాలం నుండే సీరియస్‌గా ప్రయత్నాలు మొదలైనాయి. 2015–16 సంస్కరణలతో 120–140 మిలియన్ టన్నుల బొగ్గును తవ్వటానికి సిద్ధంగా వున్న, ఈ సంస్థకు చెందిన 80 బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేట్ రంగానికి అప్పజెప్పారు. అయినప్పటికీ CIL ఉత్పత్తి పెరిగింది. ఇది

అసమర్థతనే సూచిస్తుంది కదా! ప్రభుత్వరంగ సంస్థలకు స్వంత వినియోగం కోసం బొగ్గు గనులు ఉండకూడదు. ఉదాహరణకు: వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు స్వంత బొగ్గు గని లేదు. CIL మరియు SCCL వద్ద మిగులు వున్నట్లయితే, వాటిని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఆగస్టు, 2021 నాటికి విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థల బకాయిలు 21 లక్షల కోట్ల రూపాయలు. ప్రభుత్వరంగ సంస్థ ప్రభుత్వానికి సెస్ చెల్లించాలి. కానీ ప్రైవేట్ సంస్థలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తారు. CIL బొగ్గు ధరను పెంచకూడదు. మార్కెట్లో బొగ్గు ధరను నిర్ణయించే స్వేచ్ఛ ప్రైవేట్ సంస్థలకు వుంటుంది. ఇంకా, కృత్రిమ బొగ్గు కొరతను సృష్టించి, ప్రైవేటు సంస్థలు బొగ్గు ధరను పెంచుతాయి. 2016 లో బ్లూం బర్గ్ నివేదిక ప్రకారం CIL వద్ద 50,000 కోట్ల రూ.లు మిగులు వున్నది. దీనితో, ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి ఉత్పాదక శక్తిని పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతించలేదు. తెలంగాణ రాష్ట్రంలో వున్న SCCL కు చెందిన రెండు కీలక బొగ్గు క్షేత్రాలను గత ప్రభుత్వ కాలంలో అరబిందో, అవంతిక ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. భద్రత గల ఉద్యోగాలతో వెలిగిపోయిన ఈ సంస్థలలో ఇప్పుడు ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ఏ రక్షణా లేదు, ఏ భద్రతా లేదు. గనులు, ఖనిజాల ప్రైవేటీకరణ, మిగిలిన రంగాలలో వలెనే అసంఖ్యాకంగా నిరుద్యోగ రిజర్వ్ ఆర్మీని పెంచుతుంది.

## ప్రైవేటీకరణ వల్ల బొగ్గు ఉత్పత్తి పెరిగి, దిగుమతులు తగ్గాయా?

ప్రైవేటీకరణ వల్ల బొగ్గు ఉత్పత్తి పెరగలేదు. దిగుమతులు తగ్గలేదు. 1998-99 నుండి 2020-21 మధ్యకాలంలో బొగ్గు ఉత్పత్తి 319 మిలియన్ టన్నుల నుండి 753 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇందులో ప్రైవేట్ రంగం ఉత్పత్తి 1.81 మిలియన్ టన్నుల నుండి 66 మిలియన్ టన్నులకు పెరిగింది. అంటే ప్రైవేట్ రంగం వాటా 0.5 శాతం నుండి 8.8 శాతానికి పెరిగింది. ఇక, 1998-99 లో బొగ్గు దిగుమతులు 16.35 మిలియన్ టన్నులు. 2019-20 లో 245 మిలియన్ టన్నులకు పెరిగింది. 1998- 2021 మధ్యకాలంలో దిగుమతుల వార్షిక సగటు పెరుగుదల 13 శాతం.

2020-21 లో CIL, SCCL బొగ్గు ఉత్పత్తి 6,47,017 మిలియన్ టన్నులు. ఈ సంవత్సరంలో ప్రైవేట్ రంగం కేవలం 24,280 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. CIL చెల్లించిన పన్ను 44,07,587 కోట్ల రూపాయలు. 2014-15 నుండి 2018-19 వరకు 27,46,771 కోట్ల రూ.ల పన్నును SCCL చెల్లించింది. లాభం కోసమే పనిచేసే ప్రైవేట్ సంస్థలు దేశం కోసం, ప్రజల కోసం ఉత్పత్తి చేయవు.

2023లో MMDR సవరణ చట్టం వచ్చిన తర్వాత 385 ఖనిజ క్షేత్రాలను ప్రైవేటు రంగానికి అప్పజెప్పారు. ఇందులో 50 గనులలో మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నది.

**ముగింపు:**

దేశ సమస్త సంపదలో భాగంగా ఎంతో విలువైన, ముఖ్యమైన గనులు, ఖనిజాలను ప్రైవేటీకరణ పేరుతో పాలకులు గుత్త పెట్టుబడులకు అప్పచెబుతున్నారు. దీనివల్ల మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం తీవ్రమవుతుంది. పర్యావరణం విధ్వంసమవుతుంది. డొల్లగా, గోతులతో భూమి మిగులుతుంది. నిరుద్యోగ రిజర్వు ఆర్మీ సంక్షోభం ఇంకా సంక్లిష్టమవుతుంది. ఈ ధోరణిని నిరసించాలి, నిర్మూలించాలి. దోపిడీ లేని సోషలిస్టు సమాజ స్థాపన ద్వారానే శ్రామిక వర్గానికి, పర్యావరణానికి భద్రత లభిస్తుంది. ఆ దిశగా బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాల్సిందే.

# 6

# బడా కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ఉచితాలను రద్దు చేయాలి

ఉచితాల రూపం తీసుకొని ప్రచారమవుతున్న సామాజిక సంక్షేమ పథకాలు అనవసరమైనవని, ప్రజలు సోమరులవుతున్నారని, వాటివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టమన్న వాదనలతో విమర్శించటం గత దశాబ్ది నుండి తీవ్రమైంది. గత పదేళ్ళుగా పెట్టుబడిదారీ విధానానికి నాజూకు రూపమిచ్చి బలంగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాలతో ఈ విమర్శ ముడిపడి వున్నది. జులై 2022 లో ఉత్తరప్రదేశ్ లోని బుందేల్ ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ ప్రధానమంత్రి మోడీ తాను ఉచితాల సంస్కృతికి వ్యతిరేకమని, అవి దేశానికి ప్రమాదకరమని స్వయంగా ప్రకటించారు. దానితో ఉచితాల మీద విమర్శ మరింత బలపడింది. 2022 లో వున్న కేంద్ర ప్రాయోజిత పథకాల సంఖ్య 65. కేవలం రెండేళ్లలో, 2024 నాటికి మోడీ ప్రభుత్వ కాలంలోనే ఈ పథకాలు 75 కు పెరిగాయి. అసలు ఈ పథకాలలో 26 కు పైగా మోడీ ప్రభుత్వమే ప్రారంభించింది. ఇంకా 740 కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు నామమాత్రంగానైనా కొనసాగుతూనే వున్నది. ప్రధాన మంత్రి ప్రకటనకు, ఆచరణకు మధ్య తీవ్రమైన వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తూ వున్నది. ఎందుకంటే ఈ రెండు సంవత్సరాలలో నయా ఉదారవాద విధాన దోపిడీ వ్యవస్థ బలపడుతున్న క్రమంలో మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం అదనంగా తీవ్రమైంది. ఇందువల్ల పీడనకు గురవుతున్న అసంఖ్యాక ప్రజానీకం సంఘటితమవుతారని, అది ఉద్యమాలకు దారితీస్తుందన్న ఎరుక ఏ పాలకవర్గానికైనా తప్పకుండా వుంటుంది. ప్రజల దుర్భర జీవితాలను ఎంతోకొంత బాగు చేస్తామన్న

భ్రమను కల్పించే క్రమంలో భాగంగానే సామాజిక సంక్షేమ పథకాలు/ ఉచితాల ప్రకటనలు వుంటాయి.

ఉచితాల సంస్కృతికి తాము వ్యతిరేకమని ప్రధానమంత్రి మోడీ ప్రకటించిన తర్వాతే పాలక పార్టీకి చెందిన లాయర్ అశ్వినీ ఉపాధ్యాయ, ఉచితాలు రాజ్యాంగ విరుద్ధమని, స్వచ్ఛమైన ఎన్నికలకు అవరోధమని, అందువల్ల ఉచితాలను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిల్‌ను దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ డి.వై చంద్ర చూడ్, జస్టిస్ జె.బి పార్థీ వాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో ఏర్పడిన బెంచ్ ఈ విధంగా దాఖలైన పిల్స్ అన్నింటిని సుప్రీంకోర్టు పరిశీలిస్తుందని సెప్టెంబర్ 18, 2024 న తెలిపారు. మన దేశ ఉన్నత న్యాయస్థానం ఈ అంశాన్ని సీరియస్ గా పరిగణిస్తున్నది. అదేవిధంగా, ప్రకటిస్తున్న ఉచితాల కోసం నిధులను ఏ విధంగా సమీకరిస్తారో రాజకీయ పార్టీలు చెప్పాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విత్త సమస్యలను, ప్రధానంగా నాన్ మెరిట్ వస్తువులను ఉచితాలుగా ఇవ్వటం కారణమవు తున్నదని మన రిజర్వు బ్యాంకు చెబుతున్నది.

నిజానికి, న్యాయమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరుగుతున్నాయా? మద్యం, డబ్బులు ఏరులై పారుతుందన్న వాస్తవం అందరికీ తెలిసిందే. ప్రపంచంలో మనవి అతి ఖరీదైన ఎన్నికలు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అంచనాల ప్రకారం 2019 జాతీయ ఎన్నికలలో 73,278 కోట్ల రూ.లు ఖర్చయింది. 2024 ఎన్నికలలో ఈ వ్యయం లక్ష కోట్ల రూపాయలకు పెరిగింది. ఈ క్రమంలో బయటపడిన ఎలక్టోరల్ బాండ్స్ స్కాం గురించి మొత్తం ప్రపంచానికి తెలుసు.

ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడానికి సంక్షేమ పథకాల ప్రకటనలు, అమలును వ్యతిరేకించే ప్రస్తుత పాలక పార్టీ 2024 ఎన్నికలకు ముందు ఏం చేసింది? ఉదాహరణకు, వంట చేసుకోవటానికి సాంప్రదాయక ఇంధనాలన్నీ అంతరించాయి. వంట గ్యాస్ సిలిండర్ తప్పనిసరైంది. అయినప్పటికీ వంట గ్యాస్ సిలిండర్ ధరను 2020 నుండి 7 సార్లు ప్రభుత్వం పెంచింది. పైగా దారిద్ర్య రేఖకు దిగువన (BPL) వుండే కుటుంబాలకు ఉజ్వల పథకం ద్వారా ఇచ్చే గ్యాస్ సిలిండర్ల మీద సబ్సిడీని 2021లో రద్దు చేసింది. 2024లో రానున్న జాతీయ ఎన్నికలు, 5 రాష్ట్రాలలో ఎన్నికల దృష్ట్యా ఆగస్టు 2023 లో వంట గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వం 200 రూ.లు తగ్గించింది. ఉజ్వల గ్యాస్ సిలిండర్లకు 200 రూ.ల సబ్సిడీని 2022లో తిరిగి ప్రారంభించారు. 2023 లో ఈ సబ్సిడీని 200 రూ.ల నుండి 300 రూ.లకు పెంచారు. సబ్సిడీని మరొక సంవత్సరం పాటు పొడిగించారు.

అదేవిధంగా, ముడిచమురు ధరలు పెరుగుతున్నప్పటికీ 2024లో ఆనాడు

రానున్న ఎన్నికల దృష్ట్యా పెట్రోల్, డీజిల్ ధరలను ఏప్రిల్, 2022 నుండి పెంచలేదు. ఇవి ప్రజలను భ్రమలలో ముంచే, ఆకర్షించే తాత్కాలిక ఉపశమన జిమ్మిక్కులే.

మిక్సర్ గ్రైండర్, లాప్‌టాప్, బంగారం, టీ.వీలు మొదలైన నాన్ మెరిట్ వస్తువులను ఉచితాలుగా ఇవ్వటాన్ని రిజర్వ్ బ్యాంకుతో పాటు చాలామంది విమర్శిస్తున్నారు. నిజానికి ఈ వస్తువులు రాజకీయ నాయకుల సన్నిహితులకు, కార్యకర్తలకు, అందుతాయి. కార్యకర్తల కేడర్‌ను పెంచుకోవడానికి, కాంట్రాక్టర్లను గుప్పిట్లో పెట్టుకోవటానికి ఉపయోగపడతాయి. తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల, జాతుల కుటుంబాలలో ఆడపిల్ల పెళ్లి సమయంలో ఒక లక్ష రూపాయలు ఇచ్చే కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ పథకాలు వున్నాయన్న విషయమే చాలామంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తెలియదన్న నిజాన్ని TISS అధ్యయనం బయటపెట్టింది.

## ప్రోత్సాహకాల పేరుతో లక్షల కోట్ల రూపాయల ఉచితాలు - కార్పొరేట్ శక్తులు:

ప్రపంచీకరణ ప్రవేశించిన 1990-91 నుండి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి అనేక పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు, ఎంతో విలువైన భూములను అతిచౌకగా ఇవ్వటం, కేటాయించడం, అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ఎంతో చౌకగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించటం మొదలైంది. 2000 దశాబ్ద ప్రారంభం నుండే ప్రైవేటు/ కార్పొరేట్ శక్తుల మొండి బకాయిలను ప్రభుత్వ రంగ బ్యాంకులు రైట్ ఆఫ్ చేయటం మొదలైంది. ఇది నిజానికి రుణ మాఫీనే. రైట్ ఆఫ్ చేసిన మొండి బకాయిలను రికవరీ చేసిన దాఖలాలు లేవు.

2004-19 మధ్యకాలంలో 8.4 లక్షల కోట్ల రూ.ల మేరకు బడా కార్పొరేట్ శక్తుల బాకీలను బ్యాంకులు మాఫీ చేశాయి. ఇందులో 2014-19 మధ్య మాఫీ చేసిన మొత్తం 75 శాతం అంటే 5 లక్షల కోట్ల రూ.లు. కేవలం కోవిడ్ విపత్తు సమయంలో కార్పొరేట్ దిగ్గజాల రుణమాఫీ 68,000 కోట్ల రూ.లు. 2014 నుండి సమర్థవంతమైనవని చెబుతున్న కార్పొరేట్ శక్తుల మొండి బాకీలు వేగంగా పెరుగుతున్నాయి. అసలు బడా కార్పొరేట్ల రుణాల మాఫీ దానంతటదే పెద్ద స్కాం. రిజర్వు బ్యాంకు సమాచారం ప్రకారం, 2017-2022 మధ్యకాలంలో బడా కార్పొరేట్ల రుణమాఫీ 10 లక్షల కోట్ల రూ.లు. ఇందులో 7.34 లక్షల కోట్ల రూ.లు ప్రభుత్వ రంగ బ్యాంకులు చేసిన రుణమాఫీలే. ఇవన్నీ బడా కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న ఉచితాలే. 10 సం.ల మోడీ పాలనలో 16 లక్షల కోట్ల రూపాయల మేరకు బడా కార్పొరేట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేశారు.

దీనికి తోడు, ఈ సంస్థలకు భారీ స్థాయిలో పన్ను రాయితీలు ఇస్తున్నారు. వీటి వల్ల 2017–18 లో 93,642 కోట్ల రూ.ల పన్ను రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. 2018–19 లో 1,08,785 కోట్ల రూ.ల పన్ను రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. 2018–19 లోనే సెజ్ లలో వున్న సంస్థలకు లాభం పన్నును మినహాయించడం వల్ల 24,300 కోట్ల రూ.ల రాబడిని ప్రభుత్వం కోల్పోయింది. 2014–19 మధ్యకాలంలో కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన పన్ను రాయితీల వల్ల 5.76 లక్షల కోట్ల రూ.లను ప్రభుత్వం కోల్పోయింది.

2019 లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుండి 22 శాతానికి, కొత్త సంస్థలకు 25 శాతం నుండి 15 శాతానికి తగ్గించారు. ఇది ప్రపంచంలోనే కనిష్ట కార్పొరేట్ పన్ను. దీనివల్ల సంవత్సరానికి 1.45 లక్షల కోట్ల రూ.ల రాబడిని ప్రభుత్వం కోల్పోతుంది. కానీ, ప్రభుత్వ బడ్జెట్ లో కోశ లోటు తగ్గుతూ వున్నది. అంటే కోల్పోయిన పన్ను రాబడిని సామాన్య జనం వినియోగించే వస్తువుల మీద ఎక్కువ జిఎస్టి వేస్తూ వసూలు చేసుకుంటున్నారు. దీంతో, సంపన్నులకు ఉచితాలు, సామాన్య ప్రజలకు, మధ్యతరగతి వర్గాలకు అధిక పన్నులు. రాయితీలు, రుణమాఫీలకు అదనంగా, ఏ ఇబ్బంది రుణాలను ఎగ్గొట్టడానికి వీలైన దివాళాను సులభం చేశారు.

ఉద్యోగ కల్పన పేరిట 10 వేల కోట్ల రూ.ల పన్ను రాయితీలను పొందుతున్న ఆదానీ కంపెనీలలో కేవలం 8 వేల మంది పనిచేస్తున్నారు. అంటే, ఒక ఉద్యోగానికి, సంవత్సరానికి 1.25 కోట్ల రూ.ల పన్ను రాయితీ.

ఎంతో విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి ఆస్తులను అతి చౌకగా ప్రైవేటు కార్పొరేట్లకు అప్పజెప్పటం, దేశ సంపదను ఉచితంగా గుత్త పెట్టుబడులకు అప్పజెప్పటమే. ఉదాహరణకు, జనవరి, 2022 లో కేవలం 18 వేల కోట్ల రూ.లకు ఎయిర్ ఇండియా సంస్థను టాటా గ్రూపుకు అప్పగించారు. ఎయిర్ ఇండియాతో పాటు చౌక ధరలతో విమానాలను నడిపి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, AISATS లో వున్న 50 శాతం ప్రభుత్వ వాటా ఇక టాటా గ్రూపు స్వంతమే. ఎక్కడా ఆగకుండా యూరప్, అమెరికాకు ప్రయాణించగల ఎయిర్ ఇండియా సామర్థ్యం టాటా గ్రూపుకే. 100 దేశీయ గమ్యాలకు ప్రయాణించే 94 ఎయిర్ క్రాఫ్టులు, విదేశీ గమ్యాలకు ప్రయాణించే 60 ఎయిర్ క్రాఫ్టులు, 4,400 దేశీయ – ల్యాండింగ్ పార్కింగ్ ప్లాట్లు, విదేశాల్లోని ఎయిర్ పోర్టులలో 900 ప్లాట్లు, సమర్థవంతమైన శిక్షణతో లైసెన్సులు వున్న 200 మంది పైలట్లు, ఇక టాటా గ్రూపు ఆస్తి అవుతుంది. ఇట్లా సమస్త దేశ సంపదను ప్రైవేటు గుత్త పెట్టుబడులకు ఉచితంగా అప్పగించడాన్ని ఉన్నత న్యాయస్థానం, రిజర్వు బ్యాంకు మొదలైన సంస్థలు ఏవీ ప్రశ్నించవు. రద్దు చేయాలని చెప్పవు. కానీ

వక్రీకరించిన ఆర్థిక నిర్మాణాల పునాదుల వల్ల బతుకుతెరువు దొరకక అనియత రంగంలో, గిగ్ వ్యవస్థలో అత్యధిక శ్రమ దోపిడీకి గురవుతూ, దుర్భరమైన పేదరికంతో, ఆకలి సమస్యతో, తాగటానికి మంచినీళ్లు కూడా దొరకని స్థితిలో బతుకుతున్న మెజారిటీ ప్రజల పేరిట ప్రకటిస్తున్న ఉచితాలను మాత్రం రద్దు చేయాలి, రాజ్యాంగ విరుద్ధం అంటారు. లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను, దేశ సంపదను ఉచితంగా బడా కార్పొరేట్ శక్తులకు ఇవ్వటం మాత్రం రాజ్యాంగబద్ధం అవుతుందా? చాలా సందర్భాలలో సంక్షేమ పథకాలు, ప్రకటనలకే పరిమితమవుతాయి. మెజారిటీ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందవు. కాగ్ నివేదికలు ఈ అంశాన్ని వెల్లడి చేశాయి. మన దేశంలో ఒక పథకాన్ని కేస్ స్టడీగా తీసుకొని అసలు అర్హులైన వారెందరు? ఎంతమందికి ఈ పథకం అందింది? అనే అంశాన్ని సీరియస్‌గా అధ్యయనం చేసి, అత్యధికంగా 73 శాతం మంది బహిష్కృతం అయినారని తేల్చారు. పాలక పార్టీ నాయకుల సన్నిహితులు, కార్యకర్తలు, ప్రధానంగా లబ్ధిదారులుగా వుంటారని ఎన్నోసార్లు రుజువైంది. అయినప్పటికీ బడా నాయకుల మీటింగులకు భారీఎత్తున తరలించిన జనంతో, తమను విమర్శిస్తే, ప్రశ్నిస్తే సంక్షేమ పథకాలు ఇవ్వం అని బెదిరించడం మనం వార్తా పత్రికలలో చూస్తూనే వుంటాం. ఇందుకు విరుద్ధంగా బడా కార్పొరేట్లకు ప్రోత్సాహకాలు అంటూ లక్షల కోట్ల రూపాయలను ఉచితంగా మాఫీ చేస్తారు. ప్రైవేటు రంగమే సమర్థవంతమైందని బలంగా చెబుతున్న ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల ఉచితాలను ఇవ్వాల్సిన స్థితి, వాటి అసమర్థతను సూచిస్తాయి

## సంక్షేమ పథకాలు:

1947 తర్వాత భారతదేశంలో సోషలిస్టు తరహా సమాజ స్థాపన లక్ష్య ప్రకటనతో 1951 లోనే పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైనాయి. స్థూల జాతీయోత్పత్తి పెరిగితే దానంతటదే పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన జరుగుతుందని, ప్రజలందరి జీవన ప్రమాణాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయని ట్రికిల్ డౌన్ సిద్ధాంతం మీద నమ్మకం ఉండడం వల్ల ఆశించారు అనుకుందాం. కానీ నాలుగవ పంచవర్ష ప్రణాళిక పూర్తికాకముందే 1970ల నాటికే నిరుద్యోగం, పేదరికం పెరుగుతున్నాయని, వ్యవసాయ రంగం మీద ఆధారపడి బ్రతికే వారి సంఖ్య పెరుగుతున్నదని, గ్రామీణ పేదరికం ఇంకా తీవ్రమవుతున్నదని, అసమానతలు, గుత్తాధిపత్యం, ఆర్థిక శక్తి కేంద్రీకరణ, విదేశీ మారక చెల్లింపుల శేషంలో లోటు పెరుగుతున్నాయని ఆనాటి ఆర్బిఐ బులెటిన్ సమాచారం. రీసెర్చ్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ టైమ్స్ సమాచారం, రంజిత్ దాస్ గుప్తా, తరిమెల నాగిరెడ్డి, దండేకర్ రాత్ అధ్యయనాలు స్పష్టంగా చెప్పాయి. సమ్మిళిత వృద్ధికి వ్యతిరేకంగా ఆర్థిక నిర్మాణాల పునాదులు బలపడ్డాయి. అందువల్లనే ఈ సంక్షోభ

తీవ్రతను తాత్కాలికంగా తగ్గించడానికి  అభివృద్ధి క్రమం వెలుపల సంక్షేమ పథకాలు మొదలైనాయి. కానీ మెజారిటీ ప్రజలను సామాజిక ఆర్థిక అభివృద్ధి క్రమం నుండి బయటకు నెట్టి వేసే పద్ధతి తీవ్రమైంది. తాత్కాలిక ఉపశమన చర్యలుగా మొదలైన సంక్షేమ పథకాలు శాశ్వతమైనాయి. పాలక పార్టీలు, ప్రభుత్వాలు మారినప్పుడు సంక్షేమ పథకాల పేర్లు మారాయి. కొన్ని సంక్షేమ పథకాలను మిళితం చేసి కొత్త పథకంగా చేశారు.

ప్రపంచీకరణ క్రమం ప్రవేశించిన తర్వాత మొట్టమొదట విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరించారు. ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వమే స్వయంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ప్రజారోగ్య వ్యవస్థను బలహీనం చేసి, నాశనం చేయటానికి ఎంతో 'చిత్తశుద్ధి'తో చర్యలు తీసుకున్నారు. కార్పొరేటీకరణతో విద్య, వైద్య సేవలకు మెజారిటీ ప్రజలు దూరమైనారు. సార్వత్రిక ప్రాథమిక విద్య కోసం "సర్వ శిక్షా అభియాన్' పథకం 2018లో సమగ్ర శిక్ష పథకమయింది. ప్రపంచీకరణకు పూర్వం ఆకలి సమస్యకు పరిష్కారంగా మొదలైన ప్రజా పంపిణీ వ్యవస్థ క్రమంగా నగదు బదిలీ కార్యక్రమం అయింది. ప్రస్తుతం ఈ పథకం పేరు PM- POSHAN. 1970ల లోనే ఉపాధి కల్పన కోసం మొదలైన పనికి ఆహార పథకం 2006లో ఉపాధి కల్పన (MGNREGA) గా మారింది. ప్రజారోగ్య వ్యవస్థ క్రమంగా అంతరిస్తున్నది. కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యానికి బీమా పథకాలు వచ్చాయి. ఆకలి, పౌష్టికాహార లోపం సమస్యలకు మార్చి 2020 లో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం వచ్చింది. వలస కార్మికుల కోసం "వన్ నేషన్ – వన్ రేషన్ కార్డు" అన్నారు. రైతుల సంక్షేమం కోసం బీమా పథకాలు, నగదు బదిలీ పథకం వచ్చాయి. సంప్రదాయక వంట ఇంధనాలు అంతరించాయి. వంట కోసం ఎల్పీజీ గ్యాస్ తప్పనిసరి. వాటికి సబ్సిడీలు వచ్చాయి. ప్రజా రవాణా వ్యవస్థ అంతరించడంతో ప్రైవేటు వాహనాలు తప్పనిసరైనాయి. పెట్రోల్, డీజిల్ సబ్సిడీలు వచ్చాయి. ఈ పథకాలన్నీ క్రమంగా దారిద్ర్యరేఖకు దిగవనున్న కుటుంబాలకే పరిమితమైనాయి. నగదు బదిలీ అన్నారు. అది కూడా అందదు. పథకాల వల్ల లబ్ధి పొందవలసిన వాళ్లలో 70 శాతం మినహాయించ బడుతున్నారు. ఈ పథకాల అమలు ప్రారంభం నుండి వైఫల్యమే. ఈ పథకాలతో సమ్మిళిత వృద్ధి రాదు. అభివృద్ధి క్రమం వెలుపల మెజారిటీ ప్రజలు దుర్భరంగా బతుకుతున్నారు.

మల్టీ డైమెన్షనల్ పావర్టీని అంచనా వేసిన నీతి ఆయోగ్, దారిద్ర్య రేఖకు దిగువన 20 శాతం కుటుంబాలున్నాయని అంటుంది. 2013 లో రూపొందిన ఆహార భద్రత చట్టం పరిధిలోకి 67 శాతం ప్రజలు వస్తారని ప్రభుత్వమే చెబుతుంది. కోవిడ్ విపత్తు తర్వాత 81 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామని ప్రభుత్వమే

చెబుతున్నది. అంటే దాదాపు 60 శాతం పేద ప్రజలు వున్నారు. ఉపాధి హామీ పథకానికి 2017 నుండి కేటాయింపులు తగ్గుతున్నాయి. సంవత్సరానికి 100 రోజులకు బదులుగా 40-50 రోజుల పనిని ఇస్తున్నారు. చెల్లింపులలో జాప్యం వుంటుంది. గ్రామాల్లో బతకలేక పట్టణాలకు వచ్చి గిగ్ వ్యవస్థలో యువత పనిచేస్తున్నది.

ఏప్రిల్ 2008 నుండి బిపిఎల్ కుటుంబాలకు బీమా ద్వారా కార్పొరేట్ వైద్యం కోసం, 'రాష్ట్రీయ స్వాస్థ్య యోజన' పథకం మొదలైంది. వీటిలో 31 శాతం హాస్పిటల్ బిల్లులే సెటిల్ అవుతున్నాయి. చాలా ఆసుపత్రులు ప్రభుత్వ ఆరోగ్య భీమాను ఆమోదించమని ఖరాఖండిగా చెబుతున్నాయి. 'భేటీ బచావో – బేటీ పడావో" పథకం అంటారు. ప్రభుత్వ బడులను మూసేస్తున్నారు. తల్లీ పిల్లల పౌష్టికాహారం కోసం పనిచేసే అంగన్వాడీ టీచర్లు తాత్కాలిక ఉద్యోగులే. కనీస వేతనం ఉండదు. చెల్లింపులలో జాప్యం. ఈ పథకాల వల్ల ఆశించిన కొద్దిపాటి మేలు కూడా అసాధ్యమే.

వంట గ్యాస్ సిలిండర్ సబ్సిడీని కేవలం బిపిఎల్ కుటుంబాలకే అందించాలని ఉజ్వల పథకాన్ని 2016 లో మొదలుపెట్టారు. పేద కుటుంబాలు మొదట పూర్తి డబ్బు చెల్లించి, వంట గ్యాస్ సిలిండరును కొనుక్కోవాలి. దాదాపు 1000 రూ.లు. వంట చేయటానికి ఖర్చు పెట్టే స్థోమత పేద కుటుంబాలకు ఉంటుందా? నెమ్మదిగా సబ్సిడీ డబ్బులు అకౌంట్లకు బదిలీ వేస్తామంటారు. చాలామందికి సబ్సిడీ రాలేదు. పూర్తిగా రాదు. అసలే రాదు. మరొకవైపు రోజురోజుకూ వంట గ్యాస్ సిలిండర్ ధర పెరుగుతూనే వున్నది. ఉజ్వల పథకం లబ్ధిదారులు 2023లో 96 మిలియన్లు ఉండగా, 2024 లో 102 మిలియన్లకు పెరిగారని ప్రభుత్వం చెబుతున్నది. వంటగ్యాస్ సిలిండర్ ధర పెరిగి, లబ్ధిదారుల సంఖ్య పెరిగినప్పుడు, ఉజ్వల పథకం సబ్సిడీ కేటాయింపులో భారీ తగ్గుదల వైరుధ్యమే. 2018-19 లో 37,209 కోట్ల రూపాయలు ఉండగా, 2021-22 లో కేవలం 1,811కోట్ల రూపాయలు. ఇక 2022-23 లో 2,257 కోట్ల రూపాయలు.

ప్రజా రవాణా వ్యవస్థ అంతరించే క్రమంలో ప్రైవేట్ వాహనాలు తప్పనిసరైనాయి. కూలి పనులు చేసుకునే వాళ్లకు, వీధుల్లో తిరిగి అమ్ముకునే వాళ్లకు వాహనాలు తప్పనిసరి. పెట్రోలు, డీజిల్ నిత్యావసర వస్తువులే. 2010లో పెట్రోల్ సబ్సిడీని, 2014లో డీజిల్ సబ్సిడీని తీసేసారు. రెండింటి ధరలను సరళీకరించారు. నవంబర్ 2014 నుండి జనవరి 2016 మధ్య వీటి మీద ఎక్సైజ్ సుంకాన్ని 9 సార్లు పెంచారు. గ్లోబల్ ధరలు తగ్గినా వీటి ధరలను తగ్గించలేదు. అధిక పన్నులు వేశారు. 2014-15లో వీటి మీద పన్ను వసూళ్లు 99,184 కోట్ల రూపాయలు కాగా, 2016-17లో 2,42,691 కోట్ల రూపాయలు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు వేస్తాయి.

పేద మధ్యతరగతి వర్గాల చేతుల్లోకి వ్యక్తిగత వాహనాలు వచ్చిన ఈ మూడు నాలుగు దశాబ్దాలలోనే పెట్రోలు డీజిల్ పై సబ్సిడీలు తగ్గి పన్నులు పెరుగుతూ పోతున్నాయి. పెట్టుబడిదారీ దోపిడీ విధానం ప్రజలను కేవలం వినియోగదారులుగా మాత్రమే చూస్తుందనడానికి ఈ ఉదాహరణ చాలదా?

ఈ విధంగా కార్పొరేట్ సంస్థలకు ఉచితాలను ఇస్తారు. పేద, మధ్యతరగతి వర్గం మీద పన్నులు వేస్తారు. అమృత కాల్ మొత్తం ఈ వర్గం వాళ్లు "సబ్ కా ప్రయాస్" లో భాగం కావాల్సిందే.

గుత్త పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి నయా ఉదారవాద విధానాల పేరుతో కార్పొరేట్ శక్తులకు అందిస్తున్న లక్షల కోట్ల ఉచితాలను రద్దు చేయాలి. ప్రజలందరినీ భాగం చేసుకోగల సమ్మిళిత వృద్ధి నిర్మాణాలను నిర్మించాలి. అభివృద్ధి క్రమం నుండి బయటకు నెట్టివేయబడి అత్యధిక శ్రమదోపిడీతో దుర్భరంగా బ్రతుకుతున్న అసంఖ్యాక ప్రజానీకం బలంగా, విప్లవ శక్తుల నాయకత్వంలో సంఘటితం కావాలి. దోపిడీ, పీడన, అసమానతలు, వివక్షలు లేని వ్యవస్థల కోసం పోరాడాలి.

⬩◆⬩

# 7

# బలంగా అమలవుతున్న పాలకుల సామ్రాజ్యవాద, కార్పొరేట్ అనుకూల విధానాలు - తీవ్రమవుతున్న మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం

గత పది సంవత్సరాల నుండి మెజారిటీ ప్రజల జీవన సంక్షోభం సంక్లిష్టమవుతున్నది. నిరుద్యోగిత, పేదరికం, ఆకలి సమస్య తీవ్రతతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పైగా పేదలు, మధ్యతరగతి వర్గం వినియోగించే వస్తువుల మీద ప్రభుత్వం అధిక వస్తు సేవల పన్నులను విధించడం మనందరి అనుభవమే. విద్య, వైద్య రంగాలలో కార్పొరేటీకరణ బలపడింది. అందువల్ల విద్య, వైద్య సేవలు మెజారిటీ ప్రజలకు అందడం అసాధ్యమైంది. "సంక్షుభిత రహిత జీవితాలు" ఎప్పుడు సాధ్యమో ప్రశ్నార్థకమే. నయా ఉదారవాద విధానాలను బలంగా అమలు పరచడమే ఇందుకు కారణమని "ప్రపంచ అసమానతల నివేదిక", 2022, ఆక్స్‌ఫామ్ ప్రచురించిన "చంపే అసమానతలు", 2021 స్పష్టంగా చెబుతున్నాయి. అసలు ఈ నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టి, అమలు కోసం బలంగా ఒత్తిడి తెచ్చిన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా తమ తప్పిదాన్ని ఆమోదించినట్లు చెప్పక తప్పలేదు.

ఆశ్చర్యకరంగా, మన ప్రభుత్వం మాత్రం ఈ విధానాలను బలంగా అమలు చేయడం కొనసాగిస్తూనే వున్నది. అందువల్లనే మన దేశం శీఘ్రంగా, వేగంగా అభివృద్ధి

చెందుతున్నదని, ప్రపంచంలో 10వ స్థానం నుండి 5 వ స్థానానికి ఎగబాకిందని ప్రచారం చేస్తున్నది. ఇదే సమ్మిళిత వృద్ధి అని బుకాయిస్తున్నది. పెరుగుతున్న అసమానతలు, 5వ, 6వ స్థానాలకు ఎగబ్రాకడం నిజంగా సీరియస్ వైరుధ్యమే.

2014 లో ప్రణాళిక సంఘాన్ని రద్దు చేయడంతో ప్రజల అభివృద్ధిని, శ్రేయస్సును పూర్తిగా విస్మరించటం, మెజారిటీ ప్రజలను "సబ్ కా ప్రయాస్" లో భాగం చేయటం తీవ్రమైంది. స్వాతంత్ర్యానంతర ప్రణాళికాభివృద్ధి క్రమంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను, చిన్న పరిశ్రమలను సమ్మిళిత వృద్ధికి ప్రాతిపదికలుగా గుర్తించారు. వీటిని ప్రోత్సహించడం కోసం కొన్ని ఉత్పత్తులను రిజర్వు చేశారు. విస్తారంగా దేశమంతటా ఎక్కడికక్కడ అధికారిక నెట్వర్క్ను ఏర్పాటు చేశారు. ఆర్థిక శక్తి కేంద్రీకరణను, గుత్తస్వామ్యాన్ని నియంత్రించడానికి అంటూ లైసెన్సింగ్ వ్యవస్థ రూపొందింది. దేశాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం అంటూ కీలకమైన రంగాలలో భారీ స్థాయిలో ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించారు. ఆర్థిక సంస్కరణలను బలోపేతం చేసే క్రమంలో ఇవన్నీ రద్దయినాయి. సోషలిస్టు తరహా సమాజ స్థాపన అన్న రాజ్యాంగపు ప్రకటిత ఆదర్శాలకు కూడా కాలంచెల్లినట్లు అయింది.

పబ్లిక్ రంగ పరిశ్రమలలో పెట్టుబడులను ఉపసంహరించటం, ప్రైవేటీకరించటం ముమ్మరమైంది. ఈ ప్రక్రియను ఇంకా వేగవంతం చేయాలని నీతీ ఆయోగ్ ఒత్తిడి తెస్తున్నది. అనేక రూపాలలో విదేశీ పెట్టుబడులు నిరాటంకంగా రావడానికి వీలు కల్పించారు. ఈ క్రమంలో నయా ఉదారవాద విధానాలు, సప్లై గొలుసును ప్రోత్సహించటం పేరిట బలంగా ముందుకొచ్చాయి. అంటే స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడులు లేదా కార్పొరేట్ శక్తుల లాభాలు, ఆధిపత్యం కోసమే ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమలు ఉంటుంది.

## సప్లై గొలుసు ప్రోత్సాహక చర్యలు - పభావాలు, పరిణామాలు:

ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసిన 2014 లోనే దేశ నిర్మాణంలో భాగంగా 'మేక్ ఇన్ ఇండియా' ను ప్రకటించారు. మన తయారీ రంగాన్ని శిఖర స్థాయికి తీసుకుపోవటం, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా మన దేశాన్ని రూపొందించడం, విదేశీ పెట్టుబడులకు అనువైన మజిలీగా రూపొందించడం కోసమే ఈ పథకాన్ని తెస్తున్నామని ప్రకటించారు. "ఎక్కడైనా అమ్ముకోండి– భారతదేశంలో తయారు చేయండి" నినాదంతో ప్రారంభించారు. విదేశీ పెట్టుబడులతో విదేశీ టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని, మన తయారీ రంగం భారీ స్థాయిలో అభివృద్ధి చెందుతుందని నమ్మబలికారు.

1). తయారీ రంగం వార్షిక వృద్ధిరేటు 2022 నాటికి ప్రస్తుత 7 శాతం నుండి 12 –

14 శాతానికి పెంచడం. 2). స్థూల దేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటాను ప్రస్తుత 15 శాతం నుండి 25 శాతానికి పెంచడం. 3). 2022 నాటికి తయారీ రంగంలో 100 మిలియన్ల మందికి అదనంగా ఉద్యోగాలను కల్పించడం లక్ష్యాలుగా ప్రకటించారు.

విదేశీ పెట్టుబడులకు అనుమతులను సరళీకరించారు. కీలకమైన 25 రంగాలలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

రక్షణ రంగంలో కూడా 2020 నాటికి విదేశీ పెట్టుబడుల వాటాను ఆటోమేటిక్ రూట్ ద్వారా 74 శాతానికి, ప్రభుత్వ మార్గం ద్వారా 100 శాతానికి అనుమతుల నిచ్చారు. చాలా డిఫెన్స్ వస్తువులను లైసెన్స్ నుంచి మినహాయించారు. రైల్వేలలో కూడా విదేశీ పెట్టుబడులకు 100 శాతం వాటాకు అనుమతి లభించింది. ఇన్సూరెన్స్ రంగాన్ని కూడా విదేశీ పెట్టుబడుల కోసం తెరిచారు. అందువల్లనే, నవంబర్ 2017 నాటికి విదేశీ ఎలక్ట్రానిక్ కంపెనీల నుండి 1.20 లక్షల కోట్ల రూ.ల విలువగల ప్రతిపాదనలు వచ్చాయి.

2019లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. అక్టోబర్ 1, 2019 తర్వాత తయారీ రంగంలో స్థాపించే కొత్త సంస్థలకు పన్ను 25 శాతం నుండి 15 శాతానికి తగ్గించారు. ప్రపంచంలోనే అతి తక్కువ కార్పొరేట్ పన్ను విధించే దేశం మనదే. అందువల్లనే, వాణిజ్య సౌలభ్య సూచీలో మాత్రం ప్రగతిని సాధించారు.

కార్పొరేటు పన్ను తగ్గింపు వల్ల కోల్పోయిన వార్షిక పన్ను రాబడి 1.45 లక్షల కోట్ల రూ.లు. 2017-18లో కోల్పోయిన పన్ను రాబడి 93,642 కోట్ల రూ.లు. ఇది 2018-19 నాటికి 1,08,785 కోట్ల రూ.లకు పెరిగింది. ఇదే సంవత్సరం సెజ్‌ల లోని సంస్థలకు లాభం పన్నును మినహాయించడం వల్ల కోల్పోయిన రాబడి 24,300 కోట్ల రూ.లు. పన్ను రాయితీల వల్ల 2014-19 మధ్యకాలంలో కోల్పోయిన పన్ను రాబడి 5.76 లక్షల కోట్ల రూ.లు. పన్ను రాబడిలో కార్పొరేట్ పన్ను వాటా 2018-19లో 3.5 శాతం ఉండగా 2020-21లో 2.3 శాతానికి తగ్గింది.

పన్ను రాయితీలతో లాభాలను పెంచుకున్న కార్పొరేట్ సంస్థలు బ్యాంకు రుణాలను చెల్లించలేదు. 2014-19 మధ్య కాలంలో 5 లక్షల కోట్ల రూ.ల ప్రభుత్వ బ్యాంకు రుణాలను మాఫీ చేశారు. కోవిడ్ విపత్తు కాలంలో 68,000 కోట్ల రూ.ల విలువ గల బడా కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేశారు.

2004-19 మధ్య 8.41 లక్షల కోట్ల రూ.ల బడా కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేశారు. అందులో 75 శాతం అంటే 6.35 లక్షల కోట్ల రూ.లు 2014 -19

కాలానికి చెందినవే. ఆర్ బీఐ ప్రకారం మొత్తం ఆస్తులలో నిరర్థక ఆస్తులు వాటా 13.5 శాతం. 2014 నుండి కార్పొరేట్ సంస్థల మొండి బాకీలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేయడాన్ని పెద్ద స్కాంగా చెబుతారు.

## చట్టాల సరళీకరణ:

2019 లో 29 కేంద్ర చట్టాలను, నాలుగు లేబర్ కోడ్ లుగా రూపొందించారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మికుల సమస్త హక్కులు, సంక్షేమం, భద్రత రద్దయినాయి. రోజుకు పని గంటలు పెంచడానికి, వేతనాన్ని తగ్గించడానికి యజమానికి హక్కు ఉంటుంది. Insolvency and Bankruptcy Code, 2016 ను ఆమోదించటంతో దివాళా తీయటానికి, నిష్క్రమించడానికి కార్పొరేట్ సంస్థలకు సులభం అవుతుంది. చట్టాలలో 3400 క్రిమినల్ భాగాలను తొలగించారు. కార్పొరేట్ సంస్థలు ఇక చట్టబద్ధంగా నేరాలను చేయవచ్చు.

2021 నాటికి 25,000 చట్టాలను రద్దు చేశారు. 1486 కేంద్ర చట్టాలను సరళీకరించారు. 39,000 సమ్మతులను తగ్గించారు. 42 కేంద్ర చట్టాలను సరళీకరించడం కోసం జన విశ్వాస్ బిల్లును ఆమోదించారు. శ్రమదోపిడీని తీవ్రం చేయటానికి, పర్యావరణాన్ని విధ్వంసం చేయటానికి "సమర్థవంతమైన" లీగల్ వాతావరణాన్ని సృష్టించారు.

## మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలను సాధించారా?

ప్రకటించిన 100 మిలియన్లకు అదనంగా ఉద్యోగ కల్పన లక్ష్యంతో మొదలైన మేక్ ఇన్ ఇండియా, 2020-21 నాటికి మన కార్పొరేట్ తయారీ రంగం 24 మిలియన్ల ఉద్యోగాలను కల్పించింది. అందులో కోవిడ్ విపత్తు కాలంలో కోల్పోయిన ఉద్యోగాలు 11 మిలియన్లు. ఉద్యోగ కల్పనలో మేక్ ఇన్ ఇండియా వల్ల ఘోర వైఫల్యమే కనిపిస్తున్నది.

వాణిజ్య సౌలభ్య సూచీలో 2014లో మన దేశం యొక్క ర్యాంకు 142. ఇది 2019 నాటికి, అంటే కేవలం 5 సంవత్సరాలలో 63వ స్థానానికి ఎగబాకింది. అందువల్లనే, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు 2014-15లో 45.15 బిలియన్ల అమెరికన్ డాలర్ల నుండి 2021-22 నాటికి 83.60 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగాయి. ఆశ్చర్యకరంగా, తయారీ రంగ వార్షిక వృద్ధిరేటు 2014-15లో 7 శాతం ఉండగా 2019-20 నాటికి 6.9 శాతానికి తగ్గింది. అదేవిధంగా స్థూలదేశీయోత్పత్తిలో తయారీ రంగం వాటా 2014-15లో 16.3 శాతం. 2020-21 నాటికి 14.3 శాతానికి తగ్గింది. పైగా, కేంద్ర గణాంకాల సంస్థ అంచనాల ప్రకారం ఎగుమతులలో దేశీయ

విలువ జమ తగ్గింది. సమాంతరంగా విదేశీ విలువ జమ పెరిగింది. దిగుమతుల మీద ఆధారపడటం తీవ్రమైంది. అందువల్లనే విదేశీ వాణిజ్య లోటు జనవరి 2022లో 17.3 బిలియన్ల అమెరికన్ డాలర్లు. ఇది కేవలం 6 నెలల్లో అంటే జూన్ 2022 నాటికి 25.6 బిలియన్ల అమెరికన్ డాలర్లకు పెరిగింది. ఈ కారణాల వల్ల అమెరికన్ డాలర్ తో పోల్చినప్పుడు రూపాయి విలువ భారీ స్థాయిలో తగ్గుతూనే వున్నది.

మనదేశంలోకి ప్రవహించిన విదేశీ పెట్టుబడులను తయారీ రంగంలోకి మళ్ళించడంలో ప్రభుత్వం విఫలమైంది. తయారీ రంగంలోకి ప్రవేశించినా, దేశీయ పరిశ్రమల్లో వాటాలను కొంటారు. విలీనాలు జరుగుతాయి. ఇది దేశీయ ప్రైవేట్ పెట్టుబడిని వెళ్ళగొడుతుంది. 2018-19 ఆర్థిక సర్వే ప్రకారం 2012-17 మధ్యకాలంలో దేశీయ ప్రైవేటు పెట్టుబడులు తగ్గాయి. సగటు మూలధన సంచయనం వృద్ధిరేటు 2004-08 మధ్య 15 శాతం ఉండగా, 2014-19 లో 5.8 శాతానికి తగ్గింది. తక్కువ వడ్డీ రేటు ఉన్నప్పటికీ ప్రైవేటు పెట్టుబడులు పెరగలేదు. సమస్త రాయితీలను పొందినప్పటికీ, రుణాలను తిరిగి చెల్లించలేదు. ఈ ధోరణి 2016 నుండి బాగా తీవ్రమైందని RBI చెబుతున్నది. ప్రైవేట్ మూలధనం మందగించిందని 2023-24 ఆర్థిక సర్వే కూడా స్పష్టంగా చెప్పింది.

ప్రైవేటీకరిస్తున్న పబ్లిక్ రంగ సంస్థలను విదేశీ పెట్టుబడులు కొంటాయి. అంటే విదేశీ పెట్టుబడులు తయారీ రంగంలోకి ప్రవేశించినా, కొత్త సంస్థలు ఏర్పడవు, ఉత్పత్తులు పెరగవు అన్నది స్పష్టమైంది. ఎగుమతులు పెరగవు. పైగా దిగుమతుల మీద ఆధారపడటం తీవ్రం అవుతుంది.

చౌక శ్రమను దోపిడీ చేసే క్రమంలో అసెంబ్లింగ్ సంస్థలు వస్తాయి. గ్లోబల్ విలువ గొలుసుతో తక్కువ స్థాయిలో అనుసంధానం అవుతాయి. అసంఘటిత రంగంలో, స్వయం ఉపాధి రంగంలో దుర్భరమైన పరిస్థితులలో పనిచేస్తూ గ్లోబల్ ఉత్పత్తి నెట్వర్క్‌తో కనెక్ట్ అవుతారు. ఏ పెట్టుబడి లేకుండా, ఆధిపత్య దేశాల్లో ఉన్న బహుళ జాతి సంస్థలకు మన దేశం నుండి భారీ స్థాయిలో మిగులు తరలి వెళ్తుంది.

విదేశీ పెట్టుబడులు త్వరగా అధిక లాభాలనిచ్చే ఐటీ రంగానికి తరలివెళ్తాయి. లేదా, స్టాక్ మార్కెట్లోకి ప్రవేశిస్తాయి. అమెరికా వడ్డీ రేటు మీద ఆధారపడి వుండే విదేశీ పెట్టుబడులు అక్కడ వడ్డీ రేటు పెరగగానే మన దేశం నుండి తరలి వెళ్తాయి. అంటే విదేశీ పెట్టుబడుల మీద ఆధారపడటం వల్ల మన ఆర్థిక రంగం ఎప్పుడూ అస్థిరమైన స్థితిలోనే వుంటుంది.

2020–2023 మధ్యకాలంలో 33 వేల కంపెనీల సర్వే ప్రకారం పన్నుకు ముందు లాభాలు నాలుగు రెట్లు పెరిగాయని మన ఆర్థిక సర్వే 2023–24 చెబుతుంది. బిజినెస్ లైన్ నివేదిక ప్రకారం గత 15 సం.లలో అత్యధిక స్థాయి లాభాలు 2024 విత్త సంవత్సరంలో వచ్చాయి. నిఫ్టీలో కార్పొరేట్ లాభాలు పెరిగాయి. అయినా ప్రైవేటు పెట్టుబడులు పెరగలేదు. మొండిబాకీలు మాత్రం పెరిగాయి. కార్పొరేట్ సంస్థల రుణగ్రస్తత పెరిగిందని ఆర్థిక సర్వే 2023–24 చెబుతుంది.

2019–23 మధ్యకాలంలో సమస్త రాయితీలను తీసుకున్న ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెరగలేదు. ప్రభుత్వ పెట్టుబడుల వల్లనే ఆర్థిక వ్యవస్థ నిలుస్తున్నది. అంటే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఎవరికోసం?

ఆర్థిక సర్వే 2023–24 ప్రకారం కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ కల్పన లేదు కాబట్టి ప్రజల ఆదాయంలో వృద్ధి లేదు. అందువల్ల సమిష్టి డిమాండ్ పెరగలేదు. కార్పొరేటు సంస్థలు తమ ఉత్పత్తులను విక్రయించలేవు. అయితే సమిష్టి డిమాండ్ లోపాన్ని గుర్తించిన ఆర్థిక సర్వే, ప్రభుత్వం బలంగా అనుసరిస్తున్న సప్లై గొలుసు ప్రోత్సాహక విధానాలను సమర్థించడం వైరుధ్యమే, విడ్డూరమే. ప్రభుత్వమే పెంచి పోషిస్తున్న విధానాల వల్ల ఆర్థిక నిర్మాణాలు వక్రీకరించబడ్డాయి. అందువల్లనే నిరుద్యోగ సంక్షోభం తీవ్రమవుతున్నదని గుర్తించిన ఆర్థిక సర్వే 2023–24 సమస్యకు కారణం ఆర్థిక షాక్‌లను చెప్పటం ఆశ్చర్యమే. లాభాల వెంపర్లాటలో కార్పొరేట్ సంస్థలు కొట్టుకపోవద్దని, ఉద్యోగ కల్పన బాధ్యత తీసుకోవాలని ఆర్థిక సర్వే కార్పొరేట్ సంస్థలను బతిమిలాడుకుంటున్నది. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, విద్యా వేత్తలు సమిష్టిగా కృషి చేసి సమస్యను పరిష్కరించాలని సూచించింది. కాగా 2024–25 కేంద్ర బడ్జెట్‌లో కూడా కార్పొరేట్ పన్నులు, రాయితీలు, ప్రోత్సాహకాలు ఇంకా బలంగా కొనసాగాయి.

## అసంఘటిత రంగం, చిన్న, మధ్యతరహా సంస్థలు:

ఈ సంస్థలకు చెందిన తయారీ రంగం, మేక్ ఇన్ ఇండియా సప్లై గొలుసు ప్రోత్సాహకాల పరిధిలోకి రాదు. అయినప్పటికీ మెజారిటీ ప్రజలకు జీవనోపాధి ఈ రంగాలలోనే లభిస్తుంది. నియత, అనియత రంగాలలో కూడా కాంట్రాక్టు, పార్ట్ టైం, క్యాజువల్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలే. గౌరవప్రదమైన ఉద్యోగాలు, శ్రామికుల హక్కులు, సంక్షేమం కాలం చెల్లినవే అయినాయి.

కంపెనీల చట్టం కింద రిజిస్టర్ కాని సంస్థలను unincorporated sector enterprises (USE) అంటారు. వీటికి సంబంధించిన 2021–22, 2022–23 వార్షిక సర్వేలను జాతీయ శాంపిల్ సర్వే సంస్థ ఇటీవల కాలంలో విడుదల చేసింది.

2015–16లో ఈ సంస్థల సంఖ్య 6.33 కోట్లు. ఉద్యోగిత 11.12 కోట్లు. కాగా, 2021–22 నాటికి సంస్థల సంఖ్య 5.97 కోట్లు. ఉద్యోగిత 9.78 కోట్లకు తగ్గింది. 2022–23లో తగ్గుదల ఇంకా అధికంగా వున్నది. ఇందులో తయారీ రంగంలో తగ్గుదల సాపేక్షికంగా అధికంగా వున్నది. 2016 లో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు వల్ల ఈ రంగానికి చెందిన సంస్థల మనుగడ ప్రమాదంలో పడింది. వీటి లావాదేవీలన్నీ నగదు తోనే ముడిపడి వుంటాయి 2017లో ప్రవేశపెట్టిన వస్తు సేవల పన్నుతో ఈ సంస్థలన్నీ పరోక్ష పన్నుల పరిధిలోకి వచ్చాయి. 2,30,000 సంస్థలు మూతపడ్డాయని అంచనా. కోవిడ్ విపత్తు వల్ల 5 లక్షల సంస్థలు మూతపడ్డాయని ప్రభుత్వమే పార్లమెంటుకు సమాచారాన్ని ఇచ్చింది. సడన్ లాక్ డౌన్ ప్రకటనతో 189 మిలియన్ల శ్రామికులు ఉపాధులను కోల్పోయారు. 400 మిలియన్ల మంది ఉపాధులు ప్రమాదంలో పడ్డాయని అంచనా. అందువల్లనే ఈ సంస్థల ఉత్పత్తులకు రిజర్వేషన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆర్థిక సర్వే 2023–24 సూచించింది.

గ్రామీణ దుర్భరత, వ్యవసాయ సంక్షోభం సాంద్రత రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. రోజు కూలీ 182 రూపాయలతో సంవత్సరానికి 100 రోజుల ఉపాధిని కల్పించడంలో MGNREGA విఫలమవుతున్నది. బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయి. ఉపాధి కార్డులను తగ్గిస్తున్నారు. వేతన బకాయిలు పెరుగుతున్నాయి. మొత్తం సాగు భూమిని కాంట్రాక్టు సాగు పేరిట కార్పోరేట్లకు స్వాధీనం చేయటానికి నల్ల రైతు చట్టాలు వచ్చాయి. సంవత్సరానికి పైగా రైతుల నిరసన, ప్రతిఘటన వల్ల ప్రస్తుతం అమలు మాత్రం ఆగిపోయింది. కనీస మద్దతు ధర ఇవ్వరు. రెగ్యులేటెడ్ మార్కెట్లు లేవు. "ఒకే దేశం, ఒకే మార్కెట్ "అంటారు. సమీపంలో ఉన్న చిన్న టౌన్ వరకు కూడా చిన్నాచితకా రైతులు వెళ్లలేని స్థితి.

2024–25 కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగంలో సప్లై గొలుసును బలోపేతం చేయటం కోసం ప్రకటించిన ప్రతిపాదనలన్నీ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే. అందువల్లనే "పిఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన" ను మరొక 5 సంవత్సరాలు పొడిగిస్తామని, 80 కోట్ల మందికి అందజేస్తామని ప్రకటించారు. దాదాపు దేశ జనాభాలో 50 శాతం మంది నెలకు 5 కిలోల ఉచిత రేషన్ తీసుకునే పరిస్థితి ఇంకా 5 సంవత్సరములు కొనసాగుతుందన్నమాట.

వ్యవసాయ సంక్షోభాన్ని తగ్గించటానికి ఏ చర్యలూ లేవు. 2019 నుండి వ్యవసాయ రంగానికి కేటాయింపులు ఇంకా ఇంకా తగ్గుతున్నాయి. వ్యవసాయ రంగానికి

ఇచ్చే సబ్సిడీలు తగ్గిపోతున్నాయి. 16 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ రుణాలను మాఫీ చేశారు. కానీ పంట రుణాలను మాఫీ చేయరు..

ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం 2022-23 లో వ్యవసాయ రంగం వృద్ధిరేటు 4.7 శాతం ఉండగా, 2023-24 లో 1.4 శాతానికి తగ్గింది. తక్కువ వడ్డీకి పంట రుణాలు, పంట బీమాలను నిరంతరాయంగా, కరెంటు సప్లై, నీటిపారుదల వసతుల విస్తరణ మొదలగునవి తప్పనిసరిగా, త్వరగా తీసుకోవాల్సిన చర్యలు.

వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఉత్పాదకత, సప్లై, మార్కెటింగ్, గిడ్డంగులు, సహజ వ్యవసాయం, మిల్లెట్ హబ్ మొదలగునవన్నీ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని పెంచడానికే. అందుకే రైతుల ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. బతుకుతెరువు కోసం వలసలు వెళ్ళే కూలీల సంఖ్య పెరుగుతూనే వున్నది. 2020 నాటికి వలస కూలీల సంఖ్య 35 కోట్లకు చేరుకున్నదని అంచనా. "వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు" తో సమస్య పరిష్కారం అవుతుందని ప్రభుత్వం చెప్పటం అంటే వలస కూలీల సమస్యను అపహాస్యం చేయటమే.

## యువత సాధికారత - కేంద్ర బడ్జెట్ 2024-25:

విద్య, నైపుణ్యాలు, గౌరవప్రదమైన ఉపాధి లభ్యతతో యువత సాధికారత బలంగా ముడిపడి వుంటుంది. ప్రజలందరికీ విద్య, ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం పెరగాలి అని World Bank Group's Flagship Report, 2024 ప్రకారం కృత్రిమ మేధ వల్ల భారీఎత్తున ఉద్యోగాలు గల్లంతవుతాయని, అసమానతలు తీవ్రమవుతాయని చెబుతుంది. గత సంవత్సరం నుండే ప్రపంచం మొత్తంలో భారతదేశంలో కూడా ఐటీ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాలను తొలగిస్తున్నారు. ఐఎల్ఓ రూపొందించిన ఇండియా ఎంప్లాయిమెంట్ పేపర్, 2024 భారతదేశంలో 83 శాతం యువత నిరుద్యోగులే. అసంఘటిత రంగంలో క్యాజువల్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ శ్రామికులుగా పనులు వెతుక్కుంటున్నారని చెబుతుంది. 2000 సంవత్సరంలో 35.2 శాతం వున్న ఈ స్థితి 2024లో 83 శాతానికి పెరిగింది. ఆర్థిక సర్వే 2023-24 యువతకు ఉద్యోగం అంటే హుందాతనం, గౌరవం, డిగ్నిటీ. ఈ విషయాన్ని కార్పొరేట్ శక్తులు గుర్తించి ఉద్యోగాలను ఇవ్వాలంటుంది.

అందువల్ల కేంద్ర బడ్జెట్ 2024-25 లో యువత నైపుణ్యం, ఉద్యోగిత గురించి మాట్లాడక తప్పలేదు. కానీ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు, లాభాలు, ఆధిపత్యం వల్ల ఏర్పడే తీవ్రమైన ఉద్యోగ సంక్షోభానికి పరిష్కారాన్ని గుత్త పెట్టుబడుల లాభాలను పెంచడంలోనే వెతకటం, సప్లై గొలుసును ప్రోత్సహించడం వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని

సప్లై గొలుసును బలోపేతం చేయటం ద్వారా పరిష్కరిస్తామని చెప్పటం తీవ్ర సంక్షోభంపై చర్చను పక్కదారి పట్టించడమే.

1000 ఐటిఐ విద్యాసంస్థలను అప్డేట్ చేస్తామని, నైపుణ్యాలు నేర్చుకోవడానికి యువతకు రుణాలను ఇస్తామని చెబుతున్నారు. నిజానికి విద్యారంగం కార్పొరేటీకరణ వల్లనే చాలమంది విద్యకు దూరమైనారు. మూలధన సాంద్రత, టెక్నాలజీ సాంద్రత అధికమైనాయి. దిగుమతుల ఆధారిత వ్యవస్థగా మలచబడింది. దీనికితోడు కృత్రిమ మేధ వల్ల పెనుముప్పు విరుచుకుపడుతున్న సందర్భంలో అప్పులిచ్చి నైపుణ్యాలు నేర్పటం ఎందుకు? ఆర్థిక వ్యవస్థ నిర్మాణాలను మార్చకుండా ఉద్యోగ సృజన సాధ్యమేనా?

మహిళల విషయంలో ఉమెన్ స్పెసిఫిక్ స్కిల్లింగ్‌కి ప్రాధాన్యతను ఇస్తామని ప్రకటించారు. ఈ నైపుణ్యాల వల్లనే కోవిడ్ విపత్తు సమయంలో మహిళలు అధికంగా ఉపాధిని కోల్పోయారని ప్రపంచ బ్యాంకు చెబుతున్నది. అభద్రతతో కూడిన నైపుణ్యాలను మహిళలకు నేర్పటం ఎందుకు?

కంపెనీలు కొత్తవాళ్లను ఉద్యోగంలోకి తీసుకోవటానికి ఒక నెల జీతం ప్రభుత్వమే ఇస్తుంది. దీనివల్ల ఉద్యోగ కల్పన జరగదు. కానీ కంపెనీల వేతన వ్యయం తగ్గుతుంది. తయారీ రంగంలో ఉద్యోగ కల్పన కోసం పన్ను విరామం, సబ్సిడీలను కంపెనీలకు ప్రభుత్వం ఇస్తుంది. 500 టాప్ స్థాయి కంపెనీలలో వ్యాపార మెలకువలు నేర్చుకోవడానికి 5 సంవత్సరాలలో కోటి మంది యువతకు 12 నెలల పాటు ఇంటర్న్ షిప్ ప్రభుత్వం కల్పిస్తుంది. నెలకు 5000 రూ.ల అలవెన్సు, 6000 రూ.ల వన్ టైం సహాయాన్ని ప్రభుత్వమే ఇస్తుంది. అంటే ప్రభుత్వమే చెల్లించే అతి తక్కువ అలవెన్స్‌తో టాప్ లెవెల్ కంపెనీలు సంవత్సరానికి 20 లక్షల మందితో పనిచేపిస్తారంట. యువత సాధికారత పేరిట నైపుణ్యాలు అందజేసే వ్యూహం, ఉద్యోగ ప్రతిపాదనలు యువతను అవమానిస్తున్నాయి. రోజురోజుకీ యువతలో పెరుగుతున్న అసహనాన్ని ఏదోక విధంగా తగ్గించి తమ రక్షణ కవాటాలు గట్టిపరుచుకో చూస్తున్నారు. ఇలాంటి చిట్కాలు సంక్షోభంలో పడిన ఏ దేశాలను,చివరికి మన ఇరుగు పొరుగు దేశాల పాలకులను సైతం కాపాడలేక పోయాయి.

సామ్రాజ్యవాద దోపిడీ, పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణాలను నిర్మూలించకుండా నిరుద్యోగ సంక్షోభానికి పరిష్కారం అసాధ్యం. ఆ దిశగా యువత సంఘటితంగా బలమైన పోరాటాలు చేయాల్సిందే.

♦◆♦

## LAND ALIANATION

*Prof. Thota. Jyothirani*



పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధికి సంబంధించిన సమస్త అంశాలు భూకబ్జాల మీదనే – అంటే సాగు భూములు, బంజరు భూములు, అడవులు, ఖనిజాలు, సమిష్టి ఆస్తి వనరులను ఆక్రమించుకోవడంతోనే ముడిపడి వుంటుంది. ఈ క్రమంలోనే లక్షలాది ఎకరాల భూములను అభివృద్ధి పేరిట, సెజ్‌ల పేరిట స్వాధీనం చేసుకోవడం వలన లక్షలాదిమంది రైతులు, రైతుకూలీలు, ఆదివాసీలు భూముల నుండి, జీవనోపాధుల నుండి పరాయీకరించబడ్డారు. జీవన విధ్వంసానికి బలవుతున్నారు. ఈ అభివృద్ధి నమూనా వల్ల ఏర్పడిన వాతావరణ సమస్యకు పరిష్కారంగా పాలకులు సోలార్ ఎనర్జీ ఉత్పత్తి పేరుతో లక్షలాది ఎకరాల భూములను కార్పొరేటు దిగ్గజాలకు అప్పజెబుతున్నారు. గనులను ప్రైవేటీకరించి లాభాల కోసమే పనిచేసే గుత్త పెట్టుబడులకు అప్పజెప్పడం వలన మెజారిటీ ప్రజల జీవితాలు సంక్షోభంలోకి నెట్టివేయబడటమే గాక గోతులతో నిండిన డొల్ల భూములే మిగులుతాయి.